నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ గురువారం 5-11-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:80 పేజీలు:4 వెల: రూ.1/-

అమెరికా అధ్యక్ష పదవి ఎవరికి దక్కునో?

తొలి ఫలితాల మేరకు ఆధిక్యంలో జోబిడెన్

హైదరాబాద్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ఇంకా విజేతను తేల్చలేకపోయాయి. ట్రంప్ గెలుస్తారా లేక బైడెన్ గెలుస్తారా ఇంకా చెప్పలేని పరిస్థితి. ప్రస్తుతం బైడెన్ లీడింగ్‌లో ఉన్నా.. కీలక రాష్ట్రాల్లో తామే విజయం సాధిస్తామని ట్రంప్ అన్నారు. దీంతో అధ్యక్ష రేసు ఆసక్తికరంగా మారింది. వీలైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని ట్రంప్ ప్రకటించడం మరి కొంత టెన్షన్ పుట్టిస్తున్నది. ఈ దశలో అసలు అమెరికా ఎన్నికల ఫలితాల పరిణామాలు ఎలా ఉంటాయో పరిశీలిద్దాం.



న్యాయపోరాటం..

ముందస్తు ఓటింగ్‌లో రిపబ్లికన్ల కన్నా ఎక్కువ శాతం డెమెక్రాట్లు ఓటేసినట్లు తెలుస్తోంది. పెన్సిల్వేనియా, విస్కిన్‌సన్ రాష్ట్రాల్లో ఎలక్షన్ డే వరకు ఆ ఓట్లను లెక్కించలేదు. అయితే తొలుత ఆ రాష్ట్రాల్లో ట్రంప్ ఆధిక్యంలో ఉన్నా.. పోస్టల్ బ్యాలెట్లు ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ట్రంప్ ఆ ఓట్లను లెక్కించవద్దు అన్న సందేశాన్ని వినిపించారు. ఓటింగ్ విధానం, బ్యాలెట్ కౌంటింగ్‌పై కొన్ని రాష్ట్రాలు కోర్టుకు వెళ్లే పరిస్థితి కూడా ఉన్నది. 2000 సంవత్సరంలో జార్జ్ బుష్ కూడా ఫ్లోరిడా విషయంలో కోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాలతో అక్కడ రికౌంటింగ్ ఆపేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో అమీ కానే బారెట్‌ను ట్రంప్ నియమించారు.

దీంతో కోర్టులో ట్రంప్‌కు 6-3 మెజారిటీ వచ్చింది. ఈ నేపథ్యంలో ఒకవేళ కోర్టుకు వెళ్తే, అప్పుడు ట్రంప్‌కు అనుకూలంగా తీర్పు వెలువడే అవకాశాలు ఉన్నాయి.

ఎలక్టోరల్ కాలేజ్..

అమెరికా ఎన్నికల్లో 538 మంది పోటీపడుతారు. వారిని ఎలక్టోరల్ కాలేజ్ అంటారు. వారే దేశాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. 2016లో పాపులర్ ఓటింగ్‌లో ట్రంప్ వెనుకబడ్డా.. ఆయన మాత్రం 304 ఎలక్టోరల్ ఓట్లతో అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఆ ఎన్నికల్లో హిల్లరికి 227 ఓట్లు వచ్చాయి. ప్రతి రాష్ట్రంలో పాపులర్ ఓటు గెలిచినవారే.. ఆ రాష్ట్ర ఎలక్టర్లను ఎన్నుకుంటారు. ఈ ఏడాది డిసెంబర్ 14వ తేదీన ఆ ఎన్నిక జరగనున్నది. ఆ తర్వాత ఉభయసభలు జనవరి ఆరవ తేదీన ఓట్ల లెక్కింపు కోసం భేటీ అవుతాయి. ఆ సమావేశంలో అధికారికంగా విజేతను ప్రకటిస్తారు. సాధారణంగా గవర్నర్లు ఎలక్టోరల్ విజేతను వెల్లడిస్తారు. కానీ పెన్సిల్వేనియా, మిచిగన్, విస్కిన్‌సన్, నార్త్ కరోలిన రాష్ట్రాల్లో డెమోక్రటిక్ గవర్నర్లు ఉన్నారు. దీంతో ఆ రాష్ట్రాల్లో ట్రంప్‌కు సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

కాంటింజెంట్ ఎలక్షన్..

ఒకవేళ ఏ అభ్యర్థికి కూడా ఎలక్టోరల్ మెజారిటీ దక్కకపోతే.. అప్పుడు రాజ్యాంగంలోని 12వ సవరణ ప్రకారం కాంటింజెంట్ ఎన్నిక నిర్వహిస్తారు. అంటే.. హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ ప్రతినిధులు.. దేశాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఇక సేనేట్ ప్రతినిధులు ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఒకవేళ 269-269 వచ్చినా.. అప్పుడు కూడా కాంటింజెంట్ ఎలక్షన్ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఓట్లు అయినా.. కోర్టు అయినా ఫలితం మాత్రం కచ్చితంగా జనవరి 20వ తేదీ లోపు తేలాలి. ఒకవేళ ఆ నాటికి కూడా విజేత ఎవరో తెలియనప్పుడు.. హౌజ్ స్పీకర్.. తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ప్రస్తుతం స్పీకర్‌గా నాన్సీ పెలోసి ఉన్నారు.

సిద్దిపేట ఇవిఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు

సిద్దిపేట ఇందూరు కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు

సిద్దిపేట,నవంబర్4(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉపఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలు, వీవీప్యాట్‌లను పటిష్ట భద్రత నడుమ స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లను సిద్దిపేటలోని ఇందూరు ఇంజనీరింగ్ కాలేజీలో స్ట్రాంగ్ రూంకు అధికారులు బుధవారం తెల్లవారుజామున తీసుకువచ్చారు. మంగళవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం 315 పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను లచ్చపేటలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, వీవీప్యాట్‌లను అందించారు. రాత్రి పొద్దుపోయే వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం వాటిని మూడంచెల పోలీసు భద్రత మధ్య ప్రత్యేక వాహనాల్లో సిద్దిపేటలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యామలా ఇక్బాల్, జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి, సీపీ జోయల్ డేవిస్, రిటర్నింగ్ అధికారి బీ చెన్నయ్య, ఎన్నికల్లో పోటీచేసిన పలువురు అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో అధికారులు స్ట్రాంగ్ రూంకు సీల్ వేశారు. పరిసర ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ నెల 10న ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. సరిసర ప్రాంతాలకు ఎవరూ రాకుండా ఆంక్షలు విధించారు. ఇదిలావుంటే దుబ్బాక అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నిక పోలింగ్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. రికార్డుస్థాయిలో 82.61 శాతం పోలింగ్ నమోదయింది. ఫలితాలు ఈ నెల పదోతేదీన వెలువడనున్నాయి. మొత్తం 1,98,807 మంది ఓటర్లలో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓటుహక్కును వినియోగించుకొన్నారు. 11 మంది కొవిడ్ రోగులు పీపీఈ కిట్లు ధరించి వచ్చి ఓటు వేశారు. వీరిని అంబులెన్సులో ప్రభుత్వ వైద్య సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చారు. మొత్తం 315 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించారు. తర్వాత ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలవరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రంలో ఉన్న వారందరికీ ఓటు వేసుకొనేందుకు అధికారులు అవకాశాన్ని కల్పించారు.

దేశంలో 46,253 కొత్త కేసులు

మరో 514 మరణాలు నమోదు

న్యూఢిల్లీ,నవంబర్4(ఆర్ఎన్ఎ): దేశంలో మంగళవారం కరోనా కేసుల సంఖ్య 40 వేల దిగువకు చేరి కాస్త ఊరట కలిగించినా..బుధవారం మరోసారి ఆ కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపించింది. గడిచిన 24 గంటల్లో 46,253 కొత్త కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అందుకు నిర్ధారణ పరీక్షల సంఖ్య పెరగడమూ ఓ కారణంగా కనిపిస్తోంది. మరోవైపు, దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 5,33,787గా ఉండగా..ఈ రేటు 6.42శాతానికి తగ్గింది. అలాగే వైరస్ బారినపడి కోలుకున్నవారి శాతం 92.09గా ఉంది. కాగా, దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 83,13,876 మంది వైరస్ బారిన పడ్డారు.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే కోటి కేసులకు చేరువ కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు 76,56,478 మంది కోలుకున్నవారు. గత 24 గంటల్లో 514 మంది మరణించగా..ఈ మహమ్మారి కారణంగా ఇప్పటి వరకు 1,23,611 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా, మంగళవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 12,09,609 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. దాంతో మొత్తం పరీక్షల సంఖ్య 11,29,98,959కు చేరింది. ఇకమరోవైపు దేశరాజధాని ఢిల్లీలో కరోనా కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఢిల్లీ ప్రభుత్వం విడుదల చేసిన హెల్త్ బులెటిన్ ప్రకారం మంగళవారం మొత్తం 59,540 మందికి కరోనా టెస్టులు చేయగా, వారిలో 6,725 మందిని పాజిటివ్‌గా గుర్తించారు. అంటే మొత్తం టెస్టులలో 11.29 శాతం మేరకు కరోనా వైరస్ ఉన్నట్లు స్పష్టమయ్యింది. దీంతో ఇప్పటివరకూ 8.36గా ఉన్న కరోనా పాజిటివ్ రేటు 11.29కి చేరుకుంది. కాగా ఇదే సమయంలో ఢిల్లీలో 3,610 మంది కరోనా నుంచి కోలుకున్నారు. దీంతో ఢిల్లీలో కరోనా నుంచి కోలుకున్నవారి సంఖ్య 3,60,069కి చేరింది. గడచిన 24 గంటల్లో ఈ వైరస్ కారణంగా 48 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఢిల్లీలో మొత్తం కరోనా మృతుల సంఖ్య 6,652కు చేరుకుంది. ప్రస్తుతం ఢిల్లీలో మొత్తం 36,375 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఢిల్లీలో ఉష్ణోగ్రతలు తగ్గడం, చలి పెరగడం, పండుగల వాతావరణం ఇవన్నీ కరోనా కేసుల పెరుగుదలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో తిరిగి రోజుకు 12 వేల కరోనా కేసులు నమోదయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం మరింత అప్రమత్తమై, కరోనా కట్టడి చర్యలను మరింత కఠినంగా చర్యలు అమలు చేసేందుకు సన్నద్ధమయ్యింది. అలాగే కరోనా బాధితుల కోసం మరిన్ని పడకలను ఏర్పాటు చేసేందుకు సమాలోచనలను జరుపుతోంది.

అన్నివర్గాల సంక్షేమమే కెసిఆర్ లక్ష్యం: కొప్పుల

హైదరాబాద్,నవంబర్4(ఆర్ఎన్ఎ): సబ్బండ వర్ణాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వర్చువల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తామంతా అంకితభావంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. సేవాభావంతో వృద్ధుల ఆశ్రమాలను నడుపుతున్న వారికి చేయూత నిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాలలో ఆశ్రమాలను నెలకొల్పేందుకు చర్యలు చేపట్టామని వివరించారు.

పొంచివున్న సెకండ్‌వేవ్ ప్రమాదం

-అంతా జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

హైదరాబాద్,నవంబర్4(ఆర్ఎన్ఎ): శీతాకాలంలో కరోనా సెకండ్ వేవ్ పొంచి ఉందని.. కరోనా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని డాక్టర్లు చెబుతున్నారు. ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచించారు. ఇప్పటికే యూరప్, బ్రిటన్ దేశాల్లో కరోనా సెకండ్ వేవ్ ప్రారంభం కావడంతో లాక్ డౌన్ విధించారన్నారు. భారత దేశంలో గత రెండు మూడు నెలల కంటే కేసుల సంఖ్య పెరుగతోందన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి, సామాజిక దూరం పాటించాలన్నారు. ప్రస్తుతం కరోనా సోకిన వారు హోం ఐసోలేషన్‌లో ఉంటూ డాక్టర్లు సూచించిన మందులు, నిబంధనలు పాటిస్తే త్వరగా కోలుకుంటారని డాక్టర్లు తెలిపారు. ఆస్పత్రిలో కంటే ఇంట్లో కుటుంబ సభ్యులే పేషెంట్ పట్ల ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటారని అన్నారు. ఇంట్లో ఉన్న సదుపాయాలు ఆస్పత్రుల్లో అందడంలేదన్నారు. రూ. 5 వందల నుంచి రూ. 15 వందలు ఖర్చుపెట్టి కోవిడ్ నుంచి బయటపడినవారు చాలామంది ఉన్నారని తెలిపారు. కాగా గతంలో కరోనా సోకినవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే ఏ మాత్రం అనుమానం ఉన్నా వైద్యులను సంప్రదించి జాగ్రత్తలు పాటించాలన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ నా జాతీయ భావమ్ముల
జాలుల నందించి భరత స్వాతంత్ర్యంబున
కు ప్రాణము మొనరింపు - గాలుటకు -
ప్రాణము పైనట్టి "చిత్తరంజనదాసునే !!

(నవంబర్ 5 చిత్తరంజన దాసు జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210

భోపాల్ ఉప ఎన్నికల ఫలితాలపై బిజెపి ధీమా

అన్ని సీట్లు గెలుస్తామంటున్న సిఎం చౌహాన్

భోపాల్,నవంబర్4(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో అధికార బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. కరోనా భయాన్ని అధిగమించి ప్రజలు పెద్దసంఖ్యలో ఓట్లు వేశారని, ఇది ప్రజాస్వామ్యానికి బలమని చెప్పారు. భారీ ఓటింగ్ వల్ల బీజేపీ ఘన విజయం సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పార్టీకి ఓటేసినవారందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని 28 అసెంబ్లీ స్థానాలకు మంగళవారం ఉపఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 57.09 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఫలితాలను ఈనెల 10న ప్రకటిస్తారు. అత్యధికంగా అగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 80.46 శాతం ఓట్లు నమోదవగా, సుమావోలీలో 41.79 శాతం ఓట్లు పోలయ్యాయని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు మొత్తం 10 రాష్ట్రాల్లో ఉపఎన్నికలు జరిగాయి. మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు జరుగుతున్న 28 స్థానాల్లో 22 స్థానాలు బిజెపిలో చేరిన కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియా అనుయాయులు పోటీ చేసినవే. 28 స్థానాల్లో 10 సీట్లు గెలిచినా శివరాజ్ సింగ్ చౌహాన్ సర్కార్‌కు ఢోకా ఉండదు. కాని తన అనుయాయులు అందర్నీ గెలిపించుకోకపోతే జ్యోతిరాదిత్య సింధియా భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది. అందుకే ప్రచారంలో సింధియా బాగా పనిచేశారు.

సెలబ్రిటీలకు చెంపపెట్టు తమిళనాడు హైకోర్టు తీర్పు

ప్రకటనలపై ఒళ్లు జాగ్రత్త పెట్టాల్సిందే

న్యూఢిల్లీ,నవంబర్4(ఆర్ఎన్ఎ): తమిళనాడు హైకోర్టు షాకిచ్చే నిర్ణయం తీసుకుంది. డబ్బు సంపాదనే ధ్యేయంగా ప్రకటనలకు పోజులిస్తున్న సెలబ్రిటీలకు ఇదో చెంప పెట్టులాంటి నిర్ణయం తమిళనాడు హైకోర్టు ఇచ్చిన తీర్పు ఇప్పుడు సెలబ్రిటీలకు ఓ హెచ్చరిక లాంటిదిగా చూడాలి. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ పై మద్రాస్ హైకోర్టు సీరియస్ అయింది. ఆన్ లైన్ బెట్టింగ్ వెబ్ సైట్లకు సెలబ్రిటీలు ప్రచారం చేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సినీ, క్రీడా ప్రముఖులైన విరాట్ కోహ్లీ,గంగూలీ, తమన్నా, ప్రకాశ్ రాజ్, రానా, సుదీప్‌లకు కోర్టు నోటీసులిచ్చింది. ఆన్ లైన్ రమ్మికి ఎంతో మంది బానిసలుగా మారి ఎంతో మంది డబ్బులు పోగొట్టుకుంటున్నారు. కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. ఈ క్రమంలో దీన్ని నిషేధించాలని ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీన్ని విచారించిన కోర్టు ఆన్‌లైన్ జూదానికి సంబంధించిన డబ్బు ఎక్కడకు పోతుందని తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తెలంగాణలో ఆన్ లైన్ జూదాన్ని నిషేధించిన విషయాన్ని గుర్తు చేసిన మధురై బెంచ్ తమిళనాడులో అలాంటి ప్రయత్నాలు ఏమైనా చేశారా అని అడిగింది. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ నిషేధంపై పది రోజుల్లో చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్టు చెప్పారు. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. అయితే గతంలోనూ ఓ మారు ఇలాంటి తీర్పు వచ్చింది. ఏదైనా వస్తువు నాణ్యత, రియల్ ఎస్టేట్‌లో చాపచుట్టేసిన కంపెనీ కేసులో ధోనీకి కూడా నోటీసులు ఇచ్చారు. దీనిపై చర్చ జరిగింది. మొత్తంగా రానురాను ప్రొడక్ట్ నాణ్యతపైనా ఆలోచించి ప్రకటనలకు ఒప్పుకోవాల్సి ఉంటుంది.

సిఎం నితీశ్‌పై ఉల్లిగడ్డల దాడి

తీవ్రంగా ఖండించిన తేజస్వీయాదవ్

పాట్నా,నవంబర్4(ఆర్ఎన్ఎ): సీఎం నితీశ్ పై జరిగిన ఉల్లిగడ్డల దాడిని మహాఘట్ బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ ఖండించారు. నిరసన తెలపడానికి వివిధ రకాలైన ప్రజాస్వామ్య పద్ధతులున్నాయని హితవు పలికారు. ఈ సంఘటనను ఖండిస్తున్నా. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ద్వారా నిరసన తెలిపే అవకాశం ఉంది. అది జరగాల్సిన ఘటన కాదు. ఇది ఎంత మాత్రమూ సమంజసం కాదని తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మధుబనీ ప్రాంతంలో సీఎం నితీశ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయనపై ఉల్లిగడ్డలతో దాడికి దిగారు. వెంటనే తేరుకున్న భద్రతా సిబ్బంది... ఆయన చుట్టూ రక్షణ కవచంలా నిలబడ్డారు.

అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

విద్య, వైద్య రంగాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు
కరోనా నియంత్రణలో ఇతర రాష్ట్రాల కంటే బెటర్
వ్యాక్సిన్ క్యాపిటల్‌గా, బల్క్ డ్రగ్ ప్రొడక్షన్‌లో అగ్రగామి
అందుబాటులో ఇళ్లు, ఇళ్ల స్థలాల ధరలు
ఆరేళ్లలో తెలంగాణ అద్భుత ప్రగతి:మంత్రి కేటీఆర్

హైదరాబాద్,నవంబర్4(ఆర్ఎన్ఎ): నగరంలో వర్షాలు, వరదలను తట్టుకునేలా నాలాల అభివృద్ధి చేపడు తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. కరోనా నియంత్రణలో ఇతర రాష్ట్రాల కంటే చాలా మెరుగ్గా ఉన్నామని తెలిపారు. వరల్డ్ వ్యాక్సిన్ క్యాపిటల్‌గా, బల్క్ డ్రగ్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉన్నామన్నారు. అమెజాన్, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలకు నగరంలో కార్యాలయాలు ఉన్నాయని, హైదరాబాద్‌లో ఇండ్లు, స్థలాల ధరలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరేళ్లలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అలాగే హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో ఐటీ విస్తరణకు చర్యలు తీసుకుంటు న్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఆ ప్రాంతంలో రవాణా, ఇతర మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నైట్ ఫ్రాంక్ కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. నైట్ ఫ్రాంక్ హైదరాబాద్ స్పెషల్ రిపోర్టును కూడా మంత్రి కేటీఆర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్‌తో పాటు నైట్ ఫ్రాంక్ ఇండియా లీడర్‌షిప్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ సర్వేలో నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రసిద్ధిగాంచింది అని కేటీఆర్ తెలిపారు. అమెజాన్, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో ఆఫీసులు ప్రారంభించాయి. ఇండ్లు, స్థలాల ధరలు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో హెల్త్ కేర్, వైద్య, విద్యా రంగంలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కరోనా నియంత్రణలో ఇతర రాష్ట్రాల కంటే చాలా మెరుగ్గా ఉన్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ సమర్థవంతంగా కరోనాను ఎదుర్కొంది అని తెలిపారు. వరల్డ్ వ్యాక్సిన్ క్యాపిటల్‌గా, బల్క్ డ్రగ్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. వ్యాక్సిన్‌ల తయారీలో హైదరాబాద్ ప్రపంచంలోనే నంబర్ వన్ కానుందన్నారు. కొవిడ్ వ్యాక్సిన్ హైదరాబాద్ నుంచే వచ్చే అవకాశం ఉందన్నారు.ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పాలసీని కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. హైదరాబాద్ మహానగరాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ శాటిలైట్ టౌన్‌షిప్స్ అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక నూతన పాలసీలు తీసుకొచ్చామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. హైదరాబాద్‌లో వర్షాలు, వరదలను తట్టుకునేలా నాలాలను అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. అనతికాలంలోనే అద్భుత ప్రగతి సాధించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. దేశంలో హైదరాబాద్ నగరం అద్భుతంగా అభివృద్ధిలో ముందుకు వెళ్తుందని నైట్ ఫ్రాంక్ సీఎండీ శశిర్ బైజల్ పేర్కొన్నారు. కొత్త రాష్ట్రం అయినప్పటికీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ నూతన పాలసీలు అభివృద్ధికి దోహదం చేస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో హైటెక్ సిటీ ఏరోస్పేస్‌తో పాటు ఇతర రంగాలు అభివృద్ధి చెందడంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగం ఊపకుందుకుంది అని తెలిపారు. హైదరాబాద్‌లోనూ కన్స్యూమర్ డిమాండ్ చాలా ఎక్కువగా ఉందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరింత ముందుకెళ్తుందని చెప్పారు. ఇండివిడ్యువల్ హౌస్‌తో పాటు ఆఫీస్ స్పేస్‌కు కూడా హైదరాబాద్‌లో డిమాండ్ ఉందని శశిర్ బైజల్ తెలిపారు.

మరో 1,637 మందికి పాజిటివ్

-కరోనాతో తాజాగా ఆరుగురు మృతి

హైదరాబాద్,నవంబర్4(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా కేసుల సంఖ్య వరుసగా రెండో రోజు కూడా పెరిగింది. 1500లకు పైగానే కేసులు నమోదవుతుండటం కాస్త ఆందోళన రేకిత్తిస్తోంది. అయితే పరీక్షల సంఖ్య పెంచడం కూడా కారణం కావొచ్చని అధికారులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు 45,526 శాంపిల్స్‌ని పరీక్షించగా... 1,637 మందికి పాజిటివ్ తేలింది. దీంతో మొత్తం ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 2,44,143కి చేరింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ బుధవారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది. నిన్న ఒక్కరోజే కరోనాతో ఆరుగురు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 1,357కి చేరింది. కరోనా బారి నుంచి నిన్న 1,273 మంది కోలుకోగా..ఇప్పటివరకు కోలుకున్న బాధితుల సంఖ్య 2,24,686కి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 18,100 యాక్టివ్ కేసులు ఉన్నాయని, వారిలో 15,335 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలో తాజాగా 292 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు 44,39,856 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి నట్లు రాష్ట్ర ప్రభుత్వం బులిటెన్‌లో పేర్కొంది.

రిపబ్లిక్ టీవి చీఫ్ అర్నాబ్ గోస్వామి అరెస్ట్

ఓ ఇంటీరియర్ ఆత్మహత్య కేసులో పోలీసులు చర్య
అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించిన కేంద్ర సమాచారమంత్రి జవదేకర్
అరెస్ట్‌ను ఖండించిన ఎడిటర్స్ గిల్డ్...ఎవరిపైనా ప్రతీకారం లేదన్న రౌత్

ముంబయి,నవంబర్4(ఆర్ఎన్ఎ): రిపబ్లిక్ టీవీ చీఫ్ ఎడిటర్ అర్ణబ్ గోస్వామిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ ఇంటీరియర్ డిజైనర్, ఆయన తల్లి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారన్న ఆరోపణలపై ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు విషయంలో రాయిగఢ్, ముంబయి పోలీసులు ఓ సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు. ఏపీఐ సచిన్ వాజే నాయకత్వంలోని పోలీసు బృందం అర్ణబ్ గోస్వామిని అదుపులోకి తీసుకుంది. 2018లో కాన్‌కార్డ్ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అన్వయ్ నాయక్, ఆయన తల్లి ఆత్మహత్య లకు సంబంధించిన కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వివరించారు. అర్ణబ్‌పై ఐపీసీ సెక్షన్ 306, 34 కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, అర్ణబ్‌కు చెందిన రిపబ్లిక్

జీవహింస చేయను

(కథ)

నా పేరు రాకేష్.ఒక రోజు నేను ఇంట్లో టి.వి.చూస్తున్నాను.మా అమ్మ నన్ను "బయటకు వెళ్లి ఆడుకో " అని చెప్పింది.టి.వి.ఆఫ్ చేసి అమ్మ వెళ్ళింది.నేను బాధతో చెట్టు క్రింద కూర్చున్నాను. కొద్దిసేపటి తర్వాత ఆకాశం వైపు చూసాను.ఒక గ్రద్ద కోడిపిల్ల ను ఎత్తుకొని ఎగురుతూ వెళ్తుంది.అప్పుడు నేను ఒక రాయిని తీసుకుని గ్రద్దను కొట్టాను.ఆ రాయి పొరపాటున గురి తప్పి కాకి గూడులోని ,ఒక చిన్న కాకి పిల్ల పై పడి చనిపోయింది.అది చూసిన తల్లి కాకి ఏడవ సాగింది.ఆ కాకి నన్ను చూసి పొడవడానికి వచ్చింది. నాకు భయం వేసి ఇంటిలోకి పరుగులు తీసాను. జరిగిన విషయం మా అమ్మ కు చెప్పాను.

తరువాత రోజు నేను పాఠశాల కు వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నాను.కొన్ని రోజుల తర్వాత నేను ఒక దేవాలయానికి వెళ్ళాను.అక్కడ ఉన్న పండితునికి జరిగిన విషయం చెప్పాను.ఆ పండితుడు

"కాకి పగబట్టింది " చెప్పాడు.నాకు చాలా భయం వేసింది.

నేను దేవుని దగ్గరకు వెళ్లి

" స్వామి,నేను చేసింది తప్పే.కాని నేను కావాలని చేయలేదు.అది పొరపాటున జరిగింది. నన్ను క్షమించు స్వామి.ఈరోజు నుండి నేను ఏ జీవిని హింస పెట్టను " వేడుకున్నాను.ఆ తర్వాత నుండి ఆ కాకి నాకు కనపడలేదు.ఆరోజు నుండి నేను ఏ ఒక్క చిన్న జీవిని కూడా హింస పెట్టలేదు.



-దుబ్బాక రాకేష్ ,
10వ,తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల-జక్కాపూర్
సిద్ధిపేట జిల్లా .సెల్ :6302909175

బాల గేయం

మంచి - చెడు!

పగటి నిద్ర-పనికి రాని పాడునిద్ర
మాపటి నిద్ర-మేలైన మంచి నిద్ర!
సూర్యోదయంతో లేస్తే చురుకుదనం
అతినిద్ర కలవాటుపడితే అనర్థకం!
కష్టపడితేనే కలిసివచ్చేది చదువు
సుఖపడితే ముంచుకొచ్చేది నిద్ర!
పడనీయకూడదు దాని పాడు ముద్ర!

ఒళ్లు వంచితే ఒనగూరేది ఆరోగ్యం.
బద్దకించితే చేకూరేది అనారోగ్యం

చీపురుతో చిమ్మితే పరిశుభ్రత
చుట్టూరా ఉమ్మితే అపరిశుభ్రత

అతిగారాబం చెడగొట్టుట ఖాయం.
అశ్రద్ధతో కత్తివాడితే కలుగును గాయం

పొదుపుగా జీవిస్తే పొందేది సౌఖ్యం
దుబారా ఖర్చులతో దక్కెది దుఃఖం.

బ్రతుకు తెరువు భద్రపరిచేది ఉద్యోగం
పనిలేక పడుకుంటే వచ్చేది హృద్రోగం

రైతులు కష్టిస్తేనే చేలల్లో పంట
అది లేకుంటే అందరికీ ఆకలిమంట.

- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

బట్టసంచి రామారావు

(కథ)

రామారావును అందరూ వింత మనిషిగా భావిస్తారు. అంగడికి వెళ్ళినా,సరుకులు తేవడానికి వెళ్లినా అక్కడ ఉన్న జనాలందరూ రామారావు వైపు చూసి ముక్కున వ్రేలేసుకునేవారు. రామారావు కూరగాయలు తేవడానికి అంగడి కి వెళ్ళినా, సరుకులు తేవడానికి కిరాణా దుకాణానికి వెళ్ళినా ఇలా ఏ సందర్భంలో నైనా రామారావు చేతిలో బట్టసంచి ఉండాల్సిందే. రామారావు భార్య ఇంట్లో పాతబడిన చీరలు, పాంట్లు గుడ్డలతో సంచులను కుట్టి ఇచ్చేది. హోటల్ నుండి పిల్లలకు ఇడ్లీలో వడలో తేవాలన్నా చట్నీ,సాంబారులకు వేరు వేరు స్టీలు బాక్సులను చేతిసంచిలో వేసుకుని బయలుదేరేవాడు. ప్లాస్టిక్ కవర్లలో సామానెవరయినా ఇవ్వబోతే వద్దని వారించే వాడు. అందుకే ఆయనను అందరూ వింతగా చూడడమే కాకుండా "బట్టసంచి రామారావు" అని పిలిచేవారు.

రామారావు తన చుట్టుప్రక్కల వారికి ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని, బట్టసంచులు కానీ,జనపనారవి కానీ కాగితపు సంచులు కానీ వాడమని సలహాలివ్వడమే కాకుండా తన భార్య పాతగుడ్డలతో కుట్టిన సంచులను వారికి అందించేవాడు.పాతగా ఆకర్షణీయంగా లేని ఆ సంచులను మొహమాటానికి వారు తీసుకున్నా వాటిని ప్రక్కన పడేసేవారు. రామారావు మాటను వారెవరు అంతగా పట్టించుకోలేదు సరికదా ప్లాస్టిక్ కవర్ల వాడకం మానుకోలేదు. అంతేగాక తమకు వస్తువులతో బాటు వర్తకులు ఇచ్చిన ఆకర్షణీయమైన ప్లాస్టిక్ కవర్లను ఇంట్లో వినియోగించడమే కాక ఉచితంగా వచ్చిన వాటిని భవిష్యత్ అవసరాలకు దాచిపెట్టుకోవడం ప్రారంభించారు. దాంతో రామారావు ఇల్లు తప్ప అందరి ఇళ్ళల్లో ప్లాస్టిక్ కవర్లు గుట్టలు గుట్టలుగా ప్రోగయినాయి.వారి ఇంటి పరిసరాలన్నీ కూడా వాడి పారవేసిన ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయాయి.

ఇలా కొంతకాలం గడిచింది. రామారావు నివసించే వీధిలోని వారు, ఆ ప్రక్క వీధిలోని వారు గ్రామస్తులు చాలామంది అస్వస్థతకు గురయ్యారు. వారంతా వైద్యులను సంప్రదించగా వైద్యులుకొన్ని ప్రత్యేక పరీక్షలు చేయించారు. ఆ పరీక్షలలో వారందరికీ ఒకే రకమయిన వ్యాధి లక్షణాలు పొడసూపాయి. అందరిలోనూ క్యాన్సర్ కు సంబంధించిన ప్రాథమిక లక్షణాలు కనిపించాయి. వైద్యులు వారందరినీ రకరకాలుగా ప్రశ్నించారు. ప్లాస్టిక్ వినియోగమే ఈ దుస్థితి కి కారణం అని గుర్తించారు. ప్లాస్టిక్ కవర్లను వెంటనే ఇంట్లో నుంచి బయటకు పంపించమని,ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలని, ప్లాస్టిక్ వాడకం వలన శ్వాసకోశ సంబంధ వ్యాధులు, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని వివరించారు. దాంతో ఊరి ప్రజలకు జ్ఞానోదయమయింది. అందరు వెళ్లి మూకుమ్మడిగా సమావేశం ఏర్పాటు చేసుకుని ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన కలిగే అనర్థాలను విశ్లేషించుకున్నారు. ఆనాటి నుండి ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిన బూనారు. ఎన్నో రోజులనుంచి ప్లాస్టిక్ నిషేధానికి పాటుపడుతున్న బట్టసంచిరామారావు కు సన్మానం చేసారు. రామారావు భార్య పాత బట్టలతో కుట్టిన సంచులను అందరికీ పంచి పెట్టారు. కొంతకాలానికి ఆ ఊరి వారంతా ఆరోగ్య వంతులయి సంతోషంగా జీవించారు.

-గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ.
9490003295.

బాల కార్మికులు

పువ్వులాంటి బాల్యము
నవ్వుతూ గడవాలి
చదువులతో,
ఆటలతో తుళ్ళుతూ ఎదగాలి
కడుపు నిండా తిండి,
కంటినిండా నిద్ర
వంటినిండా బట్ట,
మంచి ఆరోగ్యము
వారికివ్వడం మరచి,
స్వంతలాభంకోసం
బాలలను కార్మికుల జేసి
వారి బాల్యమంతా
నిలువునా దోచేసి
కరుణ చూపక
వారిని కష్టాల పాల్జేసిన
కరుకు హృదయాలుండగా
చట్టాలు నడవవు
అందరి ముందే
అన్నీ జరిగి పోతున్నాయి
ఈ హింస ఆపేదెవరు
వారికష్టాలు బాపేదెవరు.

పండగ

పండగ వచ్చిందోయ్
బాబు
పండగ వచ్చింది
పండగవచ్చి గుండెలనిండా
వెలుగే నింపిందోయ్
మనవారు వచ్చారోయ్
ఇల్లంతా నిండిందోయ్
ప్రతి మోముపై సంతోషం
ప్రతి మనసున ఉల్లాసం
ప్రతి చోట సందడిలే
అడుగడుగున తళతళలే
ప్రతి దిక్కున మిలమిలలే
ప్రతి గోడకు అలంకరింపులే
పొంగి పొరలే మెరిసే కళలే
కలవని మనసులు కలిసాయి
మాయని కలతలు తొలిగాయి
దేవుడి కెమో ప్రార్థనలు
అందరి కోసం పిండి వంటలు
పిల్లల మనసున ఆనందాలు
పెద్దల ఇచ్చిరి శుభాశీస్సులు
ఆటలు,పాటలు పలకరింపులు
కలుపుగోలు మాటలతో
కలిసి విరిసిన మనసులతో
నిండేదే పండగ
పండగంటే ఇదే లే

-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

సాహిత్య పల్లకీలో ఊరేగిన బాలగేయ సాహిత్యం



నేలమీద ఏ తడికైనా ఆరిపోయే గుణం ఉంటుంది, ఒక అమృతనం తడికి తప్ప. అమృతనాన్ని తన కలం నిండా నింపుకొని బాల సాహిత్యానికి శ్రీకారం చుట్టిన కవయిత్రి, రచయిత్రి, వ్యాసకర్త మరియు ఉత్తమ ఉపాధ్యాయురాలు శ్రీమతి దామరాజు విశాలాక్షి. బాలల సాహిత్య పల్లకీలను నిత్యం ప్రేమగా మోస్తున్న మహిళామణి ఆమె. 'ముత్యాలజల్లు' బాలల గేయసంపుటి కలం కదిలితే రాసింది కాదు. తన కళ్ల ముందు కదలాడుతున్న చిన్నారుల చిరునవ్వులకు కానుకగా ఆమె అందించిన తాయిలం ఈ గేయ సంపుటి. పాలుగారే పసి బుగ్గలమీద మనసారా అమ్మ పెట్టిన ముద్దుల వర్షం ఇది. బాలల భవిష్యత్తుకు ఉపాధ్యాయురాలిగా తాను ఇచ్చిన భరోసాకు ఆమె చేసిన సంతకం ఇది. రేపటి బాలల వసంతాల భారతానికి ఆనందంగా ఆమె పాడిన ప్రారంభ గీతమిది. ఇందులోని గేయాలు, పసికూనల్ని ధైర్యానికి పులికూనలుగా మార్చే మంత్రాల్లా పనిచేస్తాయి. గేయాలలోని ప్రతి మాట, పిల్లలకు అమ్మ చేతి స్పర్శను, చనుబాల రుచుల్ని తనివితీరా అందిస్తాయి. 'ఎదిగిన మనుషులకు పాఠాలు నేర్పేది పాపాయిలే' ఈ సత్యాన్ని భుజాన మోస్తున్న ఎన్నో గేయాలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఎవరైనా తమ బాల్యాన్ని తిరిగి చూడాలనుకుంటే ఒక్కసారి ఈ సంపుటి పేజీలను తిరగవేస్తే చాలు, చిన్నప్పటి సంగతులు భుజాన సంచులు తగిలించుకొని మన ముందు వాలిపోతాయి.

బాల్యం అటకనుంచి దించిన అట్టపెట్టెనిండా అపురూపమైన కానుకలు మనల్ని అబ్బురపరుస్తాయి. పపిల్లల కోసం, పిల్లల భాషలో విశిష్టమైన బాలగేయ సంపుటిని అందించిన శ్రీమతి దామరాజు విశాలాక్షి గారికి మనసారా అభినందనలు అందజేస్తూ, భవిష్యత్తులో బాల సాహిత్యానికి మరిన్ని సేవలు ఆమె అందించగలరని ఆశిద్దాం.

-డా. కె.జి. వేణు,
98480 70084

బడి మురిసింది

ఎందుకో నేడు బడి మురిపెంగా ఉంది
అందంగా తనను తాను సింగారించుకుంది
పచ్చని చెట్లతో, రంగు రంగుల విరులతో
శోభాయమానం సంతరించుకుంది
విద్యార్థుల కోసం తరగతి గదులు ఎదురు చూస్తున్నాయి
నల్లబల్ల రాయడానికి సిద్ధంగా ఉంది
మూసుకున్న బడి తలుపులు తెరుచుకున్నాయి
ఎప్పుడో ప్రారంభమయ్యే కొత్త విద్యా సంవత్సరనీ
కరోనా విలయ తాండవంతో
నేడు ప్రారంభమవుతుందనీ
వస్తున్న బడి పనీతుల్లకు స్వాగతం పలకడానికి
గేటు బయట ఎదురు చూస్తుంది
కానీ తన ఒడిలో ఆడుకునే
బుడతలు ఇప్పుడే రారని
తెలుకొని బుంగ మూతి పెట్టింది బడి
పిల్లలకు ఆరోగ్యమే మహాభాగ్యం కదా
తన పిల్లలు
మంచి ఆరోగ్యాన్ని కల్గి ఉండాలని కోరుతుంది బడి
ఆరోగ్యకరమైనవాతావరణం త్వరగా రావాలని
ఆకాక్షిస్తుంది బడి

-యాదవరనీ చంద్ర కాంత్ గౌడ్
9441762105

పూలు

రంగు రంగుల పూలు
రమ్యమైన పూలు
ప్రకృతమ్మ ఒడిన
పరవశించు పూలు!!

పూజ కొరకు పూలు
జాజి,కనకాంబరం,
మందార, మల్లెలు,
గన్నేరు,తామరలు,
బంతి,చామంతులు !!!!రంగు॥
అలంకరణ యందు
సోయగాల పూలు
సుమము యేదియైన
పులకరించే హృదులు !!రంగు!!

మదిని దోచే పూలు
మల్లె,గులాబీలు
సౌరభాల విరులు
అతివల కురులపై
అందమైన విరులు!! !!రంగు రంగుల!!

- అన్నాడి జ్యోతి
సిద్దిపేట

రేపటి పౌరులు

రెక్కలు కట్టుకుని ఎగిరొస్తాం
నెమలి పింఛంతో ఆడేస్తాం
కోయిల గొంతుతో పాడేస్తాం
హంసల్లాగా నడిచొస్తాం
చిరుతల్లాగా పరిగెడతాం
సూర్యుడిలా ఉదయిస్తాం
పున్నమి వెన్నెల అందిస్తాం
ప్రపంచానికే వెలుగిస్తాం
సమత,మమత పెంచేస్తాం
బాల్యవివాహాలు నిర్మూలిస్తాం
బాల కార్మికతకు కళ్ళెం వేస్తాం
ఉజ్వల భవితకు పునాది వేస్తాం
దారిద్ర్యాన్ని సమాధి చేస్తాం
కన్నవారి కలలు సాకారం చేస్తాం
క్రమ శిక్షణకు నిచ్చెన వేస్తాం
అభివృద్ధితో ముందుకు వెళతాం
స్వచ్ఛ భారత్ ను సాధిస్తాం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

బాల వికాసం

బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల

(ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)

ప్రసిద్ధ బాలల రచయిత
డా॥ వి.ఆర్.శర్మ కలం నుండిజాలువారిన
ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక
కాల్పనిక నవల 'బాలవర్ధన్'.
ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

10

"నాగ్‌పూర్ విశేషాలు ఏమైనా తెలుసా వర్ధన్ బాబూ!" అడిగాడు కారు నడుపుతున్న రాము.

"కొన్ని విషయాలు మాత్రం తెలుసు రామన్నా! " అని రాము వైపు చూసి, మళ్ళీ తన దృష్టిని రోడ్డు వైపు తిప్పి "నీకు నాగ్‌పూర్ సంత్రాలకు ఫేమస్ అని తెలుసు కదా?" అని అడిగాడు.

"తెలుసు, మన ఊరికి కూడా అమ్మకానికి వస్తాయి కదా."

"ఒక్క మన ఊరికే కాదు, ప్రపంచమంతా నాగ్‌పూర్ సంత్రాలకు పేరు పొందింది. ఒక్క సంత్రాలకే కాదు, మరెన్నో విషయాలకు పేరు పొందిన పట్టణం ఈ నాగ్‌పూర్. బ్రిటీష్ వారి కాలంలో మన దేశంలోని దూరాలను ఇక్కడ్నుంచే లెక్కించే వారు. ఈ నగరాన్ని ఆంగ్లేయులు మన దేశానికి భౌగోళిక కేంద్రంగా భావించారు. ఆరోజుల్లో వారు ఏర్పాటు చేసిన జీరోమైల్ స్టోన్ ఈ నాగ్‌పూర్ లోనే ఉంది. ఈ పట్టణాన్ని మహారాష్ట్ర రెండవ రాజధాని అంటారు. రాజకీయంగానూ, మతపరంగానూ ఎన్నో ముఖ్యమైన సంఘటనలు జరిగిన నగరం ఇది. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు లక్షలాది జనంతో బౌద్ధధర్మ దీక్ష స్వీకరించిన నేల ఇది. ఇప్పుడా దీక్షా భూమిలో ఓ స్మారక కేంద్రం నిర్మించారు. ఈ నగరాన్ని టైగర్ క్యాపిటల్ అనీ, గేట్‌వే ఆఫ్ ఇండియా అనీ, స్రీలకు సురక్షిత నగరం అనీ, స్మార్ట్ సిటీగా విస్తరిస్తున్న నగరమనీ...ఇలా అనేక ప్రత్యేకతలతో చెప్తారు. అనేక చెరువులూ, సరస్సులూ, తోటలూ ఉన్నాయిక్కడ. దక్కన్ పీఠభూమిలో దట్టమైన అడవుల మధ్య, పద్దెనిమిదవ శతాబ్దంలో గోండ్వానా రాజులతో నిర్మించబడ్డ పట్టణం ఇది. నాకు తెలిసిన కొన్ని విషయాలు ఇవి," చెప్పడం ఆపాడు బాలవర్ధన్.

"ఐతే తప్పకుండా చూడవలసిన చోటే అన్నమాట! సరే, మరోసారి ఎప్పుడన్నా చూద్దాం!" తల నిలువుగా ఆడిస్తూ అన్నాడు రాము.

వాళ్ళు మాంధాత చెప్పిన మార్గంలో ముందుకు వెళ్తున్నారు. హైవే కావడంవల్ల కారు కుదుపులు లేకుండా వెళ్తోంది. అక్కడక్కడా ఏవో ఊర్లు, బైపాస్ రోడ్లు వచ్చి పోతున్నాయ్. చెట్లూ ,ఓ మోస్తరు కొండలూ దూరంగా కదిలి పోతున్నాయ్. వాళ్ళ ప్రయాణం అలా ముందుకు సాగిపోతున్నది....'ముస్తఫా ముస్తఫా డోంట్ వర్రి ముస్తఫా...' కారు ఆడియో సిస్టమ్ లోంచి సన్నగా పాట వినిపిస్తున్నది.

"రామన్నా! మా నాన్నకు మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉండేవా? ఆయన ఎలా ఉండేవారు?" అకస్మాత్తుగా అడిగాడు బాలవర్ధన్ రామువైపు తిరిగి చూస్తూ.

"లేదు వర్ధన్! మీ నాన్నకు అలాంటి మూఢనమ్మకాలు అంటే పూర్తి వ్యతిరేకతే ఉండేది. ప్రతీదాన్ని సైన్సు తోనే ఆలోచించాలనే వాడు. కానీ ఈ మాయను ఎందుకు నమ్మాడో అర్థంకావడం లేదు."

"మానాన్న ధైర్యవంతుడేనా?"

"ఆ...చాలా ధైర్యవంతుడు! సాహసవంతుడు!! దేన్నయినా, ఎవరినైనా ఎదిరించి నిలబడే వాడు. ఎటువంటి గొడవలైనా, కొట్లాటలైనా భయపడేవాడు కాదు. రోజూ తప్పకుండా వ్యాయామం చేసేవాడు. మీ నాన్నే పట్టుబట్టి నాతో వ్యాయామశాల పెట్టించాడు."

కాసేపు ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు బాలవర్ధన్. కొంత సేపటి తరువాత తనలో అనుకుంటున్నట్టు అన్నాడు "అంటే... మా నాన్నకు మరేదో బలమైన ఆధారం దొరికిందన్న మాట!" బాలవర్ధన్ దీర్ఘమైన ఆలోచనలో మునిగిపోయాడు.

కారు ముందుకు సాగిపోతున్నది. సమయం గడిచిపోతున్నది. సాయంత్రం కావచ్చింది. గూగుల్ మ్యాప్‌లో తాము చేరాల్సిన డెస్టినేషన్ తామియా ఇంకా ఇరవై రెండు కిలో మీటర్లు ఉన్నట్టు చూపిస్తున్నది.

చుట్టూ పర్వతాలు, అడవి, స్వచ్ఛంగా తేలివస్తున్న గాలిలో హాయికలిగించే చల్లదనం. కళ్ళకూ, మనసుకూ ఆరోగ్యాన్నిచ్చే అడవితల్లి ఒడి. 'సాహసం శ్వాసగా సాగిపో సోదరా....' మ్యూజిక్ సిస్టంలోంచి సన్నగా వినిపిస్తున్న పాటను వింటూ ఘాట్ రోడు మీద కారును జాగ్రతగా నడుపుతున్నాడు రాము.

"రామన్నా! అక్కడ ఎవరో పిల్లాడు నిలబడి లిఫ్టు కోసం అడుగుతున్నాడు చూడు." రాముకు చెప్పాడు బాలవర్ధన్. కారును స్లో చేసుకుంటూ వెళ్ళి, రోడ్డుకు ఎడమవైపు పక్కకు తీసుకుని నిదానంగా ఆపాడు రాము.

ఎవరో పిల్లాడు ఓ పదమూడు పద్నాలుగేండ్లు ఉంటాయేమో. మాసిపోయి, నలిగిపోయిన ప్యాంటూ, షర్టూ వేసుకుని ఉన్నాడు. నలుపూ తెలుపూ కాని చామన ఛాయ. ఆ ముఖంలో ఏదో ఆకర్షణ ఉంది. ఆ రోడ్డుమీద వాహనాలు చాలా తక్కువగా వెళ్తున్నాయ్. దగ్గరలో ఊరేదీ ఉన్నట్టు లేదు.

"సార్! దయచేసి తామియా హిల్‌స్టేషన్ వరకు తీసుకెల్తారా!" హిందీలో అడిగాడా పిల్లవాడు. ఆ మాటల్లో మర్యాద, రిక్వెస్టు వినిపిస్తున్నాయి.

"సరే, రా! " అంటూ కారు వెనక డోరు తెరిచాడు రాము. ఆ పిల్లవాడు కారు ఎక్కి, వెనుక సీట్లో కూచున్నాడు. కారు మళ్ళీ ముందుకు వెల్తోంది. "ఎక్కడికెళ్తున్నారు సార్? మీరూ తామియా కేనా?" అడిగాడు ఆ పిల్లవాడు. "ఔను తామియాకే. చూడ్డానికి వెళుతున్నాం" చెప్పాడు బాలవర్ధన్. "తప్పకుండా చూడండి సార్! చాలా బాగుంటుంది." వాళ్ళ సంభాషణ హిందీలో జరుగుతున్నది. కానీ ఆ పిల్లవాడు మాట్లాడుతున్న హింది, తెలంగాణలో మాట్లాడే దక్కనీ హిందీ భాషకు కొంత భిన్నంగా ఉన్న విషయం వాళ్ళు గమనించారు . తన పేరు గిరి అని, తాను పాతాళ్ కోట్‌లో ఉన్న ఓ చిన్న గ్రామంలో ఉంటానని చెప్పాడు. తాను చదువుకోలేదని, తమ ఊళ్ళో పోయిన ఏడాదే బడి తెరిచారని, తమ్ముళ్ళు, చెల్లెలు బడికి పోతున్నారని చెప్పాడు. వాళ్ళు ఎక్కడినుంచి వస్తున్నారనీ, ఆ ఊరు ఎక్కడుంటుందనీ అడిగి తెలుసుకున్నాడు. తామియాలో ఈ రోజు ఎక్కడ ఉంటున్నారనీ అడిగాడు. ఆ మోటల్ కొత్తగా కట్టారని, చాలా బాగుంటుందని చెప్పాడు.

"నీకు ఎలా తెలుసు? ఎప్పుడైనా వెళ్ళావా?" అడిగాడు రాము. ఆ! రోజూ పోతాను. అక్కడ ఎవరైనా అడిగితే గైడుగా వెంట ఉండి అక్కడ ఉన్నవి చూపించడానికి వాళ్ళను తీసుకొని పోతాను" చెప్పాడు గిరి.

"ఏమున్నాయక్కడ చూసేవి?" అడిగాడు బాలవర్ధన్.

"సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని చూసే రెండు వ్యూ పాయింట్లు ఉన్నాయి. కొందరు అక్కడి లోయలో ఉన్న ఊర్లు చూస్తారు. అక్కడ ఉన్న చివరి ఊరు కరిమా వరకు కారులో పోవచ్చు. కానీ మట్టి తోవలోనే పోవాలి."

"ఏముంటాయా ఊర్లలో చూడడానికి?"

'అడివిలో ఉండే ఆదివాసీల ఊర్లు ఎలా ఉంటాయో చూడడానికి పోతారు. వాళ్ళ ఇండ్లను, వాళ్ళ పద్ధతులను చూసి రావడానికి పోతారు. కొందరు ఆ అడివినీ, కొండల నడుమ అక్కడి ప్రజలతో కొంతసేపు గడిపే అనుభవాన్నీ రుచి చూడడానికి పోతారు అక్కడికి."

"మహాదేవ్ గుహ అని కూడా ఉందట కదా?"

"ఉంది సార్? కానీ చాలా దూరం నడవాలి. దాదాపు నాలుగైదు గంటలు నడువాలి. లోయ లోపలికి కిందికి దిగాలి. ఐనా కొందరు పోతారు దర్శనానికి...మీరు కూడా అక్కడికి పోయి దర్శనం చేసుకుంటారా సార్?"

"ఔను. చూడాలనే అనుకుంటున్నాం" చెప్పాడు బాలవర్ధన్.

"ఐతే మీకు గైడుగా వెంట నన్ను తీసుకొనిపోతారా సార్!" గిరి ఆశగా అడిగినట్టు అనిపించింది వాళ్ళకు.

"గైడుగా వెంట వస్తే ఎంత ఇమ్మంటావు?" గిరి ముఖంలోకి చూస్తూ అడిగాడు బాలవర్ధన్.

"మీరైతే నాకు ఏమీ ఇవ్వక్కర్లేదు సార్. ఇంత దూరం నన్ను కారులో తీసుకొస్తున్నారు. ఇది చాలు నాకు."

"అలా కాదు కానీ, అందరి దగ్గర తీసుకున్నట్టే మాదెగ్గర కూడా తీసుకో. రేపు ఉదయం ఎన్ని గంటలకు వస్తావ్? మేం ఎప్పటి వరకు రడీగా ఉండాలి?"

"ఈ రోజు సన్‌సెట్ పాయింట్ చూడండి. రేపు పొద్దున్నే లేస్తే, మీ హోటల్ పక్కనుంచే సూర్యోదయాన్ని చూడొచ్చు. అక్కడ కూడా ఓ వ్యూ పాయింట్ ఏర్పాటు చేశారు హోటల్ వాళ్ళు" అని చెప్పి, "సార్,రేపు ఎనిమిది గంటల వరకు రడీగా ఉంటారా?"అని అడిగాడు గిరి.

"ఓ..కే! అలాగే చేద్దాం. మన వెంట ఏం తీసుకొని వెళ్ళాల్సి ఉంటుంది రేపు ?" తమ అంగీకారాన్ని తెలుపుతూ, రేపటి ప్రయాణపు ఏర్పాట్ల గురించి ప్రశ్నించాడు బాలవర్ధన్.

"తిండీ, నీళ్ళూ కావాలి. అక్కడ ఏవీ దొరకవు. మందులు ఏమైనా అవసరమైతే తెచ్చుకొండి. బూట్లే వేసుకొండి." గిరి చెప్పాడు.

"ఏమైనా తిని బయల్దేరుతామా?" అన్నాడు రాము.

"ఔను సార్! మీరు ఉండే హోటల్ లోనే రెస్టారెంట్ ఉంది. పొద్దున ఏడు గంటలకల్లా టిఫిన్ రడీ అయిపోతుంది. మీరు టిఫిన్ చేసేయండి."

"నువ్వు తొందరగా వస్తే మనం కలిసి తినొచ్చు."

"నేను ఇంటి దగ్గరే తినేసి వచ్చేస్తా సార్. అది నాకు అలవాటు. మధ్యాహ్నం అక్కడ కలిసి తింటాం .రేపటికోసం మీకు ఏంకావాలో మీ హోటల్ వాళ్లకు ఈరోజే చెప్పండి. దాన్ని వాళ్ళు పార్సల్‌గా ప్యాక్‌చేసి ఇస్తారు...ఆ మలుపు దగ్గర ఆపండి. ఇక్కడ్నుంచి నేను కిందికి నడుస్తూ పోవాలి, మా ఊరు ఆ లోయ లోపల ఉంటుంది . మీరు వెళ్ళే మోటల్‌కూడా దాదాపు వచ్చేసింది. ఇక్కడ ఆపితే నేను దిగిపోతాను."

రాము కారును పక్కకు తీసుకుని ఆపాడు."మంచిది సార్! పొద్దున ఎనిమిదికల్లా వచ్చేస్తాను" అంటూ కారు దిగి చేయి ఊపుతూ, కారు బయల్దేరే వరకు అక్కడే నిలబడ్డాడు గిరి. వాళ్ళు తామియా హిల్ స్టేషన్ చేరి, అక్కడ మాంధాత బుక్ చేసిన హోటల్ చేరుకున్నారు. తమ గదిలో సామానులు పెట్టుకొని, సన్ సెట్ పాయింట్‌కు బయలు దేరారు. పడమటి కొండల్లోకి సూర్యుడు దిగిపోవడానికి ఇంకా కొద్ది సమయమే ఉంది.

(సశేషం..)

-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749



రాజకీయంగానూ, మతపరంగానూ ఎన్నో ముఖ్యమైన సంఘటనలు జరిగిన నగరం ఇది. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు లక్షలాది జనంతో బౌద్ధధర్మ దీక్ష స్వీకరించిన నేల ఇది.

పువ్వులు

పువ్వులమ్మ పువ్వులు
అంగట్లో హరివిల్లులు
!! పువ్వులు!!
బంతిపూల మాలలు
దేవుడి మెడలో హారాలు
రంగు రంగుల దండలు
సత్కారాల పరిమళంబులు
!! పువ్వులు!!

తెగిన పూల రెక్కలు
రాజులు, ధనవంతులకు బాటలు
మల్లె, చామంతి మూరలు
మగువల జడలలో సొబగులు
!! పువ్వులు!!

గులాబీల పూగుత్తులు
బాల కృష్ణుల సయ్యాటలు
పూలగంపల పరుగులు
అమరుల ఒడిన కన్నీటి దివ్వెలు
!! పువ్వులు!!

-ఉంద్రాళ్ళ రాజేశం
99669460 84

రాత - గీత

గుట్టురట్టు

బంజారుల
బంగరు భూమిని
బహు చౌకగా
బదలాయించి
బెంజికారులో తిరిగే
బడాబు వ్యాపారి
బంజారాహిల్స్‌లోని
భాగ్యవంతుడు!

అరని జ్వాల

హరిత విప్లవాలు
హరించిపోయినా
పారిశ్రామిక విప్లవాలు
ప్రభంజనం లేపినా
స్రాంతికేక విప్లవాలు
సందుల్లో చొచ్చినా
దారిద్ర్య విప్లవం
దహించిపోలేదు.. ఏమా?

రాత-శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత-వర్చస్వి

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 5-11-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

నమ్మలేని నిజాలు

రక్తం గ్రూపులు
మనుష్యుల గ్రూపులు
గ్రూపుల కాలం.

చీకటి లోకం
ఎలుకల కలుగు
దోపిడి మార్గం.

అజ్ఞాన గూళ్లు
బడుగు బతుకులు
మేలుకొలుపు.

మెరిసే అల్లం
రోగాలకు పుట్టిల్లు
ద్రావక శుద్ధి.

తిట్లపురాణం
అంతాగోల్ గోల్ గోల్మాలు
గెలుపు ద్రామ.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

వలసపాములన్నిపోయె
తగ్గె కస్సుబుస్సులు !
కాళ్లు అరిగి కూలినాక
కదిలినాయి బస్సులు !

కరోనాకు అంటుకొనీ
కుప్పకూలె గుడిసె !
గుట్టకొకరు చెట్టుకొకరు
బతుకులన్ని ఒడిసె !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

'కవులు' గొప్ప శక్తియోదులు

డా॥కూర్మాచలం శంకరస్వామి రచించిన "మబ్బుల మాటు" కవితా సంపుటి ఆవిష్కరణ సభలో శివరాత్రి యాదగిరి, కార్పొరేటర్ కొలుకుల జగన్, బైస దేవదాసు, డా॥ తిరునగరి, కందుకూరి శ్రీరాములు, ఆవిష్కర్త కుద్బుల్లాపూర్ శాసనభ్యులు కె.పి. వివేకానంద్, డా॥ కూర్మాచలం శంకర స్వామి తదితరులు.

'మబ్బుల మాటు' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో నృత్యం చేసి అలరించిన చిన్నారులు చి॥ సన్నిధి సాయి సహస్ర, సనిధ్రి సుధా మాధురిలను సత్కరిస్తున్న కందుకూరి శ్రీరాములు, బైస దేవదాసు, డా॥ కాంచనపల్లి గో.రా.

రవి కాంచని చోటు కవి కాంచునని అంత గొప్ప శక్తి కేవలం కవులకే ఉందని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్ అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో మగ్దూంనగర్ చైతన్య కళానికేతన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ కుర్మాచలం శంకరస్వామి రచించిన "మబ్బుల మాటు" కవితా సంపుటిని శాసన సభ్యులు కె.పి. వివేకానంద ఆవిష్కరించారు. కవి తిలక, భారత్ భాషా భూషణ్, దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ తిరునగరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం కవులను, కళాకారులను అన్ని విధాల ప్రోత్సహిస్తుందన్నారు. సాహిత్యం మనిషి గొప్పగా జీవించడానికి దోహద పడుతుందని, విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందని విశిష్ట అతిథిగా పాల్గొన్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. ఆధ్యాత్మిక చింతన గల డా॥ కుర్మాచలం శంకర స్వామి "మబ్బుల మాటున" కవితా సంపుటిలో సామాజికాంశ పుష్కలంగా వున్నాయని, కవి, రచయిత, గాయకుడైన కుర్మాచలంను బైస దేవదాసు అభినందించారు. వాస్తవాల చిత్రీకరణలో పట్టు సాధించిన డా॥కుర్మాచలం కవిగా అంచలంచెలుగా ఎదుగుతున్నారని జంటనగరాల తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు కందుకూరి శ్రీరాములు అన్నారు. డాక్టర్ కూర్మాచలం శంకరస్వామి మాట్లాడుతూ తాను రచించిన రచనలు సమాజాన్ని చైతన్యపరిచే విధంగా ఉంటాయన్నారు.

అనంతరం ఈ గ్రంథాన్ని గౌతమి డిగ్రీ కళాశాల బిఎస్‌సి విద్యార్థి యం. మోతియా నాయక్ (రాము)కు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి అసోసియేట్ కన్వీనర్ డాక్టర్ కాంచనపల్లి గో.రా, హైదరాబాద్ ఆకాంక్ష క్యాటరర్స్ చైర్మన్ ఆశ్వాపురం వేణుమాధవ్, స్థానిక కార్పొరేట్ కొలుకుల జగన్, మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు, మగ్దూంనగర్ చైతన్య కళానికేతన్ అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, తెరసం జంట నగరాల శాఖ అధ్యక్షులు, అహోబిలం ప్రభాకర్, మేడ్చల్ జిల్లా ట్రస్మా ప్రధాన కార్యదర్శి జె. నాగరాజు, నవోదయ హై స్కూల్ కరస్మాండెంట్ కె.వై.గిరి, సయ్యద్ రశీద్, జెకె శేఖర్ యాదవ్, వేణుమాదవ్, బండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఆవిష్కరణ అనంతరం కవి డా॥కూర్మాచలం శంకరస్వామి, దంపతులను అతిథులు ఘనంగా సత్కరించారు. మొదట చిన్నారులు చి॥ సన్నిధి సాహసహస్రం, సుధామాధురి చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

ఎంత కష్టం

పుట్టి పెరిగిన మట్టికి బరువై
కూటికోసం కూలికోసం
కాలు సాగిన దారివెంబడి
అయినవాళ్ళకి కన్నవారికి దూరంగా
నాకేమీ కాని నేలమీద
పాదం పూర్తిగా పెట్టనైనాలేదు
ఇప్పుడీ కరోనా సుడిగాలిలోబడి
గిరికీలు కొడుతూ
ఎటెల్లిపోతున్నమో తెలవటంలేదు
కాళ్ళకయిన ముళ్ళగాయాలకన్నా
మనసు పుండైపోతున్నది
ఆకలితీర్చుకోటానికేగా ఇంతదూరమొచ్చాం
అదే ఆకలితోనే తిరిగి వెల్తున్నాం
మా ఊరిదాకా నడిచే ఓపికలేకున్నా
ఆ పేరు జపిస్తుంటే
కొంచమయినా ప్రాణం నిలబడుతుంది
అది వట్టి ఊరిపేరుకాదు తండ్రీ!
నా తాత ,అవ్వలు..అమ్మ నాయనలను
కడుపులో దాచుకున్న తల్లివేరు
ఇంకా ఎంత దూరం నడవగలనో తెలీదు
నా పల్లెగాలి నన్ను వెదుక్కుంటూ
ఇటే వీస్తూ ప్రాణాలు నిలుపుతోంది
తమ్ముడూ...
ఏది ఎట్లయినగానీ
నాకట్టెనయినా నావాళ్ళకు చేర్చు
ఆ మట్టిలో నా శ్వాస నింపు

–డా.సి.భవానీదేవి
9866847000

అబలత్వమా అలుసెందుకు!

బ్రతుకులు చిన్నా భిన్నమై
దిక్కుల రూపురేఖలు పేకమేడల్లా
కూలిపోతున్నాయి
చీకటి పొదలు చుట్టూతా
క్రమ్ముకొస్తున్నాయి
వద్దు వద్దు ఇక ఉపేక్షించవద్దు
అమానుషత్వాన్ని అలికిడిలా
గ్రహించే త్రాచుపామై
ప్రతిక్షణం ప్రచండమై
అప్రమత్తంగా జాగరూకతతో
మేల్కొనాలి
భూమి గుండ్రంగా ఉంటుందని
మారీచుల స్వైర విహారంతో
పల్టీలు కొడ్తుందని
ఎంతగా దగాపడ్డా తెలియని
అబలత్వం మీది అలసత్వం మీది
ఎన్నాళ్ళని అవనిలా సహించగలం
కపట ప్రేమల్ని ఓర్పుతో ఆకాశమై
భరించగలం
అలసటలో సైతం అస్సలు
కనురెప్పలు మూయకూడదు.
జ్వాలల్లో
చలికాచుకొనే దుర్నీత లోకంలో
ఎన్ని నిర్భాగ్య జీవితాలు శిలువకు
తగిలించ బడ్తున్నాయో!
ఎంతమంది రోదనల వెర్రి ఆర్తనాదాలు
జైలు గంటలుగా మ్రోగుతున్నాయో!
ఈ నిష్ఠురసత్యాన్ని గ్రహించలేని
పసితనం పులుముకొన్న
జీవితాలు మీవి.
మృగాళ్ళ దాహాల్లో ఎన్‌కౌంటరవుతున్నాయి
ఇక ప్రతి మహిళ
జ్వలన జ్వాలగా ప్రవహించాలి.
నగరమే పర్జన్యమై చెలరేగిపోతుంటే
మాటువేసి దారికాచి
కూల్చివేయక తప్పదు.
రేపటి ఉషోదయాన్ని
ఎర్రబడ్డ కళ్ళల్లో పాదుకొల్పక తప్పదు.

– చిన్ని నారాయణ
సెల్: 94402 02942

మనసుల్ని కదిలించే కథలు..“గణిక”



కథలన్నీ సామాజిక సమస్యలపై స్పందించేవే. ఇంటింటికి ఒక సమస్య ఉంటుందో అలాగే సమాజంలోని ప్రతి వ్యక్తికి ఒక సమస్య ఉంటూనే ఉంటుంది. అవి స్త్రీల సమస్యలా? పురుషుల సమస్యలా? అంటే స్త్రీల వల్ల పురుషులకు, పురుషుల వల్ల స్త్రీలకు సమస్యలు వెంటాడుతూనే ఉంటాయి. కాకుంటే మనం వింటున్న వైపు న్యాయం కనిపిస్తుంది. సమస్యను సమస్యగానే గమనిస్తే మాత్రం ఖచ్చితమైన అభిప్రాయాలు వెల్లడి అవుతాయి. అందుకే ప్రతి సమస్య తెలిసిన వ్యక్తుల మధ్య కాకుండా ఇద్దరికీ అపరిచితుల వద్దకు వెళితే అందులోని సమస్య ఎక్కడుందో తెలిసే వీలుంటుంది. బండారు విజయ కలం ఎంతో పదునైంది. అర్థవంతమైనది కూడా. భ్రష్టు పట్టిన సమాజ రీతులపై వీరి కలం పదునుగా దూసుకెళుతుంది. ముఖ్యంగా స్త్రీలకు ఎక్కడ అన్యాయం జరిగిందని తెలిసినా వీరి కలం ఆవేశంతో అక్షరాల వెంట పరుగులు తీస్తుంది. కవిత అయినా, కథయినా ఎక్కడా వ్యక్తీకరణలో కానీ, శైలిలో కానీ కవితాత్మను, వ్యవహారాత్మికతను కోల్పోవడం కానీ జరుగదు. అది నేను గమనించిన విషయం.

ప్రస్తుతం కథా సంపుటిని ప్రచురించారు. పేరు 'గణిక'. ఈ సంపుటిలోని కథలన్నీ చదివాక నా హృదయం బాధాతప్తమయింది. స్త్రీల జీవిత చిత్రణ, వారు కోల్పోయిన ఆశలు, ఆశయాలు తెలుపుతూ చక్కని పరిష్కార దిశగా కూడా నడిపించడం విశేషం. ఇరవై కథలున్న ఈ సంపుటి నిజంగా ఒక ప్రాంతానికి సంబంధించినది కాదు. విజయ గారు ఒక రచయిత్రిగానే కాకుండా ప్రజాస్వామిక విలువలకోసం పోరాడే వనితగా, పాలకుల అరాచకాలను నినదించే మహిళగా, అనే సామాజిక, రాజకీయ, మానవీయ అంశాలపూ నిలదీసే వ్యక్తిగా మనకందరికీ తెలుసు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని, సమస్య రావడంతోటి జీవితం అయిపోయిందని భయపడిపోవడం సమంజసం కాదని, ఎటువంటి ఆవేదన అయినా ప్రతిఘటించి పోరాడితే వదిలి పారిపోతుందని ఎలుగెత్తి చాటిన కథలు ఇవి. నేడు స్త్రీల జీవితాలు అగమ్యంగా మారిపోతున్న ఈ తరుణంలో అందరికీ ధైర్యం చెప్పగలిగే కథలు ఇవి. ఎందరో వ్యథలకు ఒక చక్కని దారిని, పరిష్కారాన్ని చూపిన చక్కని కథలు ఇవి.

సమజంలో జరుగుతున్న హింస, అత్యాచారం, మోసం, కులతత్వం రూపుమాసిపోవాలని, నిత్యమూ పురుషుని చెరలో స్త్రీలు పడుతున్న ఆవేదనలను అంతమొందించాలని, ప్రేమకు కుల, మత, వర్గ తేడాలు ఉండకూడదని, స్త్రీ కూడా ఆర్థిక అసమానతల్ని ఎదుర్కునే దిశగా ప్రయాణం చేయాలని తెలిపుతారు. ముఖ్యంగా పేదలు, మధ్యతరగతి, దళిత స్త్రీలపై జరుగుతున్న దారుణాలపై ఎంతగానో స్పందించారు. తాగుడుకు బానిసై భార్యను కొట్టేవాడు ఒకడైతే, మరొకరు చంపేవాడు ఒకడు, ప్రేమించేవాడు ఒకడు, ఇలా పసిబిడ్డల్ని సైతం ఒక ఆటవస్తువులా భావిస్తూ, స్త్రీల శ్రమ దోపిడిని అనుభవిస్తూ కేవలం పురుషుడు అనే విషయాన్ని అడ్డం పెట్టుకుని బతికే రాక్షసుల్ని చట్టం శిక్షించకపోయినా, మనకు మనమే మారణాయుధాలుగా మారి శిక్షించాలి అంటారు. ముక్కు పచ్చలారని పసిపిల్లల్ని సైతం అనుభవించే నరరూప రాక్షసుల వైనాన్ని చిత్రించిన తీరు 'నైటీ' అనే కథలో రచించారు. బాల్యాన్ని సైతం బుగ్గిపాలు చేస్తున్న వారికి చట్టంలో శిక్షలే లేవా? అనిపించింది.

ఆ బాలికకు ఎదురైన సమస్యని తలుచుకుంటుంటే కళ్ళు చమర్చాయి.

మంచినీళ్ళు లేని సమయంలో వేలమైళ్ళు వెళ్ళి తేవడం, అక్కడున్న ష్యాక్టరీలు వదిలిన కలుషితాల కారణంగా వారికి ఆరోగ్యం నశించడం "మంచినీళ్ళు" కథలో విశదీకరించారు. అసలు ఇలాంటి సంఘటలను చాలామందికి తెలియవు. ఒక స్త్రీ ఎంతో కష్టించి పనిచేసి పోషణ భారం మీద పడ్డాక, శరీరం శుష్కించడం ద్వారా మరో భార్యను తెచ్చుకోవడం, ఆ బార్య కూడా పయోభారంతో మూలనపడితే మరో భార్యను తెచ్చుకోవడం చదువుతుంటే, ప్రపంచంలో ఇంతకంటే అరాచకత్వం ఉంటుందా అనిపించక మానదు. వచ్చిన భార్యలను ఏమీ అనలేక, ఆహ్వానించడమే పనిగా పెట్టుకున్న వీరి జీవితాలు కూడా ఒక జీవితాలేనా అనిపించక మానదు. ఈ కథ చదువుతుంటే సమాజంలోని స్త్రీల సమస్యల్ని తరచి చూసిన రచయిత్రి కదా అనిపించక మానదు. వీరికి గృహహింస వర్తించదా? అంటే వర్తిస్తుంది. కానీ వీరికి తమ సమస్యల్ని ఎవరికి చెప్పుకోవాలి అనే విషయం కూడా తెలియదు. కానీ ఇదే గృహహింస చట్టం వర్తించాల్సిన వారికి వర్తించడం లేదు అనిపిస్తుంది.

ప్రపంచం ఎంత అత్యాధునికంలోకి పయనిస్తున్నా పితృస్వామ్యం స్త్రీలను ఆర్థికంగా, లైంగికంగా, శ్రమదోపిడీ పరంగా హింసించి చంపుతోంది. ఇప్పుడు ఆధునికం పేరిట జరుగుతున్న గర్భధారణ. పిల్లలు లేని మరో తల్లికి తన గర్భంద్వారా కని ఇచ్చే విధానం అమలులో ఉన్న ఈ సమాజంలో డబ్బుకోసం ఒక తల్లి ఒప్పుకుంటుంది. అంతేకానీ పోషణ భారంలో భర్తదేమీ పాత్ర లేనట్లు స్త్రీలు తమ జీవితాలను వేరెవరికో తాకట్టు పెట్టడం లాంటివి, తర్వాత వారికి ఎదురయ్యే దారుణమైన సంఘటలను ఆధారంగా సాగిన కథ "బచ్చాపోచ్" రాజకీయ వ్యవస్థ కంటే పితృస్వామ్య వ్యవస్థ మరింత దారుణంగా తయారవుతోంది కదా అంటారు ఈ రచయిత్రి. కనడం, పోషించడం కూడా స్త్రీల బాధ్యతే అయినప్పుడు ఇక ఈ కుటుంబ వ్యవస్థ ఎందుకు ? అని ప్రశ్నిస్తారు.

నాలుగు గోడలుంటే కుటుంబం అనుకోవడం పొరపాటు. అ గోడల మధ్య ఉన్న కుటుంబం ఎంతో ఆనందంగా ఉంటుంది అనుకోవడం పొరపాటు. ఇద్దరు వ్యక్తులతో ప్రారంభమైన ఈ కుటుంబం మరింతగా విస్తరించడం జరిగినట్లే, వారిమధ్య ఆత్మీయతానురాగాలు విస్తరిస్తాయి అనుకోవడం పొరపాటు. అలాగని పిల్లలకోసం ఈ బంధాన్ని ఉన్నట్లు నటించాలా? లేక పిల్లలు ఏమనుకుంటేనేం? ఉన్న జీవితాన్ని సంతోషంగా గడపాలనుకోవాలా అనే విషయాలను ఎంతో సున్నితంగా వివరించిన కథ " రిటైర్మంట్". నేడు ఇలాంటి పరిస్థితులు చాలా చోట్ల మనకు కనిపిస్తుంటాయి. తర్వాత కథాసంపుటి శీర్షిక "గణిక" ఒక సెక్స్‌రాకెట్ కథ. కొందరు బలవంతంగానూ, మరికొందరు బతకడానికి వేరే దారిలేకనూ ఈ విష వలయంలో చిక్కుకుని ఎదురుచూసిన ఆవేదనలను కళ్ళకు కట్టినట్లుగా తెలిపే కథ చదువుతుంటే గుండె భారమైంది.

ఈ రోజు ఆడపిల్లలు తమను తాము రక్షించుకునే విధానంలో ఎంతో మెళకువ చూపాలి. యుక్తవయసు వచ్చినప్పటి నుండి తమను తాము ఎలా సంరక్షించుకోవాలో తెలియజేసే కథ "ఎలుగుబంటి". కన్నీళ్ళు పెట్టుకుని వేడుకునే దశలో ఎవరికైనా మనం బానిసలమే. తిరగబడిన మరుక్షణం మనం బలశాలులమే అని నిరూపిస్తుంది. ఎప్పుడైనా ఇదే నిజం. శారీరకంగా బలహీనురాలైన స్త్రీ నేడు తన ఆత్మరక్షణకై తగిన విద్యలు నేర్చుకోవడం తప్పనిసరి. అన్యాయానికి గురైనప్పుడు ఎదురుతిరిగి నిలదీసి ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవడం తప్పనిసరి. తర్వాత "పెండ్లి చూపులు", భరోసా, తెగింపు, రేపటి తీర్పు కథలన్నీ స్త్రీ సమస్యల మూలమూలాలు ఎత్తిచూపేవే. ఒక సామాజిక కార్యకర్తగా తాను చూసిన, తమకు ఎదురైన సంఘటనలతో చక్కని కథలు ఈ రచయిత్రి తెలిపారు. ఆవేశం ఎక్కువైనా, ఆవేదన ఎక్కువైనా శిల్పం దెబ్బతింటుంది అన్నట్లు అక్కడక్కడా కొంత పాత్ర చిత్రణ జరిగినా సమాజానికి ఎంతో ధైర్యాన్నిచ్చే కథలు ఈ రచయిత్రి రచించారు.

యుగాలు గడుస్తున్నా స్త్రీకి రక్షణ లేదు.
ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నా స్త్రీకి భద్రత లేదు.
సమాజం నుండి సహకారం లేదు. ప్రభుత్వం నుండి ఆసరా లేదు. సంఘటలు జరిగిన తర్వాత అధికార యంత్రాంగం కదిలి ఏవో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి, ప్రజల్లో ప్రతిఘటన ఎదురైనప్పుడు చంపేయడం (ఎన్‌కౌంటర్) లాంటివి చేసి జోకొడుతున్నారు తప్ప వీటికి శాశ్వత పరిష్కార మార్గాల్ని అన్వేషించడం లేదు. ఇలా ఎంతకాలం? కలాలు కదులుతున్నాయి. పోరాటంతో గళాలు కదులుతున్నాయి. ఇంకా ఇంకా ఇంకా తెల్లవారితే కనిపించేవి, వినిపించేవి దారుణాలు, దౌర్జన్యాలు, హత్యలు, కుల దురహంకారాలతో దాష్టీకాలు, ప్రేమ పేరుతో వంచించడాలు.. వీటికి పరిష్కార దిశగా నడిపించాలనేదే రచయిత్రి బండారు విజయ గారి ఆవేదన. .. ఈ కథలు మహిళలే కాదు పురుషులు కూడా చదవాలి. యువతరానికి ఆత్మస్థైర్యాన్ని నింపే ఈ కథలు రచించిన ఈ రచయిత్రికి అభినందనలు.

పుస్తక సమీక్ష

ప్రతులకు: భండారు విజయ
హెచ్‌ఐజి బ్లాక్–1, ఫ్లాట్–10
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్–500 044
సెల్: 8801910908

–శైలజామిత్ర
9290900879

నిత్యస్మరణీయులు

అర్జునుడు

–దోరవేటి
సెల్:9866251679

నరనారాయణులందు నొక్కడవు ధన్యాత్ముండవే యోరివే
శరసంధాన కళాప్రపూర్ణుడవు శాశ్వతీర్తి సౌందర్యుండవే
కురువంశ గృహి ! సవ్యసాచి ! విజయా ! గోపాలకృష్ణప్రియా !
స్థిర గంభీరుడ ! వందనాలు గొను ! రశిభూత వీరత్వమా !

పరమలైన శాపర్షులైన నీయందు
నమృత తుల్యమయ్యె నమర సూని
శివుని యంతవాని బవరమ్మునను నిల్పు
వీరు వీవు ! పాండవేయ నిజము !

'ఊర్వశి' నిన్నుజూరి యెదనోపని మోహము జూపి ప్రేమతో
సర్వము నిత్తునన్న , మనసారగ తల్లిగ నెంచినావు ; గం
ధర్వ సమాన 'ఉత్తర' ముదంబున భర్తగ జూరుకోగ, నే
గుర్వు నటంచు దెల్పియును కోడలిగా గయికొన్న పుణ్యుడా !
పత్రి వీవు ; కృష్ణ భగవనుడే గావు
గీతబోధ యయ్యె శిరధర
జగతికెల్ల నదియె సగతి జూపించెను
అర్జునా ! నమస్సు లందుకొనుము !

అమ్మా....

అమ్మా....
ఎక్కడినుండో.ఎవ్వరిదో...
ఎరుకలేని .....
ఎరుగలేని ఏకాంత నిశ్వాసంలా
ఏపుగా...
ఆగకుండా..అదే పనిగా...
ఆలాపనగా...
మనసును మెలిపెడుతూ..
అమ్మా...
ఎవ్వరిదో పిలుపు
ఎవరి మాట వారే పూర్తి చేయలేని..
చేయని.....వినని లోక ప్రవాహాన..
జన తండాలో...
ఎవరు వింటారా పిలుపు...?
ఎవరు ఎవరికి కాని సమాజాన.
ఎవరు వింటారా
పిలుపు...
అమ్మా....
మళ్ళీ మళ్ళీ ఎడదను
తడుతూ..కదిలిస్తూ...
నింగి స్వరమేదో ఒలికినట్టుగా
నేలలోంచి మొలిచినట్టుగా...
మూలుగుతున్నట్టుగా....
ముసుగేసుకున్న కాలం నుది కరిగించేలా..
కదిలించేలా...కసిగా...కష్టంగా..
ఆక్రోశమై. ఉరుములా..
అమ్మా...
బంధాలుండీ లేవనిపించే
కరకు కాలాన..
నటనే నాగరికమైన నయగారమనే కాలాన.
వ్యామోహాలే విద్యుత్తేంద్రాలై
వ్యాకులతను పెంచి పంచే కాలాన...
అలలు అలలుగా ..
తెరలు తెరలుగా...
పొరలు పొరలుగా
విలువలు విచ్చిపోతున్న
కాలాన.
ఎవరి పిలుపునైనా వినేదెవరు..?
హాయి చేయనందించే
దెవరు...?
దీర్ఘమైన ప్రేమ ప్రవాహం
హ్రస్వమై...అణువై..
పరమాణువై కుంచించుకు
పోతుంటే...
ఎవరు వింటారే. పిలుపైనా
ఎవరు ఎవరి కోసమైనా ఎదురు చూస్తారా
ఏ మలుపులోనైనా...?



– రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
సెల్: 9866583907

అన్వేషణ

కలలను అన్వేషించే మనిషి ఎదురయ్యాడు
ఓడిపోతున్నా విజయాన్ని వెతకటం
మానలేదన్నాడు...
విస్మయపరిచిందా ఓర్పు.

వెతలను కప్పుకున్న మనిషిని
చూసి జాలిపడ్డాననుకున్నాను
వెతల వెచ్చదనంలో వేకువను
స్వాగతించే అతనిని చూసి విస్తుబోయాను.

'గరీబ్ హూ బేటా' అంటున్న
పండు ముదుసలి మొహంలోకి చూశాను
ముడతలమాటున దాగినది బాధా కోపమా...
పచ్చదీపం పదమని ముందుకు తోసింది.
ఒక్కటే కోకిల చెట్టు చివరన
రాగమాలికను సవరిస్తోంది.
చుట్టూ పక్షుల గుంపులే
భంగమవ్వని ఏకాంతంలో
కోకిల ఏకాగ్రత సంబరాన్నిచ్చింది.

పసలేని వాదాలు వివాదాలు
శ్రుతిలేని గానంలా విసిగిస్తుంటే
సంధిగ్ధాల కూడలిలో ఉన్నానని
ఇలా జీవితం
పాఠం నేర్పమంటుంది.

–సి.యస్.రాంబాబు
8374818961

ప్రకృతి - పద్ధతి !!

ఈ సువిశాలమైన వసుధపై
సున్నితమైన సంకల్పంతో
నిర్మలమైన మనసుతో కొలిస్తే
కోరిన వరాలను కోరుకున్నట్లు
అందించే కల్పతరువు ప్రకృతి !

ఈ అనంత జీవన పయనంలో
ఎవ్వరు నీవారైనా , కాకపోయినా
చివరిదాకా చిరునవ్వుతో పలుకరిస్తూ
అడగకనే ఆదుకునే సన్నిధిలా
అందించే పెన్నిధి ప్రకృతి !!

ఈ భవభంధాల కొలనులో
అనుభంధాల ముసుగులో
బాధ్యతలు,భందుత్వాలు
స్నేహాలు,ఆప్తులనే నమ్మదగ్గ
పేర్లున్న మాయా వలయంలో
జ్ఞాపకాలతో ఈదే ప్రాణాలకు
ఏ అమూల్యమైన క్షణం మనవశమైనా
ఏ అనుభూతితో మనం పరవశమైనా
ఏ పుణ్యమో ప్రాప్తమై నోచుకున్నా
ఆ దీవెన ప్రకృతి దివ్యవరమే !
ఆ గడియ ప్రకృతి వరప్రసాదమే !

కాని, ...
అశాశ్వతమైన ఆర్భాటాలతో
అనైతిక స్వార్థానికి సొగసులద్దుకొని
అంతిమంగా వెంటరాని సంపదలతో
పతనానికి ప్రతిరూపమైన అహంతో పోలికతో
జీవితాన్ని పొక్కిలిచేసుకొంటూ
మంచి అనిపించుకునే మాయలోపడి
మాటకు అసత్యాల రంగేసుకొని
నాలుకకు నమ్మకమనే తేనెరాసుకొని
అంతరాత్మకు పొగమంచు తెరనుకప్పి
మనసుకు మేధస్సుతో మెలికలు పెడితే
అతివృష్టి, అనావృష్టి అనే కవలలకు
తోడుగా కరోనాలాంటి మూడోబిడ్డకు
పురుడుపోసి ఒక లెక్కతో,ఒక పద్ధతితో
పొతంచేసుకుంటూ పోదా ప్రకృతి ?

–రాజేశ్
9440560490

చేనేత మెరుపులు

కొత్తకొత్త ప్యాషన్లకు
అలవాటుపడ్డ జనం
జీవంపోస్తరా చేనేతకు
చెప్పండి నిజం !!

మగ్గాన్ని ఒడిసిపట్టి
మంచిబట్టలు నేస్తరు
కండెలను అదిమిపట్టి
డిజైన్లు వేస్తరు !!

చీరకు అందంగా
దారపు పోగులు
గుర్తించని చందంగా
కాలుతున్నవి మీకడుపులు !!

ఓపికే మీఆయుధం
వస్త్రాలు నేయడానికి
ఎముకలే మీకుబంధం
నీటారుగా కూర్చోవడానికి !!

కష్టాల మయం
మీ జీవితాలు
మీకుంటలేదు అభయం
ప్రభుత్వ సహాయాలు !!

పట్టుబట్టలు పాయే
పదేండ్ల కిందనే
చంకీలు ఒదిగిపాయే
స్యారీల మీదనే !!

చేనేత వస్త్రాలంటే
మూతి ముడుచుకుంటరు
కట్టుకొమ్మని కోరుకుంటే
చులకనగ చూస్తరు !!

చేనేతను ఆధరిస్తే
రాష్ట్రం ఆగమైతుందా..?
చేనేత బట్టలేస్తే
మనిషివిలువ తగ్గుతుందా...? !!

దగ్గుదమ్ములతో మీరు
దావాఖానలో పడుతరు
ప్రభుత్వసాయంలేక మీరు
గగ్గోలు పెడతరు !!

మగ్గాలిరిగి మూలకుంటే
మనకు మంచిగుంటదా..?
కులవృత్తుల కాపాడకుంటే
మనిషి బతుకుడైతదా..? !!

–తాండ్ర చిరంజీవి
9959180762.

రైతు కథ పరిశీలన

తెలంగాణలో జరిగిన పరిణామాలన్నీ కథల్లో కనపడతాయి. కథా రచయితలు ఇక్కడ జరిగిన మార్పులను, పోరాటాలను, ఉద్యమాలను, నేపథ్యంగా తీసుకొని కథలు రాశారు. అలా కథ వొక చారిత్రక వనరుగా నిలిచింది. ప్రజల సుఖ దుఃఖాలను, ప్రజలు తమ అభివృద్ధి కోసం జరిపిన ప్రయత్నపరంపరను కథ పట్టించుకొంది. భందారు అచ్చమాంబ నుండి నేటితరం రచయితల వరకు రాసిన కథలు అన్నీ కూడా ప్రజల పక్షం నిలిచాయి. తెలంగాణలో జరిగిన వికాసం మొదలుకొని నేటి ప్రపంచీకరణ సందర్భంగా జరుగుతున్న విస్మృతి వరకు, పోయిన పోకడలన్నీ కూడా కథల్లో కనపడతాయి. విస్మృతికి గురి అయిన సమూహాలు తలెత్తుకొని, తమ అస్తిత్వ ఆకాంక్షలను ఎలుగెత్తి చాటిన విధానాన్ని కూడా కథ అక్కున చేర్చుకుంది. తెలంగాణ కథ నడిచిన దారులను పరిశీలించి, కథ ప్రజల వెతలను ఏ విధంగా పట్టించుకుందో డా॥ బి.వి.యన్.స్వామి వివరిస్తున్నారు.

– సంపాదకులు

తెలంగాణలో జాతీయోద్యమం పెద్దపెట్టున జరగలేదన్నది వాస్తవం. జరిగిన నిజాం వ్యతిరేకోద్యమాన్ని జాతీయోద్యమంలో భాగంగానే గుర్తించాలి. 1946లో తెలంగాణసాయుధపోరాటం వరంగల్, నిజామాబాద్, కరీంనగర్‌లోని కొన్ని తాలూకాల్లో ఉధృతంగానే నడిచింది. తెలంగాణ నైజాం పాలనను వదిలించుకొని భారత యూనియన్ లో కలిసిన తరువాత గ్రామాల్లోని భూస్వాములు కాంగ్రెస్ పార్టీలో కలిసారు. తెలంగాణలో కౄరమైన భూస్వామ్యం తిరిగి పడగ విప్పింది. గ్రామాల్లో ఎక్కువ భూమి, భూస్వాముల చేతుల్లోనే ఉండేది. పేద రైతులు, రైతు కూలీలు వెట్టి బతుకులు బతికారు. మాదిగ, మాల, చాకలి, గొల్లలాంటి వారు వెట్టిపనులు చేసేవాళ్ళు. పోలీస్ పటేల్, పట్వారీ వ్యవస్థ అమల్లో ఉంది. ప్రజలను పీడించుక తినేవాళ్ళు. దుర్మార్గమైన భూస్వామ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాట్లు జరిగాయి. 1970ల తర్వాత నక్సల్‌బరీ స్ఫూర్తితో, ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో జరిగిన ఉద్యమం రైతాంగంలో చైతన్యాన్ని పురికొల్పింది. వారు పల్లెల్లో చేసిన పోరాటాలకు కథ వాహిక అయింది. తిరుగుబాట్లు, పోరాటాలు కథల్లో నిక్షిప్తమయ్యాయి. ఇవన్ని కథా రూపంలో చరిత్రగా మిగిలాయి.

ఎండాకాలంలో వచ్చే బీడి ఆకు రేటును ప్రజలు అనేక పోరాటాల నేపథ్యంలో పెంచుకోగలిగారు. కూలీరేట్లు, పాలేర్ల జీతాలపెరుగుదల గ్రామీణ రైతాంగంలో సంచలనాన్ని రేపింది. పోరాటం ద్వారా సమస్తం సాధించవచ్చనే నమ్మకం పేద ప్రజల్లో బలంగా నాటుకుంది. ఊరూరా రైతుకూలి సంఘాలు ఏర్పడ్డాయి. 1) వెట్టి రద్దు 2) దొరల పెత్తనాన్ని ధిక్కరించడం 3) తమ సమస్యల్ని సంఘం ద్వారా పరిష్కరించు కోవడం లాంటి చర్యల ద్వారా సంఘం విజయాలు సాధించింది. ఈ క్రమాన్నంతా రచయితలు కథలు కథలుగా రికార్డు చేసారు. సంకలనాలుగా ముద్రించారు. ఈ నేపథ్యంలో 1973లో కరీంనగర్ ఉద్యమసాహితి **"బద్‌లా"** అనే కథా సంకలనం తెచ్చింది. ఆ తరువాత అల్లంరాజయ్య రాసిన **"ఎదురుతిరిగితే"** కథ వచ్చింది. కథ సమిష్టి ఆచరణ నుండి ఆలోచన నుండి రూపొందడం ప్రారంభమయింది. ఘటనలు, ఒకరు వేరొకరికి చెప్పడం ద్వారా కథ రాస్తున్న పద్ధతి నుండి చెప్పే పద్ధతికి మార్పు చెందింది. ఇట్లా వచ్చిన కథల్లో **"సంఘం", "కుంపటి", "మార్పు", "చేపలు"** లాంటి కథలున్నాయి. 1979లో **"ఎత్తుంద్రి పిడికిల్లు"** అనే కథ వచ్చింది. ఈ కథ 1978 నుండి 1980 వరకు గల పోరాట దశలన్నిటిని చిత్రించింది. సమాజంలో జరుగుతున్న హింసకు పొద్దంతా పనిచేసి అలసిపోయే శ్రామికులు, కూలీలు కారణం కాదు. "మేం సకల వస్తువులు తయారుచేసే వాళ్ళం గాని, నాశనం చేసే వాళ్ళం కాదు. దొరలు ఈ వస్తువులను నాశనం చేస్తుంటే ఇన్నేండ్లు చూసినం. ఈ నాశనాన్ని ఆపడానికి మేం కొట్లాడుతున్నాం. అనే భావన సమస్త కూలి, నాలీ జనంలో వ్యాపించింది. హింసచేసే దెవరు? దాన్ని ఆపేదెవరు? అనే విషయాలను తార్కికంగా చర్చిస్తూ "సృష్టికర్తలు" అనే కథ వచ్చింది. దొరలు, ప్రజలను ఎదిరించజాలరని నిర్ణయించుకొని పోలీసులు గ్రామాల్లోకి వచ్చి చేరారు. వారితో పాటు అధికారులు, కోర్టులు జన జీవితంలోకి వచ్చాయి. వందల, వేలకేసులు గ్రామీణ ప్రజల మీద మోపబడినాయి. ఈ నేపథ్యం నుండే "శత్రువునేర్పిన పాఠం'' అనే కథ వచ్చింది. దొరలు పల్లెల్లో బతకజాలని పరిస్థితులు వచ్చాయి. ఇల్లిల్లు గాలించడం, చిత్రహింసలతో పల్లెలు పోలీసు క్యాంపులతో నిండిపోయాయి. కరీంనగర్–ఆదిలాబాద్ జిల్లాల నుండి వరంగల్, నిజామాబాద్ గ్రామీణ ప్రాంతాలకు ఉద్యమం వ్యాపించింది. గ్రామాల ప్రజలు జరుగుతున్న స్థితిగతులను, దేశ అంతర్గత సమస్యగా అర్థం చేసుకున్నారు. సామాజిక సంబంధాలను అర్థం చేయిస్తూ **"భూమి", "మార్పు", "తల్లిచేవ" "సారాంశం"**లాంటి అనేక కథలు వచ్చాయి.

పోరాటం సాయుధ రూపం తీసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తూ **"సత్యం"** కథ వచ్చింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో సాయుధ దళాల ప్రతిచర్యలు ప్రభుత్వానికి శాంతి భద్రతల సమస్యలుగా కనిపించాయి. దాంతో గ్రామాలన్ని పోలీసు క్యాంపు లయ్యాయి. ఎన్‌కౌంటర్లు జరగడం, ఇళ్లు కూలగొట్టడం, ధాన్యాన్ని బావుల్లో పారబోయడం లాంటి చర్యలు ప్రభుత్వం జరిపించింది. దానికి ప్రతిచర్యగా రైతాంగం తమ కార్యకర్తల హత్యలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసారు. 1987 తరువాత జరిగిన ఈ విధ్వంసం మీద చర్చ మొదలయింది. విధ్వంస స్వరూప, స్వభావాలను చిత్రిస్తూ విధ్వంసం ఎవరు చేస్తున్నారో? దాని ఫలితాలేమిటో చర్చిస్తూ **"మనిషిలోపలివిధ్వంసం"** కథ, ఈ మొత్తం పరిణామ క్రమాన్ని చిత్రిస్తూ అనేక కథలు గతంలో కన్నా లోతుగా, విలక్షణంగా వచ్చాయి. **"నీల", "గొడుగు", "ఒక తండ్రి"** లాంటి అనేక కథలు ఈ కోవకు చెందినవే. పల్లెలోని ప్రజలుఅనేక ఆటుపోట్లకు తట్టుకున్నారు. ఉన్నతంగా బ్రతకడానికి అనేక ప్రయత్నాలు చేసారు. అటువంటి ప్రయత్నాల్లో భాగంగా అనివా ర్యంగా ఉద్యమం వైపు మొగ్గు చూపారు. భూస్వాముల, ఉద్యమకారుల, పోలీసుల, రాజకీయనాయకుల, అధికారుల ప్రభావం పల్లెప్రజలపై అధికంగా ఉంది. వారు భయం భయంగా గడిపారు. అటువంటి జీవితాల్ని చిత్రించిన కథలు అనేకం ఉన్నాయి.

రైతాంగ పోరాట కథల్లో చుక్క రాసిన (ముప్పాల లక్ష్మణరావు) **"ఎత్తుంద్రి పిడికిల్లు"** విశిష్టమైన కథ. ఈ కాలంలో వచ్చిన కథలన్నీ రాజకీయ అవగాహన కల్గి, ఉద్యమ స్పృహతో వచ్చినటువంటివే. కాని ఈ కథ సాంస్కృతిక నేపథ్యంలో వచ్చిన చక్కని కథ. కథలోని ఎత్తుగడనే, తెలంగాణ సాంస్కృతిక విశిష్టతను తెలిపే బతుకమ్మ పండగతో మొదలైంది. ఆనాటి ఉద్యమ వ్యూహకర్తలు, ప్రతీ అంశాన్ని దొరపై ఎక్కుపెట్టే సాధనంగా మలిచారు. అటువంటి స్థితిలో సాంస్కృతిక అంశమైన బతుకమ్మ కూడా తిరుగుబాటు సాధనమైంది. ఊర్లలో బతుకమ్మలు దొర ఇంటి ముందు పెట్టి ప్రతి ఒక్కరు తప్పనిసరి ఆడాలి. దొరల ముందు ఆడిపాడాలి. ఆ సమయంలో దొరల వికృత చేష్టలు భరించాలే. ఈ ధోరణిని ఎదిరించడానికి ఎవరి బతుకమ్మలు వారి వాడలో పెట్టుకొని ఆడాలని ముఖ్యంగా దొర ఇంటి ముందు పెట్టకుండా సంఘం కట్టుదిట్టం చేసింది. ఈ విషయాన్ని కథకుడు కథీకరించాడు. ఉద్యమకాలంలో తెలంగాణలోని పల్లెలు ఎటువంటి భయానక స్థితిలో ఉండేవో తెలిపే కథ అల్లంవీరయ్య **"పిలగాని ఏడుపు"**, ఊరిపై పోలీస్ రైడ్ ముగిసాక ఊరంతా అత్తిపత్తిలాగా ముడుచుక పోయేది. అనేక మంది కార్యకర్తలు కనపడకుండా పోయేవారు. ఈ విషయాలన్ని కథలో కనపడతాయి. తుమ్మేటి రఘోత్తమ రెడ్డి రచించిన **"నాపాత స్నేహితుడు"** కథ సమాజంలో చోటు చేసుకున్న మార్పులను, ఘర్షణలను వివరిస్తుంది. ఆనాటి తెలంగాణలోని పరిస్థితులను చూపిస్తూ సమాజంలోని మనుషులు రెండు వర్గాలుగా విడిపోయిన వైనాన్ని చెప్పాడు. పొలం పనులు చేసుకునే రైతులు, బొగ్గుగని కార్మికులుగా మారడం, ఊళ్ళో పొలం పనులు చేయించు కుంటున్న రైతులు కూలీలపై ధారుణంగా ప్రవర్తించడం కళ్ళకు కట్టినట్లుగా కనపడుతుంది. భూపోరాటాలలో **"సంఘం"** నాయకులకు పోలీసు, పెత్తందారి వర్గాలనుండే కాక, స్వజాతి లంపెన్స్ నుండి కూడా హాని ఉంటుందని తెలిపే అద్భుతమైన కథ అల్లం రాజయ్య రాసిన **"నీల"**. లక్ష్మీరాజం లాంటి ఉద్యమకారున్ని చంపించే పాత్రలో నీల భర్తను, లక్ష్మీరాజం లాంటి వానిగా తన కొడుకును తయారు చేయాలనే దీక్షలో నీలను చిత్రించి కథను రక్తి కట్టించారు. తెలంగాణ అంతా మార్పులతో, మార్పులకు కారణ భూతమైన యుద్దాలతో తల్లడిల్లింది. ఆ యుద్దంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక వైపున ఉండి తీరాల్సిన వాళ్ళే. బయటపనిచేసేవారైనా ఇంట్లో ఉండే వారైనా రెండుగా చీలాల్సిందే. అటువంటి అనివార్యమైన స్థితిని చిత్రికపట్టిన కథ **"జాడ"**. రఘోత్తమరెడ్డి రాసిన ఈ కథ భార్యాభర్తల మధ్య సంఘర్షణగా సాగుతుంది. తెలంగాణలో జరిగిన సంఘర్షణ వల్ల వేలాది ఎకరాల భూమి బీడుపడిపోయింది. మట్టి నుండి ఆహార ధాన్యాలను సృష్టించగల మనిషి శక్తి హరించుకపో యింది. దీనికి కారణం ఎవరు? ఒక సృష్టికర్తలోని సృజననంతా మాడ్చి మసిచేసిందెవరు? అనే ప్రశ్నల నేపథ్యంగా అల్లంరాజయ్య అల్లిన కథ **"మహాదేవుని కల"**. అనేక కారణాల వల్ల పల్లెల్లో వ్యవసాయం మూలకుపడ్డా, వ్యవసాయం మీద ఆసక్తిని చంపుకోని యువకుడు మహాదేవుడు. మహాద్భుతమైన మహాదేవుని వంటి మనుషులు మట్టి నుండి సర్వ సంపదలు సృష్టించగలగి ఉండీ నిర్వీర్యులవడం వెనుక గల కారణాలను, మతలబును విశదీకరిం చిందీ కథ. అగ్రహార బ్రాహ్మడైన మహదేవుడు, క్రింది కులాల మాదిరిగా కాయకష్టం చేయడమేంటి? అనే వర్ణవ్యత్యాస భావజాలం కూడా కథలో పరచుకొంది. తెలంగాణా జిల్లాల్లో రైతాంగ పోరాటాలు ఉధృతమయ్యాక మిగులు భూమి పంపిణీ కోసం, ఊర్లలో నక్సలైట్‌ల నాయకత్వంలో భూముల్లో జెండాలు పాతారు. పోరంబోకు భూముల్ని ఆక్రమించి దున్నుకున్నారు. ఇది ప్రతి ఊర్లో జరిగింది. ఉత్తర తెలంగాణలో ఈ ఉద్యమం యొక్క ఉధృతి మరింత ఎక్కువ. ఈ క్రమాన్ని **"చావువిందు"** కథలో రఘోత్తమరెడ్డి చిత్రించారు. ఉద్యమకారుల కార్యాచరణ ప్రభావం మూలంగా భూస్వాములు ఏ విధంగా చావుదెబ్బ తిన్నారో చిత్రితమైంది. ఈ చిత్రణకు కర్మకాండ తరువాత విందు వేదిక అయింది. చావశివకోటి రాసిన "గడీ" కథ ఊర్లో దొరదౌర్జన్యానికి బలైపోయిన ఆడపిల్లల తల్లిదండ్రుల మనోవేదనకు అద్దం పడుతుంది. ఐతాంగ పోరాటాల ప్రభావం నిండా పులముకున్న కథ **"భూమి"**. ఊర్లో జరిగిన మార్పులను చిత్రించిన కథ ''చేపలు''. పనిబాటలోల్లు తుపాకులు, తూటాలు పట్టుకోవడం, తిరగబడడం అన్నీ కూడా దొరలు నేర్పించినవేననే సత్యం "శత్రువునేర్పినపాఠం" కథలో ఉంది. ఈ కథంతా కోర్టులోనే జరుగుతుంది. **"అడవిమనిషి"** కథ ఏమి తెలియని రైతు పట్నం వచ్చి ఎన్నిరకాలుగా కష్టపడ్డాడో తెలుపుతుంది. మూడుతరాల సామాజిక వ్యవస్థకు నిలువుటద్దంగా **"సృష్టికర్త ఆవేదన"** అనే కథ నిలుస్తుంది. దొర చేతిలో ఉన్న తన భూమిని తాను దున్నుకోవడం, గొడవపడ్డ దొరను అదే చేనులో పంచాయతీకి కూర్చోబెట్టడం **"సంఘం"** కథలోని ఇతివృత్తం. దొరల వ్యవస్థను దొరను ఆంబోతుతో పోల్చి చెప్పింది కాలువ మల్లయ్య రాసిన "ఆంబోతు" కథ. బీడుగా పడి ఉన్న పరంపోగు భూమిని ఆరుగాలం కష్టపడి సాగుకు తెస్తే ఆ భూమిపై హక్కు తనదేనని దొర జులుం చేయడం, సంఘం బలంతో ఆ భూమిని సాగుచేసుకోవడం "ఈ భూమి ఎవరిచ్చిండ్రు" కథలో కనపడుతుంది. **"ధిక్కారం"** అనే కథలో దొర్సాని యొక్క నిరంకుశ, అవమాన కరమైన మాటలను, చేతలను ప్రశ్నించిన పాలేరు స్త్రీ కనపడుతుంది. ఫ్యూడల్ విలువలు రాజ్యమేలిన ఊర్లల్లో దొర ఎట్లైనా వెళ్ళాలంటే అతని సవారిబండి ముందు, వెనుక చాకలి వాడు ఉరకవలసిందే. ఒక వేళ వానింట్లో ఏదైనా ఆపద ఉంటే వాని కొడుకు చిన్నవాడైనా, పెద్దవాడైనా ఉరకాల్సిందే. ఆ విధంగా బండి ముందు ఉరుకుతున్న చాకలి పిల్లవాని అంతరంగ వ్యథ **"సవారి"** కథ. ఇత్తనాలు చల్లడం నుంచి ధాన్యమమ్మడం వరకు రైతు ఎంతో మోసానికి గురి అవుతున్నాడు. తను పండించిన పంటకు ధర నిర్ణయించే అధికారం లేకపోవడం అవమానంగా భావించి రైతులందరూ ఒక్కటైతే బాగుంటుందని అనుకుంటాడు. ఇది రఘోత్తమరెడ్డి రాసిన "ఒక్కటైతే" కథ సారాంశం. ఈ కథలో దళారుల బారిన పడుతున్న రైతుల వ్యథలు కనపడతాయి.

ప్రాంతానికి, ప్రాంతానికి మధ్యగల భౌగోళిక వైరుధ్యాలు, తేడాలు జీవితాల్ని ఏ విధంగా ప్రభావం చేస్తాయో, వ్యవసాయం ఆధారంగా రుజువు చేసిన కథ పి.చిన్నయ్య రాసిన **"మెట్ట భూమోదు"**. నల్గొండ జిల్లాలో కోదాడ, దేవరకొండ రెండు ప్రాంతాలు. కోదాడ నీటితో నిండి సస్యశ్యామలంగా ఏపుగా పెరిగిన పంట పొలాలతో ఉంటుంది. దేవరకొండ, కొండలు, గుట్టలతో నిండి ఎడారి ప్రాంతాన్ని, కరువును గుర్తుకు తెస్తుంది. కోదాడ అమ్మాయికి దేవరకొండ అబ్బాయికి పెళ్ళి జరుగుతుంది. పెళ్ళయ్యాక కోదాడ మండలంలో టీచర్‌గా పనిచేస్తున్న అబ్బాయి, సొంత ఊరైన దేవరకొండకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటాడు. ఇక్కడ అమ్మాయికి, అబ్బాయికి మధ్య ఘర్షణ మొదలయి తుంది. పేరుకు భార్యాభర్తల ఘర్షణే అయినా అదిరెండు ప్రాంతాల తారతమ్యానికి ప్రతీకగా కనిపిస్తుంది. ఈ చైతన్యం ఇచ్చిన తెలివితోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలయింది. **"మా నీళ్ళు మాకు కావాలే"** అనే నినాదం ఉధృతంగా వినవచ్చింది.

తెలంగాణలో వ్యవసాయం ఎంత ఖరీదైందో, ఎంత కష్టమైందో చెప్పే కథలు అనేకం ఉన్నాయి. అందులో **"బోరుపొక్కలు"** అనే కథ ఒకటి. బోధనం నర్సిరెడ్డి రాసిన ఈ కథలో దేవరకొండ ప్రాంతరైతు కష్టం రికార్డయింది. ఇది శిలాసదృశమయిన భూమి. ఇక్కడి భూమిలోనీళ్ళు ఉండవు. వర్షాలు కురువవు. నీటి పారుదల తక్కువ. ప్రాజెక్టు నీళ్ళురావాలి. అవి రాకుంటే రైతు సొంతంగా బోర్లు వేసుకోవాలి. వ్యవసాయం మీద ఆశ చెడని రైతు బోర్లు వేసుకుంటూ, విపరీతమైన అప్పులు చేసుకుంటూ కష్టం, నష్టం ఎదుర్కొంటూ వ్యవసాయం చేయడం భారం అయింది. చాలా మంది భూముల్ని అమ్ముకోడానికి తయారు అయినారు. పాలించిన ప్రతి ముఖ్యమంత్రి ఏదో ఒక పేరున నీళ్ళవసతి కల్పించే ప్రయత్నం చేయడం వల్ల, సాగునీరుకు తక్కువ తాగునీరుకు ఎక్కువ నీటి వసతి కలిగింది. ఈ పరిణామం వల్ల నీటి వసతి కల్గిన చోట భూములకు ధరలు పలికినయి. పంటలు పండక పోవడం వల్ల భూమి అమ్మడానికి రైతు తయారైతే, రైతు కుటుంబంలోని పిల్లల అమెరికా ఆశలు భూములను అమ్మకం పెట్టే దిశగా ప్రేరేపించి నయి. ఒకప్పుడు భూమి కలిగి ఉండడం స్టేటస్ సింబల్. ప్రస్తుతం అది తిరగబడింది. ఈ పరిస్థితిని **"స్టేటస్ సింబల్"** అనే కథలో ఎలికట్టె శంకర్‌రావు వివరించారు. భూమి అమ్ముకోవడమే స్టేటస్ సింబల్ అని తీర్మానించాడు. ఇంత నిరాశలో పడిపోవడం తెలంగాణ రైతుదీనావస్థను చూపెడుతుంది. దీన్ని ఆసరాచేసుకొని రియలెస్టేట్ వ్యాపారులు, రైతును మోసం చేయడం కూడా కథల్లో కనిపిస్తుంది. ఈ విషయాన్ని ఎనుగంటి వేణుగోపాల్ "మట్టి జీవితాలు" అనే కథగా మలిచిండు. ప్రాజెక్టుల కింద భూములు పోయినోళ్ళకు డబ్బులు ఇప్పించే పనిని కొందరు వకీళ్ళు వృత్తిగా మలచుకున్నరు. రైతుకు వచ్చిన డబ్బులో తమ కమీషన్ కింద, ఖర్చుల కింద డబ్బులుకట్ చేసుకొని మిగిలిన డబ్బును రైతుకు అందజేయడం వారిపని. అట్లా వచ్చిన తక్కువ మొత్తంతో వేరే చోట భూమిని కొనాలనుకున్న రైతుకు నిరాశే మిగులుతుంది. ఈ నిరాశ అనేది రియలెస్టేట్ వ్యాపారం యొక్క ప్రభావం. తన పదెకరాల పొలానికి వచ్చిన పైసల్తోటి కేవలం అరగుంట భూమి పట్నంలో కొనడం అనేది రైతు పరిస్థితిని తెల్పుతుంది. చివరకు "కొనబోతె కొరివి అమ్మబోతె అడవి అంటే ఇదేనేమో" అనుకోవడం అతని వంతైంది. **"ప్రాజెక్టు కింద", "అభివృద్ధికి ఆవల"** అనే రెండుకథల్లో ముంపు గ్రామాల రైతుల జీవితాలను బి.వి.ఎన్.స్వామి చిత్రించాడు.

ప్రభుత్వం పేదలకు భూమి పంచింది. అది దున్నుకొని బతకమని చెప్పింది. అట్లా భూములు తీసుకున్న రైతుల అవస్థను చిత్రించిన కథ "బతుకు". మేరెడ్డి యాదగిరి రెడ్డి రాసిన ఈ కథలో రైతు జీవితంలో ఎదురయ్యే ప్రతి అవస్థ వివరించబడింది. గ్రామ కార్యదర్శి తహసీల్దారు వసూళ్ళు, భూమిని చదును చేయడంలోని కష్టం, బోరు బావికి బిగించే మోటారు ఖర్చులు, కరెంటు ఖర్చులు, విత్తనాల పెట్టుబడి అన్నీవెరసి అప్పుల పాలవడం, పురుగు మందుల ఖర్చులు, వడ్డీలు పెరిగిపోవడం, పిల్లల అవసరాలు పెరగడం, పెండ్లిల్లుచేయడం, మొదలైన విషయాలు రైతుపై ఎలా భారం మోపుతాయో తెలిపాడు. దీనికితోడు పంటతక్కువరావడం అనివార్యంగా పొలం పరాయిపశం చేయడం కథలో కనపడుతుంది. ఐతా చంద్రయ్య "భూమి పుత్రుడు" కథలో రైతు మరణానికి గల కారణాలను చిత్రించాడు. వ్యవసాయంమూలకుపడ్డ రైతు కొడుకులు, బిడ్డల చదువు ఎలాకష్టాల కొలిమిలో నుండి బయటపడుతుందో గర్భకుర్తి శ్యామల "వెతల నడుమ చదువు"అనే కథలో వివరించింది. రేగులపాటి కిషన్‌రావు రాసిన "మాఊరికథ" ముంపు గ్రామం యొక్క గత వైభవాన్ని, రైతు జీవితాన్ని, తెలిపేదిగా ఉంది. రైతు జీవితం దిగజారడం, రైతుకు, భూమిలో వేసే విత్తనానికి, మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని కోట్ల వనజాత ''ఇత్తు'' కథలో చిత్రించింది. పేద రైతుజీవనంలోని కష్టాల్ని ఇబ్బందుల్ని కొట్టం రామకృష్ణారెడ్డి "నూనెసుక్క" కథలో విడమరిచాడు.

రైతులు వ్యవసాయం చేయడం కోసం రెండు రకాల అప్పుల విధానాలను అనుసరిస్తున్నారు ఒకటి, ప్రైవేటు అప్పులు. షావుకార్ల దగ్గర, ఊర్లో ఇతరుల వద్దచేసే ఇవి అడ్డికి పావుసేరు అన్నట్లుంటవి. రెండోరకం అప్పులు బ్యాంకుల అప్పులు. కల్లం మీదనే అప్పుకింద ధాన్యం కొలుచుక పోతడు షావుకారి. అప్పుకట్ట వీలులేక రైతు సతమతమవుతుంటే నాగటిమీదనే ఎడ్లను వేలం వేయడం బ్యాంకు అధికారుల అలవాటు. ఈ విషయాల్ని వివరిస్తూ చెరబండరాజు "శాంతి" అనే కథరాస్తే, కె.రామ్మోహన్ రాజు "తీర్మానం" అనే కథరాసారు. పంట పండించడంలో భాగంగా రైతులు అనేక అప్పులు చేస్తారు. అప్పుల వల్ల అనేక తిప్పలు పడుతారు. వాటిని తెలిపే కథలు వచ్చాయి. కె. హనుమంతరెడ్డి రాసిన "బండి", కేసరి రాసిన "సర్కారు బాకీ" లాంటి కథలు రైతులు అప్పుల కింద ఎలా నలిగిపోతున్నారో తెలుపుతాయి.

"తెలంగాణ నైజాం పాలనను వదిలించుకొని భారత యూనియన్ లో కలిసిన తరువాత గ్రామాల్లోని భూస్వాములు కాంగ్రెస్ పార్టీలో కలిసారు. తెలంగాణలో కౄరమైన భూస్వామ్యం తిరిగి పడగ విప్పింది. గ్రామాల్లో ఎక్కువ భూమి, భూస్వాముల చేతుల్లోనే ఉండేది. పేద రైతులు, రైతు కూలీలు వెట్టి బతుకులు బతికారు."

ప్రాంతానికి, ప్రాంతానికి మధ్యగల భౌగోళిక వైరుధ్యాలు, తేడాలు జీవితాల్ని ఏ విధంగా ప్రభావం చేస్తాయో, వ్యవసాయం ఆధారంగా రుజువు చేసిన కథ పి.చిన్నయ్య రాసిన "మెట్ట భూమోదు"

ఉద్యమకాలంలో తెలంగాణలోని పల్లెలు ఎటువంటి భయానక స్థితిలో ఉండేవో తెలిపే కథ అల్లంవీరయ్య "పిలగాని ఏడుపు",

భూమి కోసం భూస్వామితో పోరాడిన కథ, వ్యవసాయం చేయడానికి నీటి కోసం యాతన పడ్డ కథ, వ్యవసాయం భారమై భూమిని అమ్ముకున్న కథ, ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో పంట తీయలేని రైతు దీన కథ, వ్యవసాయం భరీదైన వ్యవహారంగా మారి అప్పులపాలైన రైతు ఆత్మహత్య కథ, అభివృద్ధిలో భాగంగా కట్టిన ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన నిర్వాసితుల ముంపు కథ ఇలా అనేక కోణాల్లో మనిషికి –భూమికి గల సంబంధాన్ని తెలంగాణకథ చిత్రిక పట్టింది.

–బి.వి.యన్.స్వామి
సెల్: 9247 817732

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 'కుర్చీ' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'కుర్చీ' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ: **డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,** 9441046839

అంశం: **కుర్చీ**

పవిత్ర స్థానం

నాలుగుకాళ్ల సింహాసనం
నాలుగు కాలాలు నిలుపుకోవాల్సిన దరహాసం
నలుగురు మెచ్చేటట్లు కూర్చోవలసిన స్థానం
నలుగురికి మంచి చేసే అవకాశం

కొందరికి అలంకార ప్రాయం
మరి కొందరికి బాధ్యతల ప్రస్థానం
ఇంకొందరికి బలవంతపు వ్యవహారం

తమ కుర్చీని పవిత్రస్థానంగా భావిస్తూ
అందరికీ మేలు చేసే వారు కొందరైతే
తమ కుర్చీని డబ్బులు సంపాదించే యంత్రంలా మారుస్తూ
అందరి కడుపు మంటకు కారణం అవుతారు ఇంకొందరు
కుర్చీ కాలక్షేపానికి కూర్చునే ఆసనం కాదు
పవిత్రమైన బాధ్యత నిర్వర్తించే మహోన్నత స్థానం
పదిమందికి ఉపకారం చేసే అద్భుతమైన అవకాశం
అది అందరికీ దొరకదు
దొరికిన వాళ్లు దాన్ని సార్థకం చేసుకోవాలి
లేదా మ్యూజియంలో ప్రదర్శించే బొమ్మలకి
ఏళ్లు గా వ్యర్థంగా పడిఉన్న చెత్తకుప్పకి పెద్దతేడా లేదు

– త్రివిక్రమ శర్మ,
9000392707

జీవితంలో అంతర్భాగం

ఆఫీస్ పనుల్లో ఆసనం కుర్చీ
భోజనం చెయ్యడానికి కుర్చీ
సేద తీరడానికి కుర్చీ
పిల్లలు చదవడానికి కుర్చీ
పెద్దల విశ్రాంతికి వాలు కుర్చీ
హోటల్లో కుర్చీ
సినిమా హాల్లో
పెళ్ళిళ్లలో
చావులో
ఆతిథులొస్తే కుర్చీ
ఆర్భాటానికి కుర్చీ
పదవిలో కుర్చీ
హోదాలో కుర్చీ
జీవితంలో అంతర్భాగం కుర్చీ.– **శ్రీనాథ్ కులకర్ణి,**
9030881863

జీవిత లక్ష్యం

నడకలు నేర్వని ఆ నాలుగు కాళ్ళు
నడిచే రెండు కాళ్ళ ప్రాణిని తన చుట్టూరా తిప్పుకుంటూ...
ప్రాణం లేకున్నా పలు రీతులు గలిగి
తనకై వెంపర్లాడించే మహత్తు కలిగినది...

ఆటల్లో తనకోసం గిరగిరా తిప్పుకుంటూ
అందినాకా అలసట తీర్చి
ఆనందపు రుచిని పంచును...

అధికార మోజు నింపి...
అందలమెక్కాలనే ఆరాటం పెంచి
నిరంతరం నిద్రపోనియ్యని ఆశ పుట్టించి
కొందరి జీవిత లక్ష్యంగా చూపును...

కుదురుగా కూర్చోనియ్యని మనసు
తన కొరకై పరుగులు తీస్తుంటే
పగటి కలలెన్నో కనుమంటూనే..
తన ఒడిన వాలితే చాలు
అలసట నెంతో తీర్చు..

రాజకీయం రాజ్యమేలిన యే చోటునైనా..
రాజరికమో...
మరేదో..
కొలువైన దగ్గర
ఆసనమన్నదే ప్రియమై..
తనను దక్కించుకోను జరిగిన కుమ్ములాటలెన్నున్నా...

మనుషుల గౌరవ మర్యాదలకైనా..
అరిగిన కీళ్ళకైనా..
విరిగిన కాళ్ళకైనా..
అనారోగ్యపు బారినపడిన కొన్ని బతుకులకు
నేడు అత్యవసరం అయినది కుర్చీనే...

– శ్రీలతరమేశ్ గోస్కుల,
7013943368

అధికారం

కులం పేరుతో
మతం పేరుతో
ప్రాంతం పేరుతొ
భాష పేరుతో
యాస పేరుతో
నీతికి తిలోదకాలిచ్చి
అవినీతికి
ఆకాశం అంత అవకాశం ఇచ్చి
విలువలుమరచి
ఇచ్చిన మాట మరచి

నేటి నేతల కొట్లాట
కుర్చీ
కోసం నిరంతర పోట్లాట

–పరాంకుశంనారాయణ రావు,
9908229221

వాలు కుర్చీ

పెద్దరికానికి హూందాతనానికి ప్రతీకగా
తరతరాల వారసత్వంగా సంపదగా నిలిచి
అలసి సొలసిన పెద్దలకు వెన్నుదన్నుగా
సేదతీర్చి సాంత్వనిస్తుంది వాలుకుర్చీ

మలి వయసులో రేడియో వార్తలను వింటూ
వాలుకుర్చీలో మేను వాల్చి జారగిలబడి
కళ్ళుమూసుకుని విశ్రాంతి తీసుకుంటూ
ఆదమరచి ప్రశాంతంగా నిద్రించేందుకు ఆధారమై
తోడ్పాటును అందించేది వాలుకుర్చీ

ఇంటిల్లిపాదీతో అనుబంధాలను పంచుకుంటూ
ఆత్మీయ సంభాషణలకు ఆలవాలమయ్యేది
పుస్తకాలు చదవడానికి రాయడానికి
వాలుకుర్చీ అడ్డుబల్ల ఆధారమయ్యేది

ముదిమిలో తోడువుంటూ హాయినిచ్చే నేస్తం
వార్ధక్యంలో ఆసరాగా నిలిచే వాలుకుర్చీ
ఆధునిక జీవనంలో ఆదరణ కోల్పోయి
పనికిరాని వస్తువుగా అటకెక్కించినా
మధుర జ్ఞాపక చిహ్నమై మదిలో నిలిచింది

–పులి జమున,
8500169682

గోడకుర్చే!

కుర్చీ కోసమే కదా కొట్లాట
ఆరా

జంట నగరాలలో వర్ష విలయం

ఆ॥వె॥ గాలివాన మేఘమాలలా కసమంత
ఆవరించి గర్జనమ్ముజేయ
మెరపు మెరిసె, పిడుగు ధరణిపైన బడగ
నేల మట్టమాయె, నిండ్లు చెట్లు
ఆ॥వె॥ నీటి వరదవచ్చి నిమిషాలలోననే
కాలినీలు మునిగి కడలియాయె
ఇండ్లు నీట మునిగి, యిబ్బందు లెదురాయె
నింగి నేల కలిసి అంగలార్చె

ఆ॥వె॥ వరదలెన్నొవచ్చి, వరిచేనులను ముంచె
కాయగూర మడులు మాయమాయె
త్రాగనీరు లేదు, రేగెనొ కలిమంట
పోగ దారిలేక పోయెనటకు.

ఆ॥వె॥ కుంభ వృష్టివలన కూలెను భవనాలు
నీరు నిలువ కనుల నీరు దొరలే
అచ్చటచ్చటంత అగమాగమ్మాయె
ఏమి తోచదాయె నెవరికైన
ఆ॥వె॥ మోరీలు పొంగి పొర్లుతు
లారీలను, కార్ల జీబులన్నిటి నెల్లన్
పారే జలమున కల్పుతు
దూరాలకు నెట్టుకెళ్లె దొర్లే జలముల్
కం॥ టీవీలు ఫ్రిజులన్నియు
టూవీలర్‌లన్ని చెడెను డూయల్ బెడులున్
దేవతల చిత్ర పటములు
కావలసిన పైకమంత గల్లంతాయెన్
కం॥ నిలయమ్ములలో నిలువై
విలువగు సామాగ్రియంత విలయము పాలై
పలు కాపురమ్ములందున
వెలకట్టగరాని కష్టమెంతో జరిగెన్!

– రసప్రంతి, కావ్యసుధ
సెల్:9290215858-9247313488.

మహిళల భద్రతే ధ్యేయంగా 'షీ టీమ్స్'

మహిళలకు భద్రత కల్పిస్తు వారికో భరోసాగా నిలబడే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 24వ తేదీ 2014న "SHE టీం"ను ప్రారంభించింది. స్త్రీల రక్షణ దిశగా ఇది జాతీయ స్థాయిలోనే తొలి ప్రయత్నంగా భావించొచ్చు. ఒక్క భాగ్య నగరంలోనే 100 SHE టీమ్ బృందాలు చురుగ్గా పనిచేస్తున్న సంగతి మనందరికి తెలుసు. ఒక్కో బృందంలో అయిదుగురు పోలీసులు, ఒక ఎస్సై పనిచేస్తారు. వీరందరు మఫ్టీలోనే సేవలందిస్తారు. వుమెన్ సేఫ్టీవింగ్, ఐజిపి స్వాతి లక్రా సారధ్యంలో పనిచేస్తున్న ఈ బృందాలు ఆకతాయిల వెన్నుల్లో ఒణుకు పుట్టిస్తున్నాయి. "ఏ మహిళ అత్యాచారానికి గురైనా గృహహింస, నిర్బంధం, దాడులు, వెట్టిచాకిరి, ఆసిడ్ దాడి, ఈవ్ టీజింగ్, కిడ్నాపింగ్, బాలలపై దుష్ప్రవర్తన" యిలా సమస్య ఏదైనా 100 నంబరుకు ఒక్క ఫోన్ చేస్తే చాలు. నిముషాల్లో అక్కడ వాలిపోతుంది షీటీమ్. బాధితురాల్ని రక్షించడం, నిందితుడిపై తగిన చర్యలకు ఉపక్రమించడం చకచకా జరిగిపోతై. అయిదు సంవత్సరాలవుతున్నా, షీటీమ్ సేవల్ని బాధిత మహిళలందరు వినియోగించుకుంటున్నారా అంటే సింహభాగం స్త్రీల విషయంలో లేదు అనే సమాధానమే వస్తుంది. కారణం? భయం. పోలీసులంటే భయం. ఫిర్యాదు చేస్తే మరిన్ని దాడులెదురవుతాయనే భయం. అనవసర పబ్లిసిటీతో పరువు ప్రతిష్టలకు భంగం వాటిల్లుతుందేమోనన్న భయం. ఫ్రెండ్లీ పోలీసింగ్ పట్ల అవగాహనా రాహిత్యం. ఫలితం? సమాజంలో నేరప్రవృత్తి పెట్రేగి పోవడం. మృగాళ్ళ దాష్టికానికి అంతులేక పోవడం విచ్చలవిడిగా కొనసాగుతున్న గృహహింస, మానభంగాలు, ఈవ్‌టీజింగ్, కపట మోసాలు యిలా ఒకటేమిటి? అన్ని విధాలుగా మహిళలు నలిగిపోతూనే వున్నారు.



మహిళల్లో చైతన్యం పూరించడానికి, SHE టీమ్ సేవలను విస్తృతంగా ప్రజలకు చేరువ జేయడానికి.. ముఖ్యంగా స్త్రీలల్లో అవగాహన పెంపొందించడానికి తెలంగాణ పోలీస్, మహిళా రక్షణ విభాగం 78 మంది కవయిత్రుల నీరాజనం 'హితై SHE ' శీర్షికన ఓ పొత్తం అందిస్తోంది. చీకటి కోణంపై కవయిత్రులు సంధించిన కవితాస్త్రాలను, SHE టీమ్ సేవలపై ప్రసరింపజేసిన వెలుగులను, మహిళా లోకానికి అభయ హస్తంలా అందిస్తున్న భరోసాను ఆస్వాదించవచ్చు.

హితైషి అంటే హితమును (మంచిని) కోరువాడు లేదూ హితమును ఒనగూర్చువాడు అని అర్థం. కానీ ఇక్కడ సంకలనకర్తలు "హితై SHE" అంటున్నారు. అంటే స్త్రీల హితమును కోరువారు లేదు స్త్రీలకు హితమును సమకూర్చువారు అని అర్థం చేసుకోవచ్చు.

సంపాదక వర్గ సభ్యురాలు, ప్రముఖ కవయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి "SHE టీమ్– మనందరి హితై SHE
మన ప్రగతి అభిలా SHE
మనో వికాస ప్రియదర్ SHE
నాగరిక సమాజ మహర్ SHE
ప్రతి స్త్రీ – ఇప్పుడొక క్రాంతిదర్ SHE
SHE టీమ్–మనకొక నిరంతర మార్గదర్ SHE
అంటు గ్రంథౌచిత్యాన్ని మనముందుంచుతున్నారు.

"అహర్నిశలూ స్త్రీల కోసం
శ్రమించే షీ టీమ్స్‌కు
సాహిత్య వందనం! అభినందనం" అంటు కాట్రగడ్డ భారతి స్త్రీ రక్షణకు కంకణం కట్టుకున్న షీటీంను అభినందిస్తున్నారు.

షీటీమ్స్ ఒక సైన్యం
'ఆమె' చుట్టూ అల్లిన
దుర్భేద్య దుర్గం
'ఓ అన్నలా.. నాన్నలా
నన్నాదుకుంటున్న నా ప్రియ నెచ్చెలీ!
నీకు శతకోటి వందనాలు తల్లీ!!" అని నాంపల్లి సుజాత సలాం సమర్పిస్తే..

'అమ్మలా కాపాడే షీటీం
నాన్నలా బుజ్జగించే షీటీం
అక్కలా అక్కున చేర్చుకునే షీటీం
ఆదరించే అన్నలా షీటీం
100కి ఫోన్ కొడితే చాలు
షీటీం మన ముందువాలు" అంటున్నారు. అచ్యుతుని రాజ్యశ్రీ.

గురజాడ శోభా పేరిందేవి
"అక్షరయాన్ రచయిత్రులం
అందుకే సమర్పిస్తున్నా అభివాదం
శతమానం భవతి షీటీం
అందుకో అక్షర నీరాజనం" అంటు కీర్తిస్తున్నారు.

ఒకటా.. రెండా 87 మంది కవయిత్రుల రచనలు.. ఎన్నని ప్రస్తావించగలం?

"షీ టీమ్స్ అనగా
స్త్రీ స్వాతంత్ర్య కేతనంగా అభివర్ణిస్తున్నారు డా॥ డి. శారద.

"మన షీటీమ్ సీటీవో వుండగా
ఏ మగువకూ ఉండదిక ఏ భయమూ
ప్రతి మగువ లక్ష్య సాధనతో ఎగిరేయాలి విజయ పతాక" అంటు చెంగల్వల కామేశ్వరి స్థైర్యం పూరిస్తే

"వీర ధీర సంస్థగా
బాధితుల భరోసాగా
బతుకునిస్తున్న షీటీం
నీకు విజయాభవ
దిగ్విజయీభవ!" అంటు ఈ అయిదు వసంతాల సంస్థను ఆశీర్వదిస్తున్నారు భవాని లీలావతమ్మ.

"వేలకు వేల అత్యాచారాల్ని
చూసిన ఈ నేల..
"షీ టీమ్స్" విత్తనానికి భూమి అయింది
ఐదేళ్ళ మొక్కై పూవుల్ని అందిస్తోంది" అంటు కొనియాడ్తున్నారు శైలజామిత్ర.

పూర్తి వచనంతో, స్టేట్‌మెంట్లతో కవిత్వాంశ లోపించిన రచనలూ లేకపోలేదు.

"ఇవన్నీ ఓ పదిరోజుల్లో రాసిన కవితలు. దీంట్లో గ్లామర్‌నో, గ్రామర్‌నో చూడకండి. మా బాధను పంచుకోండి.. మా ఆశను, ఆకాంక్షని గమనించండి" అంటు సంపాదకవర్గం చేసిన అభ్యర్థనను దృష్టిలో వుంచుకుని చదివితే 'షీ టీమ్స్' చేస్తున్న విస్తృత, విశిష్ట సేవలను అవగాహన చేసుకోవచ్చు.

తెలంగాణ డిజిపి మహేందర్‌రెడ్డి గౌరవ సౌజన్యంతో, డా॥ మమతా రఘువీర్, సుమతి ఐపిఎస్ ప్రధాన సంపాదత్వంలో వెలువడిన ఈ సంకలనంలో 31 జిల్లాకు సంబంధించిన షీటీంల ఈ మెయిల్ అడ్రస్‌లు, వాట్సప్ నంబర్లు పొందుపరచడం అభినందనీయం.

ప్రతులకు: ఉమెన్స్ సేఫ్టీ వింగ్
లకిడికపూల్
హైదరాబాద్.



– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

అలిగిన కలం

పెన్నెందుకో చిన్నబోయింది.....
అది హుషారైన పెన్ను....
దానిది విశాలమైన వెన్ను....
నిటారుగా
నిర్భీతిగా
నిక్కచ్చిగా
నిజాయితీగా
పిల్లల తల రాతలు రాసే పెన్ను....
పదో తరగతి 'స్పాట్ 'కు బయలుదేరేటప్పుడు
కళ్ళింతలు చేసి ముస్తాబయ్యేది...
అసలే 'ఎర్రరంగుది' కదా.....!
దానికి షోకులెక్కువ.....
దాని బలగమంతటినీ కలుపుకుని
నా హ్యాండ్ బ్యాగ్ లో బలే ఫోజుకొడుతుండేది....
ఎర్ర కిరీటం పెట్టుకొని ఎగిరెగిరి పడేది...
తస్సాదియ్యా.....!
'ఆన్సర్ షీట్' చూస్తే ఆగక పోయ్యేది....
అలుపెరగని శివతాండవమే...
వేగం దాని ఇజం
త్యాగం దాని నైజం

దాని రక్తం ఇంకిపోయినకొద్దీ రెచ్చిపోయేది....
బార్డర్ లో సైనికునికున్నంత బాధ్యత దానిది
తప్పును చూస్తే కనికీరా కొట్టేసేది...
లక్ష్యం నెరవేరే దాకా సాగిపోవడమే దానికి తెలుసు...
కంటి చూపును బట్టి కదలిపోతదది
కరెంటుకున్నంత పవర్ దానిది....

మార్కులు లెక్కించేటప్పుడు సూడాలే
దానిసంబురం 'మిత్తిరివిందె' ఎగిరినట్టే.....
ఎన్ని పేపర్లు ఎదురుగా ఉన్నా
పెన్నుకొక కన్ను గీటితె చాలు
అదే చూసుకునేది...
బడి పిల్లల నోట్సుల్లో
సంతకం పెట్టెటప్పుడు
ఆ కాపీలల్ల 'కథాకళి' ఆడేది...

ఆరు నెలలుగా
మూగబోయిన నా 'ఎర్ర పెన్ను'
నిన్న పలకరిద్దామని దగ్గరికెళ్తే
కసురుకుంది.... కన్నెర్ర చేసింది....
ఎంత బతిమాలినా
దాని మనసైతే కరగలే....
కరోనా కష్టం
నా ఎర్రపెన్నుకూ తప్పలే...

–డా.మడత భాస్కర్
8919328582

మినీ కవితలు

రవి ఉదయించెను
తిమి తిరోగమించెను

నాలుక తిట్టింది
వీపుకు చేటు తెచ్చింది.

కరణం (కాకి) లెక్కలు
రైతుకు కడు చిక్కులు.

గరీబుకు తిండి దొరకదు
అమీరుకు శాంతి అందదు.

కొండ, తానే బహుబలిశాలిననుకున్నది
చిట్టెలుక దానికి తూట్లు పొడిచి గాయపరచినది.

పుష్పం వికసించి అట్టుహాసం చేసింది
భ్రమరం దాని పరాగాన్ని పీల్చివేసింది.

అల ఉవ్వెత్తున లేచింది గర్వంగా
ధభీమని కిందపడింది దిగాలుగా

నేటి చలనచిత్రాలు
భారతీయ సంస్కృతికి విఘాతాలు

అవినీతి అంతమయితే
దేశం బాగుపడుతుంది.

వట్టి కబుర్లు కట్టిపెడితే
ఉపన్యాసం రక్తి కడుతుంది.

– అమర్‌జీ
సెల్: 9620186222

కదలి రావమ్మా !

ఈ ధర్మభూమిలో కర్మభూమిలో
కట్టలుతెగిన పురుషహంకార
భావప్రవాహంలో..
స్త్రీహననం విలాపం
మానప్రాణ వినాశనం
నిత్యకృత్యం అయిన వేళ..
విదేశీ సంస్కృతి విషవలయంలో
విలువలు నశించి
స్త్రీకి గౌరవం తరిగి
దుర్మదాంధత పెరిగి
విచ్చలవిడి కుసంస్కారం
ప్రబలిన నేపథ్యంలో..
సామాన్య అతివలు
సమిధలౌతోన్న దుర్దినాల్లో
కదలి రావమ్మా కనకదుర్గా !
మద మహిషాసురుల్ని
సంహరించే దివ్యశక్తివై రావమ్మా !
త్రిగుణాత్మక శూలధారిణివై
ఈ చెడుగులన్నీ చెరిగే
నిప్పుకణికవై కాళరాత్రివై
కామాంధుల్ని కబోధుల్ని
కత్తికో కండగా సంహరించు తల్లీ !
దుర్జనులను దునుమాడే
దుర్గవై స్త్రీ కంటకులను
అణచివేసే విజయదుర్గవై
కదలి రావమ్మా ఉగ్రనేత్రీ.. !!

– భీమవరపు పురుషోత్తం
9949800253

మానవ మృగాలను మట్టు బెట్టాలి

నిన్నటి దాకా చిట్టిచేతులతో
చిలిపిచేష్టలతో ఇంటినంతా
సరదాల సందళ్ళ తో నింపేసి
నవ్వు ల వరదను పారించాడు
అమ్మ నాన్నల ఆనందాన్ని మత్తడి పోయించాడు

అయిన వాడే అపరిచితుడై
కాఠిన్యాన్ని కండ్లల్లో నింపుకొని
పాషాణాన్ని గుండె లో ఒంపుకొని
మూర్ఖత్వాన్ని మదిలో దాచుకుని
మాటల మకరందపు వలను విసిరి
నవ్వుల నెలవంక తో నాటకమాడి
మరణ శాసనాన్ని లిఖించాడు
తరగని గర్భశోకాన్ని మిగిల్చాడు

మూర్ఖుడా? కర్కోటకుడా? కాలనాగుడా?
నీకు మనసు లేదా? మానవత్వం లేదా?
కన్నతల్లి కడుపుకోత నీకు తెలియదా?
ఆప్యాయతల అనురాగాల మాధుర్యం
నీకు అర్థం కాదా? విలువల ప్రబోధం
నీకు జరగలేదా ? మనిషి రూపంలో
ఉన్న మృగానివా?

చట్టాలను సాన బట్టాలి
మానవ మృగాలను మట్టు బెట్టాలి
కుట్రజేసిన కండ్లను కుళ్ళపొడవాలి
చిదిమేసిన చేతులను తీసెయ్యాలి
ఉపాయంతో ఉచ్చులు పేని ఉరితీయాలి
పునరావృతం కాకుండా గురి పెట్టాలి
(మహబూబాబాద్‌లో 9 సంవత్సరాల బాలుడు దీక్షిత్ రెడ్డికి నివాళితో)

–తాటిపాముల రమేష్
7981566031

నీడ - తోడు

తల్లిదండ్రులోలె
తలపుల్లో మెదులుతూ
తాను ఎదుగుతూనే
తన వెన్నంటే నీడై
అనుక్షణం అనుసరించే
ఆత్మీయులు గురువులు....

జ్ఞానదీప్తిని వెలిగించగ
అజ్ఞానం ఆవిరి చేసి
ఆజన్మాంతం అండగా
తిమిరాల్ని తొలగించే తోడుగా
తనంత ఎదిగిన శిష్యునిలో
తాదాత్మికరణం చెందే
తన్మయులు గురువులు...

ఎక్కడైనా.! ఎప్పుడైనా.. !
ఎండల్లో వెన్నెలలా..
వానల్లో గొడుగులా..
సంద్రంలో నావలా...
ఆకాంక్షల అలజడులలో
ఆశయాల సాధనలో
ఆయుధమై ఆసరౌతు

నీ చుట్టూ గూడుకట్టి
గూటిలోని గువ్వలోలె
ఎదిగి మీరు ఎగిరిపోవ
ఎదలోపల ఉప్పొంగే
ఆ సంద్రమే.... గురువు

తన రక్తం పంచకున్న.
తన ఎదపై ఆడకున్న
తన తోడుగ ఉండకున్నా
తన శిష్యుని ఎదుగుదలను
తనువెల్ల పులుముకుని
ఆకాశాన్ని అందుకునే
ఆ శిఖరమే కదా !
.... గురువు

–వి. పద్మ
9951445867

సుప్రభాత శోభ

అలసి సొలసి వాలిన మేనుకు
బాలభానుని తొలికిరణాలు
నులివెచ్చగా పలికేను
భూపాల రాగం...
కొలనులోని తామరలు
తొలి రవికిరణం సోకి
పరవశంతో వయ్యారంగా
తలలూపి పాడేను
తోడిరాగం....
పొలానికెళ్తూన్న కోడెద్దుల
మెడలో చిరు గంటలు
పాడేను హాయిరాగం...
ఉషోదయపు వెలుగుకి
శుకపికములు కువకువలాడుతూ
పాడేను హంసధ్వని రాగం...
అతివలు వాకిట్లో కళ్ళాపి జల్లి
తీర్చిదిద్దిన రంగవల్లులు
పాడేను స్వాగతం గీతం....
గుడిలోని జేగంటలు
జగతికి పలికేను
మేలుకొలుపు గీతం..
ప్రకృతి కాంత ఒడిలో
మంచుముత్యాలు
పాడేను మోహనరాగం...
సర్వ విధాలా మదికి
హాయిగొలిపే సుప్రభాత శోభ
వర్ణనాతీతం...
సుప్రభాత శోభ సర్వరాగ
సమ్మేళనం !!

–లక్ష్మీ పద్మజ దుగ్గరాజు
9866328747

విద్యుత్ సోదరా- సుఖముగా బ్రతుకుమా

ప్రాణాల్ని పణముగా పెట్టి
ప్రమాదాలంచున ఊయలూగి,
ప్రతి క్షణము జాగురూకతతో
వేయికళ్లతో విద్యుత్ విధులు చేస్తున్న
విద్యుత్ సోదరులారా – చిరకాలం మీరుండాలి.

ఎటువైపు నుంచి ప్రమాదమొస్తుందో
మీ దీపం వీచే గాలికి ఎప్పుడు ఆగిపోవునో
వ్రేలాడుతున్న విద్యుత్ స్థంభాలను
సరఫరానాపి అలవాటుగా చేస్తున్న పనిలో
చెప్పలేని పొరపాటు జరిగి
మీ ఆయువు అల్పాయుషై,
రెక్కలు తెగిన పక్షిలా నల్లగా మాడి మీరు
అమరులైన మీ సేవలు నిత్యస్మరణీయం.

నిజమైన విద్యుత్ ఉద్యోగి
నీతోడు నీ నీడే,
ఎవరు వచ్చినా,రాకున్నా నీ విధి
నిర్వహణలో నీవే ఓ అధినేతవు
నీ కర్తవ్యదీక్షలో నీవో అభిమన్యుడవు.

విద్యుత్తుకు అంతరాయము కలిగే వేళ
ప్రకృతి బీభత్సాలు ప్రకోపించేవేళ
నీ అవసరము అత్యవసరము
నీ సేవలు అసమానము
నేటి నాగరిక ప్రపంచములో
ఆకలినైనా భరించగలమేమో
అరక్షణమైనా చీకటిని భరించలేము.

ప్రతి పనిలో మీరుండాలి
ప్రతి పనికి మీరే ముందుండాలి
మీరు లేని రోజు–మీరు రాని రోజు
చందురుడు రాని అమవాసరోజే
సూరీడున్న చమటలు పట్టేరోజు.

ఎంత శ్రమపడ్డ మీ జీవితాలు తక్కువే
మీ ఆదాయాలు అరకొర ఆదాయాలే
ప్రమాదాల పనిలో–ప్రతి దినం గడుపుతున్న
విద్యుత్ చిరుద్యోగులారా
చిరకాలము వెల్గండి
సుఖముగా ఉండండి
(విద్యుత్ లైన్ మేన్లు,
చిన్న ఉద్యోగులునుద్దేశించి)

– విశ్వనాథ నరసింహం
9490971589

పర్యావరణం - రక్షణ కవచం

పవిత్రమైన ప్రకృతి, పరమాత్ముని ఆకృతి
పంచభూతాల సంపత్తి , ప్రపంచ పురోగతి
పచ్చని చెట్లే ప్రకృతికి సింగారం సింగారానికి కురిసే వర్షం
మందారంమందారం ముద్దాడిన పుడమి బంగారం
బంగారాన్ని దాచిన కడలి భాండాగారం

సింగారాన్ని చిదిమేసి, మందారాన్ని నలిపేసి
బంగారాన్ని దోచేసి, భాండాగారం కొల్లగొట్టి
ప్రకృతి కాంతని ధ్వంసం చేస్తే
ఆడేను పంచభూతాలు ప్రళయ తాండవం
కలిగించేను భువిపై విలయ విధ్వంసం

వన్య సంపదె వనలక్ష్మికి ఆభరణం
వన్యమృగాల జీవనానికి ఆధారం
పక్షుల రవములే ప్రకృతి సంగీతం
జలధారలే జనజీవన జీవనాధారం

మనిషే మృగమై మృగాలను భక్షించి
వన సంపదను భూస్థాపితం చేసి
వికిరణాలతో పక్షులను విగతజీవులు చేసి
స్వార్థంతో జలధారలను కాలుష్యం చేసి
ప్రకృతిని పట్టి పీడిస్తే
ఆడేను పంచభూతాలు ప్రళయ తాండవం
కలిగించేను భువిపై విలయ విధ్వంసం

పంచభూతాలే కదా మన పర్యావరణం
పర్యావరణమే ప్రపంచ ప్రగతికి సోపానం
పర్యావరణ రక్షణే మనిషి కర్తవ్యం
పరిశుద్ధ పర్యావరణమే రక్షణ కవచం
ఓ మనిషి
పంచభూతాలు విలయ తాండవం చేస్తే
నీ సమాధికి పునాది అని తెలుసుకో
నీ జీవనశైలిని ఇకనైనా మార్చుకో.

– కందాళం రజనీకృష్ణ
సెల్:9487708043

సమస్తం

ప్రకృతిలో ఓ తునకగా
సమస్తాన్నీ హత్తుకుందామనుంటుంది!
ఓడలు దాటి ...
మేడలు దాటి...
గోడలుదాటి...
సమస్తాన్నీ తడమాలనుంటుంది!.
కానీ సమస్తానికీ
నేను నేనే కాదు
ఓ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్
ప్రతిక్షింపబడ్డ ఏదో రోబోని!
నన్నైనా వాడుకోవాలో
సమస్తం నిర్ణయిస్తుంది నేను తప్ప!
అంతేనా! నేనో ప్లాస్టిక్ ఆధారభరిత కార్డును కూడా
కాకుంటే మెమొరీ చిప్నో నిషేధించబడని ఆప్నో!
క్లౌడ్ కంప్యూటింగ్నో, బిగ్ డాటాలో బుల్లి బైట్నో!
ఎప్పుడైనా నేనూ మనిషినేనని గుర్తొచ్చి
సమస్తాన్నీ కౌగలిద్దామనుకుంటానా
వేరేదో అభిమతంగా పక్కనపెట్ట బడతాను
ఏదో ప్రాంతంగా పాతాళానికి తొక్కబడతాను
లేదా ఓ వెర్రి సం'కులం'గా స్థిరపడతాను
ఇప్పుడు కొత్తగా మాట పెగలనీయని మాస్క్ గానో
కరచాలనానికి నోచని అసింప్టమాటిక్ వైరస్సుగానో
సూక్ష్మీకరించబడతాను
ఇక నేనెప్పటికీ
సమిష్టినీ కాను ....
సమస్తాన్నంతకంటే కాను !

– వర్చస్వి
99483 56626

నానీలు

వెన్నెలమ్మ నవ్వు
మబ్బు కమ్మేసింది
ముదిత ముఖానికి
మాస్క్ కప్పినట్టు

ముత్యాల సరాలు
బిగుసుకుంటున్నాయి
మాటలకు మాస్కులు
అడ్డుగా వచ్చి

తడవ తడవకూ
తడుస్తున్నాయి
రసాయనాల జల్లుకు
కరములు..

తెలియలేదు
కష్టాలలో.....
కలిసుండమని
కరోనా చెప్పేదాకా...

–కళావతి కందగట్ల
9948263004

హైకూలు

అడ్డ దారులేవీ
లేని ఆలయం.
అమృత హృదయం.!

దానికెందుకటా..
సితార సంగీతం..
అది శునకం.!

నిదురెరుగని
దీపముతో నిత్యస్నేహమే..
ధ్యానం.!

సంగీతం..
శాస్త్రమేం కాదు.
ప్రేమించిన కనులు భాష.!

వెల కట్టగ లేని..
తూచగ లేని..
బంగారం–శ్వాస.!

పండ్లివ్వలేకున్నా సరే..
నీడనిచ్చే..
మనసుందనీ..!

ఆనందం దొరకదు.
అదో 'గని' ..
చిరునవ్వులోనే.!

కాపాడుకోవా..
పండ్లతోట.
చెరగని చిరునవ్వు.!

నిప్పుపూల చెట్టు.
నిద్ర ఎరుగదు.
కాపలాదారు.!

ప్రేమ–సముద్రమే.!
ఆకాశమెంత.!?
అదీ..అమ్మ గుండె.!

–మాధవరావు కోరుప్రోలు
9866995085

వైకుంఠపాళి

వర్ష భీభత్సాన్ని, ఎండ ఉత్పాతాన్ని
భీరువులా కాక వీరుడిలా ఎదుర్కొనే చెట్టంటే
నాకు మహా ముచ్చట..
అణగారిన వర్గాల నిరాశను
నల్లరంగు పరదాతో ఉరుముల మెరుపులతో నిరసన తెలిపే
ఆకాశం మహావిషాదంలా తోస్తుంది.
విస్తరించిన నగరాలు
నేరాలకు అడ్డాలు
కబళించే కాసారాలు
హరించుకుపోతూ జీవన సర్వస్వం.
రాలిపోయే స్వప్నాలే కావొచ్చు
రాలేచినుకులు
మరో స్వప్నాన్ని మొలకెత్తిస్తుంటాయి.
ఆలకించే అంతర్యామి ఎక్కడుంటాడో
జీవిత వైకుంఠపాళిలో
నిచ్చెనలన్నీ ఒకవర్గానికే ఎందుకో .
నిరసన తెలిపి ఆకాశం తెరిపిన పడుతుంది
నిరసన తెలిపిన మనిషి అస్తిత్వాన్ని
మాత్రం ఖైదుచేస్తారని మర్చిపోతాం

–సి.యస్.రాంబాబు
8374818961

జర ఉషార్ !

గమ్యం లేని
అడుగేయకు,
వేసిన అడుగు
గమ్యం దాక ఆపకు.

నీటిలో రాయి
వేయడం సులువే
వేసిన రాయి
పైకి తీయడం కష్టం.

గొంతెమ్మ కోరికలు
గమ్యం చెర్చవు.

అమలు జాప్యం
ముప్పుకు ఆహ్వానం

ప్రపంచమంతా
పంచరంగుల
మనుష్యులు.

మునుగుతారు
ముంచుతారు
జర ఉషార్.

– యెల్ది సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067

ప్రళయ మేఘం

బడుగు జీవి బ్రతుకంతా
నడి సంద్రంలో నావ అడుగడుగున దాగి ఉన్న
సుడిగుండాల తోవ.
ముమ్వై పలకరిస్తూ
పువ్వై చిలకరిస్తూ
మురిపాలు పంచిన వాన చినుకిపుడు
ముంచెత్తింది ప్రళయ మేఘమై.
రెండింతల రెక్కల కష్టం చేసినా
నిండని డొక్కలలో
నింగి కురిపించిన పిడిగుద్దుల వర్షం.
సామాన్యుని జీవిత నౌకను
చిద్రం చేసే రౌద్ర నాదమై
శ్రమ జీవన ద్వారాన్ని
ముక్కలు చేసే గగన ప్రేతం.
కష్ట జీవుల జీవన గీతం
గాలి వానలో నిలిచిన దీపం
ఇల్లూ,వాకిలి నీట మునగగా
ఏ దెసకో ఇక అభాగ్య యానం...

–వెల్ముల జయపాల్ రెడ్డి
9441168976

నేటినిజం చందా వివరాలు
ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ. **700/–**, **10** సం॥రాలకు రూ **1200/–** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660 Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.
'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి–74,
జవహర్‌నగర్, హైదరాబాద్–500 020.

బడుగు మనుషులకి పట్టంగట్టిన "మనిషాక పద్యం"

మెట్టా నాగేశ్వరరావు 2020 సం॥రానికి గాను రొట్టమాకు రేవు కవిత్వం అవార్డు పొందిన సందర్భంగా

కవిత్వమంటే కేవలం అనుభవాలు మాత్రమే కాదు. చదువరికి అనుభవాన్ని కలిగించే రచనే కవిత్వం అవుతుంది. తానూహించిన లేదా అనుభవించిన ఆనందాన్ని చదువరులకు కూడా కలిగించే ఉద్దేశ్యంతో కవి రచన చేస్తాడు. ఒక అనుభవానికి సంబంధించిన స్మృతిని ఉపయోగించుకుని ఆ అనుభవాన్ని పఠితలో రేపడం చక్కని నేర్పు.

"రోజూ కనబడే నక్షత్రాల్లోనే, రోజూ కనబడని కొత్తదనం చూచి,రోజూ పొందని ఆనందానుభూతిని పొందడం అంటేనే, కవిత్వం అంటారు.''వునర్నవం''లో దాశరథి.ప్రతిరోజూ మనం చూసే వస్తు సముదాయం లోని గుర్తించని అనుభవాల కొత్తదనం,మనం గుర్తించిన అనుభవాలకంటే సులువుగా తగులుతుంది.ఇది కవిలోని దృష్టికోణాన్ని బట్టి, ఊహాశాలిత్వాన్ని బట్టి అభివ్యక్తి చేయబడుతుంది. విశ్వసౌందర్యం నుంచి మానవ అనుభవం నుంచి వస్తువును ఎంపిక చేసుకోవడం ఆధునిక కవిత్వాశయం. వర్ణనా సౌందర్యం కంటే వస్తుసౌందర్యాన్ని దృశ్యీకరించడం ఆధునిక కవి కోరిక.

ఈ పై అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, కవిలోని ప్రతిభనంతా మూర్తీభవింపజేసిన కావ్యం మెట్టానాగేశ్వర రావు రచించిన "మనిషాక పద్యం". సామాన్య మానవుని జీవితాన్ని ఇతివృత్తంగా గ్రహించి,స్వీయానుభవాలను వేళవించి పాఠకుల్ని అనుభూతుల జడివానలో తడిపేసి,మనిషినే పద్యంగా మలిచిన విలక్షణ కావ్యమిది. కనుక ఈ సంపుటికి "మనిషాక పద్యం" అనే పేరు ఔచితీవంతంగా ఉంది. ఈ కావ్యంలోని ప్రతికవిత కవి ఆత్మను ప్రతిఫలింప జేసేదిగా ఉంది. దీనిలో కొన్ని కవితలు స్వానుభవ జనితాలైన వస్తువర్ణనలైతే,మరికొన్ని కవి కల్పనా జగత్తులోని విశేషాంశాలతో ప్రకాశించినవి ఉన్నాయి.

"కావ్యములో కవి యొక్క ఆత్మ ప్రతిఫలించెడి విధములు రెండు కలవు.ఒకటి అతడు పాత్రలను అడ్డు పెట్టుకుని తాను చేసెడి స్వానుభవ వర్ణన.రెండవది అనుభవము లేకపోయిననూ అతనికి భావనామాత్ర తృప్తినిచ్చిన వాంఛాపరంపరా వర్ణన.పరిస్థితులను బట్టి అతని జీవితములో తీరక మిగిలిపోయిన కోరికలు, నెరవేరని ఉద్దేశములు,అందని ఆదర్శములు,వర్ధములైన ఆశయములు మొదలైన అతని భావ జగత్తంతయు అనుకొనకుండగనే గ్రంథరచన వేళ కావ్యములో ప్రవేశించి స్థిరరూపమును పొందుననే" కవిత్వోత్పత్తి గురించి వివరించారు ప్రముఖ సాహిత్య విమర్శకులు పింగళి లక్ష్మీకాంతం.

కవిత్వం దివ్యావేశం వల్ల పుడుతుందనీ,దాని ప్రయోజనం హృదయాహ్లాదాన్ని,కలిగించడమని లాక్షణికులు అభిప్రాయపడ్డారు. ఈ కావ్య రచయిత మాత్రం కవిత్వం పుట్టేది ఎక్కడో తనదైన శైలిలో ఇలా వ్యక్తపరిచాడు. "మనిషాక పద్యం" కవితలో...

"గాలిలోంచో/గగనసీమల్లోంచో/పద్యాలు పుడతాయను కోవడం మనభ్రమే/మట్టికుదురు లేకపోతే/ పద్యాలు నాల్కలకెక్కడం పట్టిమాటే".

కవలం ఊహాజగత్తు నుండీ,శూన్యంనుండో కవిత్వం పుట్టదనీ,అది ఈ మట్టితో అవినాభావ సంబంధమున్న మనిషిజీవితం నుండి పుడుతుందంటాడు.ఇక్కడ పద్యాన్ని కవిత్వంగా, మట్టిని మనిషికి సంకేతంగా భావించినట్టు బోధపడుతున్నది.కవిత్వం మనిషి జీవితం నుంచి పుడుతుందని చెప్పడం ఒక విషయమైతే, "పద్యాలు నాల్కలకెక్కడం" అనే మాట కవితానిర్మాణానికి చెందిందనేది రెండవవిషయం.జీవన వాస్తవికతతో కూడిన వాక్యానికి లయాత్మకత తోడైతే,అది ప్రజల నాలుకల మీద నాట్యం చేస్తుంది.అయితే ప్రథమ ప్రాధాన్యత మాత్రం ,జీవన వాస్తవికతను ప్రతిబింబించే భావపూర్ణమైన ప్రతిభదేనన్న విషయాన్ని స్పష్టంజేశాడు కవి.

చెమటపండే తావులనుండీ,కూలీతల్లుల పాదాలనుండీ,కాయలు కాసిన చేతులనుండీ, చిత్తుకాగితాలు ఏరుకునే ముసలివాడి మురికిబట్టల మూటనుండీ, మనిషి గుండెగాయాల సలుపునుండీ నిజమైన కవిత్వం పుడుతుందనీ, పఠిత మనోవీథిలో ఒకదానివెంట మరొకటి గాలిపటాల్లా ఎగరేస్తూ అనుభూతికి తేవడం,కవి నిశ్చితాభిప్రాయాన్ని తేటపరుస్తున్నది.పైన ప్రకటించిన అన్ని భావచిత్రాల పరమార్థం ఒక్కటే. ఇన్నిన్ని పంక్తుల భావం ఒక్కటే అయినపుడు,ఇన్ని భావచిత్రాల అవసరం ఏముందీ!? అనేది ప్రశ్న.అయితే దీనికి సమాధానం పీడిత ప్రజల జీవితాలను ప్రతిబింబించేదే అనలు సినలైన కవిత్వమవుతుందనీ బలంగా చెప్పడానికేననీ తేలుతుంది. అందుకే ఇదే ఖండికలో "పద్యాలు పీడిత జనం కోసమే పుడతాయి" అంటూ ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించడం కనబడుతుంది.

"మమతల పందిరి వేసే/ప్రతి మనిషీ ఓ పద్యమే/ బడుగుల పక్షాన నిలబడి/వేకువకోసం తపించే ప్రతి మనిషీ పద్యమే"!

ఈ పంక్తుల ద్వారా ఎదుటమనిషి బాధావేదనలకు స్పందించే హృదయం నుండే కవిత్వం పుడుతుందనీ, బడుగుజీవుల పక్షాన నిలబడి వారి జీవితాలలోని అంధకారాన్ని తొలగించడానికి పాటుపడే ప్రతివ్యక్తీ ఒక పద్యమే అవుతాడనీ ఉద్ఘాటిస్తున్నాడు.

వాస్తవిక జీవనంలో దుఃఖభాజనమైన సంఘటనలే అనుకరణాత్మకమైన రూపకల్పన వల్ల మనకు సంతోషాన్ని కలిగిస్తాయి.అలాగే తనకు తెలిసిన వస్తువును అనుకరణతో చూడటంలో కలిగిన తృప్తి,తెలియని దాని ప్రతిరూపాన్ని (బొమ్మను) చూసినప్పుడు కలుగదు. వీటితోపాటూ శ్రవణ సుఖాన్నిచ్చే లయకు,భావసార, రూపాది విషయాల మేళవింపుకూ కూడా మనిషి ప్రతిస్పందిస్తాడు.ఇలా కవి ప్రతి సందర్భాన్నీ,సన్నివేశాన్ని హృదయగతం చేసుకునీ,తనదైన శైలిలో వ్యక్తీకరించడం వల్ల రూపుదాల్చిన కవితలే ఈ సంపుటినిండా పరచుకునివున్నాయి.

కవి మెట్టానాగేశ్వరరావు ఎంపికజేసుకున్న వస్తువులు అతని ప్రతిభనూ,ప్రత్యేకతనూ తెలియ జేస్తున్నాయి.

ఇతనికి ఒక విషయాన్ని ప్రతీకాత్మకంగా చెప్పడం కన్నా, గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకునీ,అనుభూతిని,అనుభవాన్ని కవిత్వం చేయడం పైనే దృష్టి ఎక్కువ.కవితను పాఠకునికి కథ చెబుతున్నట్లు నడిపించడం,మధురస్మృతులను, మరుపురాని సన్నివేశాలను తనివితీరా నెమరేసుకోవడం, తత్సంబంధమైన అనుభూతిని పాఠకునిలో కలిగించడం వంటివి ఈ కవిలోని ప్రత్యేక లక్షణాలు.అందుకే నూటికి తొంభైపాళ్లు ఈ సంపుటిలో గతస్మృతులకు సంబంధం లేకుండా ఏ ఒక్క కవితా కనిపించదంటే అతిశయోక్తిగాదు.

వస్తురీత్యా ఈ సంపుటిని ఆరువిధాలుగా వర్గీకరించవచ్చు. అవి ముఖ్యంగా...

1.శ్రమజీవనం?శ్రామికకులాలు
2.రైతుజీవనం
3.పల్లెటూరు?పరిసరాలు
4.పర్యావరణ సంబంధమైన కవితలు
5.బాల్యం?బాంధవ్యాలు
6.స్మృతి
6.ఇతరములు.

శ్రామికజీవితాన్ని ఇతివృత్తంగా తీసుకున్న కవితలను ముఖ్యంగా మూడు రకాలుగా విభజించ వచ్చు.అవి. వృత్తిసంబంధమైనవి, వస్తుసంబంధమైనవి, వృక్ష,జంతు సంబంధమైనవి.

-వృత్తి సంబంధమైన కవితలు-

భారతదేశంలో కులవ్యవస్థ కొన్ని వేల సంవత్సరాల నుండి వేళ్లూనుకుని వుంది.సమాజం చాతుర్వర్ణవ్యవస్థగా విభజించబడింది.బ్రాహ్మణ,క్షత్రియ,వైశ్య,శూద్ర వర్ణాల్లో మొదటి మూడువర్ణాలూ శూద్రులను నీచాతినీచంగా చూశారు.బ్రాహ్మణులు మతాధికారులుగా, పూజారులుగా వ్యవహరిస్తే,క్షత్రియులు పాలకులుగా, శాసనకర్తలుగా అధికారాన్ని చెలాయించారు.వైశ్యులు వ్యాపారంలో స్థిరపడి, శూద్రులను ఆస్తిపాస్తులకు దూరంజేసి వివక్షతను ప్రదర్శించారు.శ్రమజీవనానికే వీరిని పరిమితం చేశారు. ఈ రకమైన అసమానతల్ని ఎదిరించడానికి,కాలక్రమేణా అనేక ఉద్యమాలు ప్రారంభమయ్యాయి.కులసంఘాలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఆధిపత్యకులాల దుశ్చర్యల్ని ఎండగట్టడం, వివక్షతల్ని ఖండించడం,సమానత్వాన్ని సాధించడం వంటి అంశాలే ధ్యేయంగా తిరుగుబాటు ప్రారంభమైనది. వెనుకబడిన కులాలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని తీర్మానించుకున్నాయి.ఈ క్రమంలో 1950 నుండి బిసిసాహిత్యం కవిత్వం, పాటలు,కథలు,నవలలు,విమర్శ మొదలైన రూపాల్లో ముందుకు వచ్చింది.

ఈ సంపుటిలో కులవృత్తులకు సంబంధించిన కవితలను బిసివాదకవిత్వంగానే చూడాల్సివుంది. ఇందులో ప్రస్తావితమైన కవితలుగా పల్లెమంగలి, చాకలవ్వ, చెమటసంతకం,గొర్రెనక బతుకు, గాజులరాజు,సారె మీద ప్రాణం,మట్టిగంధం,సర్కస్ పిల్ల,పేపరుబచ్చా మొదలైన వాటిని పేర్కొనవచ్చు.

"అతడు లేకుంటే/మగలోకం తలలన్నీ అరణ్యాల్ని తలపించేవి/గడ్డాలతావు తుప్పల్ని పోలివుండేది/అతడుండ బట్టే/మగోళ్లు మన్మథకలల్ని పొందుతు న్నారు".

'పల్లెమంగలి' అనే కవితలో పై పంక్తులు మంగలికులాన్ని ప్రస్తావిస్తూ చెప్పినవి.అడవంత దట్టంగా పెరిగిన జుట్టును, తుప్పల్లా ఎదిగిన గడ్డాలను కత్తిరించి,గీసి మగోళ్లందరినీ మంగలన్న మన్మథాకా రులుగా తీర్చిదిద్దుతాడనీ మంగలి పనితనాన్ని ఉపమానయుక్తంగా పై చరణాల్లో తెలుపుతున్నాడు కవి మెట్టా!

"కుర్చీలో కూర్చున్న కాపుగారికి/కాళ్లు లాగినా నిలబడే కటింగు వేస్తాడు/వేళ్లు నొప్పులొచ్చినా తలమాలీషు పూర్తిచేస్తాడు/ కాపుమనసు రంజిల్ల చేయడానికి/మధ్యమధ్యలో లోకాభిరామాయణం".

పై వాక్యాలలో మంగలన్న శారీరకశ్రమ,సాంఘిక అసమానతలు వ్యక్తం చేయబడ్డాయి.ఆధిపత్యకులాల వారికి క్షవరం చేయాల్సి వచ్చినపుడు,ఏ విధంగా వివక్షతను ఎదుర్కోవలసి వస్తుందో తెలియజేయడం, ఇంకా చంకల కంపులను భరిస్తూ రోజంతా కష్టపడినా కూలిగిట్టక,కూటికి కరువు రావడం,శుభాశుభాలకు ముందుండి పనిజేసినా పొందవలసిన గౌరవం దక్కకపోవడం వంటి అమానవీయ విషయాలు జీవనవాస్తవికతగా వ్యక్తం చేయబడ్డాయి. పట్టణాలలో హంగులమయమైన సెలూన్లకు ఆకర్షితులై పల్లెల్లో కటింగులు చేయించుకోవడం తగ్గిపోయిందనీ, తత్ఫలితంగా సిటీసెలూన్లలో కూలీగా మారి పల్లెమం గలి దైన్యాన్ని కలిగివున్నాడనీ కవి దృశ్యమానం చేశాడు.

-వృత్తి పరమైన వస్తువులకు సంబంధించిన కవితలు-

-శ్రామిక కులాలలో వృత్తులకు సంబంధించిన సాధనాలను కవితావస్తువులుగా ఎంపిక చేసుకున్న కవితలన్నీ ఈ కోవలోకి వస్తాయి.అటువంటి వాటిలో ప్రస్తావించదగిన కవితలుగా "ఇస్త్రీపెట్టె", నిప్పుపూలు,దప్పుతాత,తూముగొడ్డలి, పేడముచ్చట, కట్టుగొయ్యలు మొదలైనవి అందుకుదాహరణ.

"ఎర్రెర్రనివి/ఎనిమిదేసి కళ్లేసుకుని/పక్కమీదకి/ బుజ్జికుక్కలా దూకుతుంది మా ఇస్త్రీపెట్టె/ముడతబట్టని చలువజేసే/దానిని చూస్తే/సంఘసంస్కర్తలు కళ్లలో మెదులుతారు".

పై వాక్యాలు "ఇస్త్రీపెట్టె" కవి జీవితానికి ఎంత భరోసానిచ్చిందో తెలుతున్నవి.ఆత్మాశ్రయరీతిలో అనుభూతి ప్రధానంగా కవితను నడిపి,కవి జీవితం అర్థం జేసుకునేందుకు వీలు కల్పించాడు.ఏ కవితను రాసినా వస్తువు రూపాన్నో, ఉనికినో ఎత్తుగడలో ధ్వనింపజేయడం ఈ కవికి ఇష్టమైన పద్ధతి.

"ఇస్త్రీపెట్టె"కు ఇరువైపులా ఎనిమిది కన్ను ఆకృతిని పోలిన కానాలుంటాయి.అవి గాలి చొరబడ్డానికి ఉద్దేశించినవి. బయటగాలి ఈ కానాలగుండా లోపలికి వెళ్లి బొగ్గులు మండటానికి సహాయపడతాయి.అలా ఇస్త్రీపెట్టె లోపల మండుతున్న బొగ్గులు ఎనిమిది కానాలగుండా ఎర్రగా కనిపిస్తుంటాయి.ఈ దృగ్విషయాన్నే కవి 'ఎర్రెర్రనివి ఎనిమిదేసి కళ్లుగా కవి వర్ణించాడు.అది అతడి నిశితదృష్టికి మచ్చుతునక. ముడుతలు పడ్డ బట్టల్ని సాపుజేసే ఇస్త్రీపెట్టెను చూస్తే కవికి సంఘసంస్కర్తలు గుర్తుకు రావడంలో కొంత అత్యుక్తి వున్నా,అది వాస్తవికతను ఆశ్రయించేవుందనీ, గ్రహించాలి.సంస్కర్తలు సంఘంలోని మూఢాచారాలనే ముడతల్ని తొలగిస్తారు.ఇక ఇస్త్రీపెట్టె బట్ట నాణ్యతను కోల్పోకుండా ముడతల్ని తొలగిస్తుంది. ఇలా తొలగించే పని సంస్కర్తకు,ఇస్త్రీపెట్టెకు రెండిటికీ ఒక్కటే.అయితే సంస్కరణంలో భాగంగా సంస్కర్తలు సంప్రదాయ వాదుల వ్యతిరేకత అనే నిప్పులకాకను ఎదుర్కోవలసి వస్తుంది. ఇస్త్రీపెట్టె తనలో మండే బొగ్గుల వేడిని భరించవలసి వుంటుంది.ఇలా అనేక సామ్యతలున్నందున ఔచిత్యం వున్నతంగా ప్రకాశించిందని చెప్పవచ్చు.

"బట్టల్లోంచి/నాలుగు మెతుకులు రాలుతాయని/నాన్న అన్నప్పుడు అర్థం కాలేదు/నాలుగు శాల్తీలను ఇస్త్రీ చేసినప్పుడు/చేతిలో మోగిన పైసలగంటల్ని విన్నాక/కొంచెం కొంచెంగా బతుకు అర్థవంతమైంది".

నాలుగు మెతుకులు రాలాలంటే నాలుగు శాల్తీలను ఇస్త్రీ చేయాలని నాన్న చెప్పడం,చేతిలో మోగిన పైసలగంటల శబ్దాన్ని విన్నాక,బతుకు బోధపడటం కవి జీవితానుభవాన్ని తెలియజేస్తున్నది.'నాన్న అన్నప్పుడు' అనే వాక్యం దీనిని రూఢి పరుస్తున్నది.పైసలగంటలు అనే పదప్రయోగం చిల్లర పైసల చప్పుడును ధ్వనింపజేస్తున్న, ఔచీతీవంతమైన ఉత్తమ ప్రయోగం.ఇక 'బట్టల్లోంచి నాలుగు మెతుకులు రాలడం' అనే వాక్యంలో అక్షరమక్షరంలో కవిత్వాన్ని ఆస్వాదించవచ్చు.

కావ్యరచనలో ఏదో ఒకచోట కవి జీవితం స్పర్శా మాత్రంగా నైనా తప్పక దొరుకుతుంది. ఆత్మాశ్రయమైన రచనల్లో ఈ అవకాశం మరింత ఎక్కువగా వుంటుంది.సాహిత్య వివేచనకు కవి జీవితరహస్యాలను అతని రచనల్లో వెతకడం సమంజసం కానప్పటికీ,కవి జీవితాన్ని తెలుసుకుంటే కావ్యంలో పేర్కొనబడిన కొన్ని అంశాలను అర్థం చేసుకోడానికీ వీలు కలగవచ్చు. అతడొకానొక సాహిత్య సంప్రదాయంలో ఎలా పెరిగాడో, అతనిని ప్రభావితం చేసిన అంశాలేవో తెలుసుకునే అవకాశం ఉండవచ్చు.

"ఒకానొక కావ్యాన్ని రాసే కవి ఒక జాతికి చెంది వుండటం వల్ల ఆ జాతి లక్షణాలు అతనిలో ప్రతిబింబిస్తాయి.ఆ జాతి దేశానికి సంబంధించిన సాంస్కృతిక, నాగరికత, వాతావరణాల ప్రభావం అతని రచనల మీద పడుతుంది"అంటాడు టెన్ .

"చేసిన డిగ్రీలన్నీ/జీవనానికి ఖాళీగంపగా మిగిలినపుడు/ ఉద్యోగం కోసం/గాలిపటాన్లై తిరుగుతున్నప్పుడు/పిలిచి కొలువునిచ్చిన/ఈ ఇస్త్రీపెట్టె నా జీవితానికి పెద్ద వరమంటాను".

డిగ్రీ చేసినా నిరుద్యోగం తప్పనపుడు ఈ ఇస్త్రీపెట్టె జీవితాన్ని నడిపించిందని చెప్పడం పై పంక్తులభావం. అందుకే ఇస్త్రీపెట్టెను ఇలవేల్పుగా భావించి" మా ఇంట్లోనూ దేవుడున్నాడు",ఆయన ఇస్త్రీపెట్టె అవతారమెత్తాడనీ,రోజూ నిద్ర లేవగానే దైవదర్శనంలా ఇస్త్రీపెట్టెనే దర్శించుకుంటానని చెప్పడంలో వస్తువుపైన గల కవి ఉదాత్తభావనను, స్వీయ జీవితానుభవంలోని కృతజ్ఞతా లక్షణాన్ని, నిజాయితీని వ్యక్తపరచడం కనిపిస్తుంది.

-వృక్ష,జంతుజాలాలకు సంబంధించిన కవితలు-

- శ్రామికకులాలలో వృత్తి అనుబంధంగా వృక్షాలను, జంతువులను,వివిధరకాల పక్షులను పెంచుకోవడం సాధారణంగా జరుగుతుం టుంది.అటువంటి జీవుల పట్ల ప్రేమాభిమానాలను కలిగివుండటమూ పరిపాటి.ఇలా పెంచుకునే పెంపుడు జంతువులను కవితావస్తువులుగా స్వీకరించిన కవితలన్నీ ఈ విభాగం కోవలోకి వస్తాయి. అలాంటి కవితల్లో బోడిమేక,ఎద్దు,కుక్కేనయం,లచ్చిగేదె, మా ఎత్తయిన తాటిచెట్టు ముఖ్యమైనవి."బోడీమేక" కవితలో...

"మా గుండెగూటాలకి/కట్టుకున్న వీడిపోని బంధం మా బోడిమేక/ఎప్పుడు గుర్తొచ్చినా/ఎదసరస్సులో/ఏవో జ్ఞాపకాల చేపపిల్లలు ఈదుతుంటాయి!" అంటాడు.

గుండెగూటాలు,ఎదసరస్సు,జ్ఞాపకాలచేపపిల్లలు వంటి ఈ పదప్రయోగాలు చాలు కవి నూతన పదదృష్టికి ఎంతగా పరితపిస్తాడో తెలియడానికి.ఈ కవిత నిండా అద్భుతమైన భావముద్రలు వెతికినన్ని దొరుకుతాయ నడంలో సందేహం లేదు.ఈ కవిత ద్వారా కవి ఒక ప్రయోగవాదిగా, జ్ఞాపకాలను మరువని నిస్వార్థపరునిగా మనకు కనిపిస్తాడు.అందుకే ఈ సంపుటిలో 'బోడిమేక' కవితకు ఒక ప్రత్యేకస్థానం ఉంది.

"ఎక్కడ ఏ మేకపిల్ల కనిపించినా/చిన్ననాటి మిత్రుడు ఎదురైనట్టుంటుంది".

గ్రామీణ ప్రాంతాలలో ఇండ్లలో కోళ్లు, మేకలు,ఆవులు ఇలా రకరకాల జంతువులను పెంచుకుంటారు.అయితే వాటిని డబ్బులు సంపాదించి పెట్టే వనరుగానే కాక,తమ కుటుంబంలో సభ్యుడిగానో, సభ్యురాలిగానో, ఆత్మీయమిత్రుడిగానో ఆప్యాయంగా చూసుకుంటారు.కవి ఇంట్లో "బోడిమేక" ఒక సభ్యురాలిగా పెరిగింది.అది ఇప్పుడు లేదు.దాని తాలూకు జ్ఞాపకాలున్నాయి.అందుకే ఎదురు పడిన ఏ మేకపిల్లను చూసినా బోడిమేకే తలపుకొస్తుం దంటాడు కవి.

"చిన్నప్పుడు/ఊరిని మేల్కొలిపే కోడిపుంజు/కునుకు తీస్తుంటే/నిద్రమంచం దిగేదాకా సుప్రభాతం పాడుతూ/ తొలిపొద్దు అవుతుండేది"....ఇలా అనడంలో ఉదయం నిద్రలేచిన దగ్గరనుంచీ మళ్లీ నిద్రకు ఉపక్రమించే వరకు



బోడిమేకతో అనుబంధం కొనసాగుతుందేదనీ చెప్పడం ఉంది.

ఇంటికిటికీ కట్టుగర్రగావడం,పొలానికెళ్లేటపుడు సూర్యుని వెంట నీడలా నాన్న వెనుక నమ్మకమైన వ్యక్తిలా నడవడం, లచ్చిగేదె పాలివ్వనపుడు దాని పాలతో టీ కాసుకోవడం, కవి బాల్యంలో దాని కమ్మని పాలను సేవిస్తూ ఎదగడం మొదలైన మధురమైన జ్ఞాపకాలన్నీ నాటకంలోని అంకాలుగా ఒకటి తరువాత మరొకటి పాఠకుని హృదయంలో చెరగని ముద్రవేసి కదిలిపోతుంటాయి.కాలం కలసిరాక, పంట పండినా గిట్టుబాటు ధరలేక అప్పులే పంటలై పండిన సంవత్సరం చేయి మారుతుంది.బోడిమేక పలుపుతాడు... ఇక్కడ "పలుపుతాడు చేయిమారింది" అనడం వెనుక ఆ మేకను అమ్ముకున్నామని చెప్పలేక చెబుతున్న ఆవేదన ధ్వనించడాన్ని సూచిస్తుంది. బోడిమేక పెంట తోటకు ఎరువై పంట దిగుబడి పెరగడం, కుటుంబమంతా ఆనందంగా గడపడం ఎపుడొస్తుందో అని తీరని తియ్యని బాధను అనుభవించడం కనిపిస్తుంది.రొట్టను మేక నెమరేసినట్టు,దాని జ్ఞాపకాలను కుటుంబమంతా మననం చేసుకుంటారనడం కూడా చక్కని భావచిత్రం. మరియు ఔచిత్యం ఉన్నతీకరించబడిన పోలిక. అంతేగాదు ఈ కవిత ముగింపులో "మనుషులు మనుషుల్ని మర్చిపోయే కాలంలో/బతుకులో భాగమైనందుకు/మేకను మరువక పోవడమే గదా కవిత్వమంటే..!". అంటూ అనుబంధాలను, అప్యాయతల్ని, భూతదయను కవిత్వంలో భాగం చేస్తాడు.

ఈ కవితను చదువుతున్న చదువరికీ ప్రముఖ రచయిత కేశవరెడ్డి రాసిన "అతడు అడవిని జయించాడు" అనే నవలలోని "చుక్కపంది" గుర్తుకొస్తుంది. ఈ కవితా గమనమంతా కథనపద్ధతిలో సాగడం,జ్ఞాపకాల తెరలమధ్య నుండి కరుణ రసార్ద్రంగా అభివ్యక్తి వుండటం ఇందుకు ప్రధాన సామ్యాలుగా వూహించవచ్చు.

-రైతు జీవనానికి సంబంధించిన కవితలు-

రైతు జీవనమే ఇతివృత్తంగా సాగిన కవితలన్నింటినీ ఈ విభాగంలోకి చేరతాయి.అవి ముఖ్యంగా చినుకు సమయాలు, ఏడు నాగళ్ల ఎవుసం,చినుకుల వంతెన, కట్టుగొయ్యలు మొదలైనవి.

"ఏడు నాగళ్ల ఎవుసం" కవిత రైతు జీవన నేపథ్యంలో సాగుతుంది.ఇది ఏడు విభాగాలుగా సంఖ్యాసూచితంగ వుంది. ధ్వని, పదప్రయోగాలు ,భావచిత్రాలు,వస్తువును మానవీకరించిన సందర్భాలు చక్కని ఔచిత్యంతో ప్రకాశించాయి.

"రాత్రిపొలంలో/చీకటి నాగలితో దున్ని/పండించే పంటే స్వప్నం". రాత్రిపొలం,చీకటినాగలి వంటి పదప్రయోగాలు పఠితమనస్సును పరవశింపజేస్తాయి. రాత్రి,చీకటి,స్వప్నం అనే పదాలను పొలం,నాగలి, దున్నడం,పంట అనే వ్యవసాయ సంబధమైన పదాలతో రైతుజీవితాన్ని ప్రతిబంబింప చేసాడు కవి.

"ఆ ఇంట్లో /ఒకప్పుడు రైతుండేవాడు/అక్కడున్న విరిగిన నాగలే రుజువు".భూమిని నమ్ముకున్న రైతుకు కాలం కలసిరాకనో,పాలకులు పంటకు గిట్టుబాటు ధరను కల్పించక పోవడం వల్లనో,కారణాలేమైతేనేం అప్పులు పెరిగిపోయి, వాటిని తీర్చే దారిలేక, ఆత్మహత్యలు చేసుకుంటున్న వాస్తవిక దీనదృశ్యాలు ప్రతిగ్రామంలోనూ కనిపిస్తున్నాయి. ఈ విషయాన్నే అక్కడున్న "విరిగిన నాగలి" ని ఆసవాలుగా చూపించి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

పల్లెటూరు-పరిసరాలకు సంబందించిన కవితలు

పల్లెటూరు వాతావరణాన్ని అక్కడి ప్రత్యేకమైన ప్రాంతాలు,కొండలు,చెరువులు,సంతలు తదితర అంశాలు వస్తువులుగా స్వీకరించబడిన కవితలు ఈ వర్గంలో చేరతాయి.ఇటువంటి కవితల్లో ప్రధానంగా చర్చించదగినవి పులివాగు,పడవపాడే పాట,తెరలు, కన్నాపురం సంత, పెద్దబావి,కాలువయాది,గోదారమ్మ గుర్తుగా,పరమేశుని చెరువు,కొండకు క్షమాపణ,టీకొట్టు దగ్గర మొదలైనవి.

పల్లెను,దానితో పెనవేసుకున్న అనుబంధాన్ని కవి ఎంతో మురిపెంగా గుర్తుకు చేసుకోవడం,తన సొంతవూరును, పెరిగిన పరిసరాల జ్ఞాపకాలతో తడిమితడిమి చూసుకోవడం మెట్టా కవికి కవిత్వం రాయడమంత ఇష్టం.అందుకే ఈ కవి అమ్మానాన్నలు పులివాగులో చాకిరేవు చేసిన జ్ఞాపకంగా "పులివాగు" శీర్షికతో అనుభూతి ప్రధానమైన కవితగ కూర్చాడు.

"ముత్తాతకి ముత్తాతెవరో చూశారు/ఆ వాగులోకి పులొచ్చి నీళ్లు తాగడం/అప్పటినుంచది పులివాగు/వాన చినుకులసంతకం చేయగానే/వాగుశబ్దంలో గాండ్రింపు మొదలయ్యేది/లేడి మీదకి పులి దూకినట్టు/భీముడడుగు మీదకి తొలి జలపాదమై చెంగుమనీ/ఎవరో తరుముతుంటే పరుగెత్తికొచ్చే/పెద్దసైజు జెర్రిపోతులా కళ్లలోకి ఉరకలు పెట్టేది".

ప్రతి గ్రామంలోనూ కొన్ని ప్రాంతాలకు పేర్లుంటాయి. వాటికి కొన్ని ఐతిహ్యాలుంటాయి. దేవాలయాలకు స్థలపురాణాలు ప్రచారంలో వున్నట్టే కొన్ని ప్రాంతాలకు నామచరిత్రలుంటాయి.వాటిని ఆయా పేర్లతో పిలుచుకుంటూ ప్రాంతీయతాభిమానాన్ని చాటుతుంటారు పల్లీయులు.

అటువంటిదే "పులివాగు" ఖండిక. పులి నీరుతాగడం చూసిన వారెవరో ఆ వాగుని పులివాగని పిలిచారట.వాన చినుకుల సంతకం చేయడం,వాగుశబ్దంలో గాండ్రింపు మొదలవడం, లేడి మీదకి పులి దూకినట్టు వాగు జలపాదంతో చెంగున దూకి,పెద్దసైజు జెర్రిపోతులా కళ్లలోకి ఉరకలు పెట్టడం వంటి ప్రయోగాలు కవితను సంపన్నంచేశాయి. అవన్నీ ఈ కవికి మాత్రమే ప్రత్యేకమైనవి.

ఈ కవిత ప్రతిపాదంలోనూ అలంకారం,పోలిక, చమత్కారం వంటి ఏదో ఒక విశేషాన్ని కూర్చి,పఠితలను కవితాగమనం నుండి దృష్టి మరల్చకుండా చేయగలిగాడనే చెప్పాలి.కవి జీవితంలో ముడిపడి వున్న ఏ అంశమైనా ఎంతో లోతుగా మరెంతో పటిష్టంగా కవిత్వం చేస్తాడనడానికి ఈ విభాగంలోని ప్రతి కవితనూ ఉదాహరించవచ్చు.

ఇక వాగులో పశువులకాపర్లు పులి తిరిగిందన్న భయమే లేకుండా"ధైర్యంతాయెత్తులు"కట్టుకుని ఈతలు కొట్టేవారనీ, పువ్వుమీద తుమ్మెదలదండు వాలినట్టు, చేపలకోసం గేలాలదండు వాలేదనీ, చాకలయ్యలు వృత్తిగీతాలు పాడుతూ ఆరేసిన బట్టలు వాగుకన్యకు రంగులవలువల్లా వుండేవనీ ఎన్నో రీతుల మనసు తృప్తిపడే వరకు వర్ణిస్తాడు. వాగులో తాను ఒక భాగమైనట్టు తన్మయించడం కవిలోని ఆత్మీయతను,అనురాగాన్ని తెలియజేస్తున్నది.

ఈ కవి వాక్యాన్ని కవిత్వం చేయడంలో నేర్పుని బాగా ఆకళింపుజేసుకున్నాడు.దీనికి తార్కాణంగా ఈ వాక్యాన్ని చూపవచ్చు.

"ఊరికి మూడుమైళ్ల దూరంలో వాగుంటే/ ఊరంతా అందులోకి ప్రవహించేవాళ్లు".

ప్రవహించడమనే వాగు లక్షణాన్ని ఊరికి ఆపాదించడం వల్ల, ఆ వాక్యమంతా ఒక్కసారిగా కవిత్వమై భాసించింది. ఇదే కవి నైపుణ్యం. కాలక్రమంలో అడవులు కొట్టేయడం వల్ల వాగు ఇసుకబొంతలా మిగిలిందని వాపోతూనే, మళ్లీ పులివాగు గాండ్రింపుని వినాలనుంది అనే ఆశాభావాన్ని వెలిబుచ్చాడు.

ఈ ఒక్క కవితలోనే గాక ప్రతికవితలోనూ నూతన పదప్రయోగాలు చేసి ప్రయోగదక్షతను నిరూపించుకున్నాడు కవి మెట్టా.ఈ కవితలో చినుకులసంతకం, జలపాదం, ధైర్యం తాయెత్తు,వాగుకన్య,ఇసుకబొంత వంటి వినూత్న పదాల ప్రయోగం కనిపించడమే కవిగా భవిష్యత్తులో చిక్కని కవిత్వానికి భరోసాను ఇవ్వగలడనడానికి నిదర్శనం.

-పర్యావరణ సంబంధమైన కవితలు-

చెట్లు,అడవులు,కాలుష్యం మొదలైన అంశాలను వస్తువులుగా తీసుకుని రాసిన కవితలన్నీ ఈ శాఖలోకి చేర్చవచ్చు.అటువంటి కవితల్లో "హృదయంపై చెట్లబొమ్మ", ఆకుపచ్చని పద్యంకోసం..,ఊపిరిగొడుగు,కొన్ని నీళ్లఛాయలు, అడవిపాదాలు మొదలైనవి విశ్లేషించదగ్గవి.

'హృదయంపై చెట్లబొమ్మ' కవితలో చెట్టు ఆవశ్యకతను తెలపడం ప్రధానాంశంగా వుంది.బాల్యంలో బడికి వెళ్లేటపుడు దారిపొడవునా హాయిని చేకూర్చేవనీ,నీడనిచ్చి సేదదీర్చేవనీ, అవి ఒక రాత్రి తుఫానుగాలికి నేలకొరిగిపోయాయనీ చెప్తూ, తెలవారే సరికే వ్యాపారవస్తువై లారీల్లో తరలించబడటాన్ని చూసి ఆవేదన చెందుతాడు.

"నిన్న సాయంత్రం క



పుస్తక శతకం



పూనుకొంటి వ్రాయ 'పుస్తక శతకము'
సులభశైలి, నాటవెలదులందు;
సులభశైలి పాఠకుల నలరించును,
ప్రస్తుతించ దగును పుస్తకమును!

వందనమ్ము చేసి ముందుగా పుస్తక
మునకు, కలము పట్టుకొనుట లెస్స;
కవుల బతుకు పుస్తకము తోడిదే కదా!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకముల గూర్చి 'బోలెడు' పద్యాలు
వ్రాయవచ్చు గాని,వ్రాయ నట్లు;
శతక మగుట నిచట సంఖ్యా నియమ ముండె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పాఠ్యపుస్తకము లవశ్యముల్,శతకాన
వాని గూర్చి యేమి వ్రాయ నౌను?
కాన,నితర పుస్తకాలె ప్రస్తావింతు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

తెలుగు భాషలోన తొలి పుస్తకమ్ము న
న్నయ్య భారతమ్మె అనగ నొప్పు;
ఆది కవిగ జోత లందు నన్నయగారె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కాగితాలు లేని కాలాన,తాటియా
కులను వాడి ,గ్రంథములు రచించి,
అందజేసి యుండి రానాటి కవివరుల్!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

తాటియాకు కాగితముగాను,గంటము
కలముగాను పూర్వ కవులు వాడి,
కడు శ్రమించినారు గ్రంథ రచనమందు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కష్ట తరము గాదె గంటముతో తాటి
యాకు పైన వ్రాయుటన్న? నైన
వ్రాసి పూర్వ కవులు రాశులు పోసిరి!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కవులు తాళపత్రగ్రంథ కాలమ్మున
ప్రతులు వ్రాయ కష్టపడిరి చాల!
తొలగె కాగితమ్ము,కలముతో శ్రమ కొంత!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కాగితాలు, కలము కవులకు మేల్సేసె
ననుట నిర్వివాద, మంతకన్న
హెచ్చు మేలుచేసె నచ్చు యంత్రము వచ్చి!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

మొదటి సారి అచ్చు పుస్తకమ్మును తిల
కించి యెంత సంతసించినారొ
అప్పటి మనవారు?అద్భుతమే కదా!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కవులు మానబోరు కావ్యరచన మెంత
కష్ట మైన,తమకు నష్ట మైన;
కాని యెడల 'నిన్ని'గ్రంథాలు పుట్టునా?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అచ్చు పుస్తకాలు వచ్చిన తరువాత
చదువుకొనుట సులభ సాధ్య మయ్యె;
పాఠకులకు చేరువయ్యె పుస్తకములు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

వచ్చుచుండె కొత్త పద్ధతు లచ్చులో,
పుస్తకములు చూడ ముచ్చ టగును;
స్వాగతించ వలయు శాస్త్ర విజ్ఞానము!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

శ్రవ్య కావ్య మనిరి గ్రంథము నాదిలో,
ప్రజలు చదువులేని వార లగుట;
నదియె పఠన కావ్య మయ్యె పదంపడి!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ప్రజలలోన అక్షరాస్యతతో పాటు,
కవుల సంఖ్య, పుస్తకముల సంఖ్య
పెరిగి, దినదినాభివృద్ధి కన్పడుచుండె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్ము హస్త భూషణ మ్మను మాట
కలదు ప్రజల వాడకమ్మునందు;
అక్షరాల సత్య మనవచ్చు నామాట!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్ము హస్త భూషణ మాత్రమే
యైన, ఫలము లేదు దాని వలన;
చదివి పొందవలయు సారాంశ ఫలితాలు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమును భక్తిముగ దాచుకొన్న, న
ద్దాన నెట్టి ఫలము దక్కు తనకు?
చదువదులకె జ్ఞాన సారమ్ము లభ్యమౌ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్ము చూడ ముచ్చటగా నున్న,
లోన సార మేమి లేని యెడల,
కొని పఠించు పాఠకుం డసంతృప్తుడౌ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కొన్ని పుస్తకాల నెన్ని మార్లైనను
చదువుచుండవచ్చు, చదువు కొలది
కొత్త అర్థ మేదొ గోచరించుచు నుండు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కొంతమంది 'గొప్ప'కొరకు పుస్తకములు
కొని, అలంకరించుకొందు రిండ్ల;
విలువ పెరుగు గ్రంథములు గల యిండ్లకు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్ము హస్త భూషణ మ్మౌను, మ
స్తిష్కమునకు తెలివితేట లొసగు;
చదువుకొన్న వాడు సదసద్వివేకియౌ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

గతమునందు లేక గత్యంతర మెదియు,
సాగె మౌఖికముగ చదువు లెల్ల;
'అచ్చు' తీర్చివైచె నట్టి కష్టము లెల్ల!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

గురువు లేని చోట 'గురు'బాధ్యతను తానె
పూని విద్య గరపు పుస్తకమ్ము;
కాన,గురుని రూపుగా నెంచదగు దాని!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

గురు ముఖమున నేర్చుకొను విద్యతో సాటి
కాదు గాని, పుస్తకములు చదివి
పొందుచుండి రెందరెందరో పట్టాలు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

తెలిసి పుస్తకాల విలువ, కొందరు మాని
పుష్ప గుచ్ఛములను,పుస్తకాలె
అతిథులకును సభల నందించుచున్నారు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

మంచి పుస్తకాల నెంచి పిల్లలకు కా
న్కలుగ నిచ్చుచుండ వలయు తరచు;
దాన గలుగు నెంతయేని సత్ఫలితమ్ము!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పాఠ్య పుస్తకాలె పరమార్థ మైపోయె,
దారి తప్పె చదువు తీరు; యువత
మేలు జేయు పుస్తకాలె ముట్టక యుండె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చదువు చదువు చదువు, చదు వొక్కటే! ర్యాంకు
కొరకె చదువుకొనుట, పరుగు లిడుట;
ఇతర పుస్తకాల కేదీ సమయ మింక?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చాలమంది పుస్తకాలు రచించి, ప్ర
ఖ్యాతులైరి లోకమందు; గ్రంథ
కర్తలైన వారు కీర్తిపాత్రులు కదా
ప్రస్తుతించ దగును పుస్తకమును!

భౌతికముగ సుకవి పంచత్వ మొందిన,
గ్రంథకర్త కీర్తి కాయమునకు
నశ్వరమ్ము లేదు,శాశ్వతమ్మై యుండు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కావ్య కర్త తోడ కావ్య పోషకుడును
నిలుచు సతము కీర్తనీయు దగుచు;
అందు కొరకె అంది రంకితా లెందరో!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

వేల యేండ్ల క్రితమె కాలము చేసిన
పూర్వ కవుల మరచిపోయినామె?
సంస్మరించుకొనమె సత్కవీశుల నెప్డు?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ఉద్యమాలు నడపి రూరూర గ్రంథాల
యములను నెలకొల్పు డనుచు ప్రజలు;
అది గతమ్ము, కాన మా స్థితి నీవాడు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకము లొసంగు స్ఫూర్తి యెంతనవచ్చు?
వ్యక్తి పొందవచ్చు శక్తి కొలది;
మంచి పుస్తకాలె యెంచి చదువవలె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అచ్చు పడిన మాత్ర నన్ని పుస్తకముల
నెంచరాదు మంచివే యటంచు;
చెప్పరానియంత 'చెత్త'రచన లుండు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

వచ్చి రాని వారు పిచ్చి వ్రాతలు వ్రాసి,
అచ్చు వేయుచుండు రచ్చటచట;
అట్టి పుస్తకముల పట్టించుకొనరాదు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అందునందు కొంద రర్హత లేకున్న,
అదియు నిదియు వ్రాసి,అచ్చువేసి,
పంచు పుస్తకములు మంచి చేయుట కల్ల!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

తట్టుకొనగలేని తమ కీర్తి కండూతి
బాపుకొనగ బూని వ్రాతలకును,
ప్రజల హింసబెట్టు 'పర కవు' లెందరో!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్ము చూడ ముచ్చటగా నున్న
మెచ్చు పాఠకుండె నొచ్చు నచ్చు
తప్పు లున్న దాన, తలనొప్పియౌ గదా!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పంటి కింద రాయి పడినట్టులౌ కంట
బడిన నచ్చు తప్పు పాఠకునకు;
అర్థ విపరిణామ మందందు తలయెత్తు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

మచ్చుకైన నొక్క అచ్చు తప్పును లేని
పుస్తకములు పెక్కు ముద్రవేసి,
వాసి గాంచినారు 'వావిళ్ల వా' రప్పు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ఏల వ్రాయవలయు బాల సాహిత్యము?
చదువు వార లేరి? సమయ మేది?
పాఠ్య పుస్తకాలె భారమైపోయెను!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కల వసంత సంఖ్య గ్రంథాలయములు ప్ర
పంచ వ్యాప్త మగుచు; ప్రస్ఫుటముగ
తెలియు పుస్తకముల విలువ దీనిని బట్టి!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కనుల పండు వౌను గ్రంథాలయములలో
కొలువుదీరి యున్న గొప్ప గొప్ప
పుస్తకముల జూడ,పులకించు గద మేను!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్ము జూడ పూనకమే వచ్చు,
నిదుర పట్ట దింక చదువకున్న;
కొంతమంది తీరు వింతగా నుండును!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తక పఠనమ్ము పూర్వకాలము నుండి
మంచి లక్షణముగ నెంచబడెను;
'పుస్తకాల పురుగు'ముచ్చటైన బిరుదు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కంటబడిన పుస్తకము మంచి దొక్కటి,
మరచి తిండి, నిద్ర మాని, 'పుస్త
కాల పురుగు' చదువగల దహోరాత్రము!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

తమకు నచ్చు పుస్తకము కంటబడినచో,
కొనక యుండలేరు కొంతమంది;
ప్రస్తుతించ వలదె పుస్తక ప్రియులను?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్ము నెరవు పుచ్చుకొందురు గాని,
తెచ్చి దాని తిరిగి యిచ్చు టరుదు;
ప్రాజ్ఞు లయ్యు నిటులె వర్తింతు రేలనో?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్ము లెరవు పోయిన,నిక వాని
మరచిపోవ వలయు, మరలి రావు;
తిరిగి వచ్చుచో అదృష్ట ఫలమ్మెయౌ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చిన్నతనము నుండి,కన్నవారే మేలు
కలుగు బిడ్డలకును గాన దాన,
ప్రోత్సహించ వలయు పుస్తక పఠనమ్ము!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

శాశ్వతముగ నిలుచు సప్త సంతానము
లందు కృతి యటంచు నార్యు లనరె?
పుస్తకమ్ము స్థిర,మపూర్వ సంచయ మది!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ప్రముఖులైన వారు తమను మార్చిన పుస్త
కముల గూర్చి తెలుపు ఘటన లుండు;
అట్టి పుస్తకము లనర్ఘ రత్నములెయౌ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

నచ్చు పుస్తకములు, మెచ్చు పుస్తకములు,
హెచ్చరించి ప్రోత్సహించు పుస్త
కములు,మార్గదర్శకము లైనవియు నుండు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

జీవితమున వచ్చు చిక్కు సమస్యల
నెదురుకొని పరిష్కరించజాలు
జ్ఞాన మిచ్చు పుస్తకము లుండు నొక కొన్ని!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అన్ని పుస్తకము లనర్ఘ రత్నములు కా,
వుండు గులకరాళ్లు మెండుగానె;
పాఠకుండె తెలియవలె మంచి చెడ్డలు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

మేలు చేయు పుస్తకా లున్న యట్టె,పు
స్తకము లుండు కీడు సల్పునవియు;
'కలుపు'పంటచేల గలసి యుండును గదా!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

దారి జూపు కొన్ని,దారి తప్పించును
కొన్ని, పుస్తకాల నెన్నియేని
తెరగు లుండు నిట్లె,ధీశాలి కనవలె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అదియు నిదియు ననక అన్ని విశేషాలు
పుస్తకాలలోన పొందుపరచి,
మేలు చేసినారు మేధావు లెందరో!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

గ్రంథ రచన సులభ కార్యము కాదు, కృ
త్యాద్యవస్థ లుండు, నవ్వి గడచి
వ్రాసి పూర్తిచేయవలె సమర్థత మీర!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అచ్చుపడిన మాత్ర నది గొప్ప పుస్తక
మని తలంచరాదు, పనికిమాలి
నట్టి పుస్తకములు నతిమాత్రముగ నుండు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పొందు నొకడు తృప్తి విందు విస్తరి జూచి,
పొందు తృప్తి మంచి పుస్తకమును
గాంచి వేరొకండు కడుపు నిండిన యట్లు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అక్షరాల నిండ అనుభవామృత సార
ముండు, పాఠకుండు పిండుకొనగ
వలయు పుస్తకాలు పఠియించి కడు శ్రద్ధ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకాల పైన మో జెంతగా నున్న,
చదువ నిపుడు వీలు కుదురకుండె;
బతుకు తెరువు కొరకు పరుగులు,నురుకులు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

గతము వోలె నిపుడు కన్పించ దుర్గ్రంథ
పఠనమునకు వెసులుబాటు, కాన
చిన్న పుస్తకాలె మన్నన గనుచుండె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

వ్రాయువార లేరి?ప్రచురించువా రేరి?
ఏరి కొని పఠించువారు? తగ్గి
పోవుచుండె పెద్ద పుస్తకమ్ముల 'హవా'!
ప్రస్తుతించ దగును 2పుస్తకమును!

సంప్రదించు గ్రంథ సంచయ మింటిలో
నున్న, అవసరమున నుపకరించు;
సందియములు గలుగ సత్వరమే తీరు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కొత్త పుస్తకమును కొన్న పుస్తకప్రియుం
డెంతగానొ సంతసించు, నిష్ట
వస్తు వందుకొన్న వ్యక్తి సంతృప్తుడౌ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

'ఖర్చు' దుర్వ్యయమ్ము కాబోదు సద్గ్రంథ
ములను కొన్నయెడల; పుస్తకమ్ము
కొనరు గాక కొనరు కొంద రేనాడును!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పూలమాల లేల?పుష్ప గుచ్ఛము లేల?
వ్యయము తప్ప నెట్టి ఫలము లేదు;
బహుమతులుగ నీయవచ్చు సద్గ్రంథాలు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అచ్చుపడక యుండె నపురూప గ్రంథాలు
కొన్ని, దొరకకుండె కొనుట, కవి ప్ర
భుత్వ సంస్థలైన ముద్రించవలె పూని!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

బాల పుస్తకాలు వ్రాయువా రున్నారు,
లేరు ప్రచురపరచు వారు నేడు;
చదువువార లేరి? చదివించువా రేరి?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కొనరు పుస్తకాలు కొంద రేనాడు, పు
స్తకము లన్న నుండు తగని ప్రీతి;
ఎరవు పుస్తకముల కెగబడుదురు వారు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కవుల చేత పుస్తకాలు వ్రాయించి, ము
ద్రించి కొంతమంది తృప్తు లగుట
కానవచ్చు కీర్తికాంక్షతో నందందు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కవుల కాశ్రయమ్ము కల్పించి 'ధనికులు'
తమ అభీష్టములకు తగినయట్లు
గ్రంథములను గతము వ్రాయించుకొన్నారు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అన్ని పుస్తకాలు అందరు చదువరు,
రుచుల భేదముండు లోకమందు;
కొన్ని పుస్తకాలె కొంతమందికి నచ్చు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

సార్వకాలికములు, సార్వజనీనమ్ము
లైన పుస్తకాలు కానవచ్చు;
చదువ వలయు నవ్వి సర్వులు తప్పక!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పాఠ్య పుస్తకాల వలన నేర్చెడి విద్య
బ్రతుకు తెరువు చూపవచ్చు గాని,
'భృతక విద్య' జ్ఞానతృష్ణ తీర్చుట కల్ల!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కవుల జీవితానుభవ సారమే పుస్త
కముల రూపు దాల్చు గాన, చదివి
పఠిత మేలు పొందవచ్చు నెంతేనియు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

గొప్ప పుస్తకమ్ము కొని పఠించిన వార
లందరు సమలబ్ధి పొందలేరు;
స్థాయి బట్టి పఠిత జ్ఞానార్జన మ్ముండు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ప్రతి దినమ్ము చదువవలె నెంతయో కొంత,
నిదుర పట్టబోదు చదువకున్న;
ఉండు రందునందు కొంద రీ తీరున!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

మూతలు పడునంట పుస్తకమ్ము తెరువ
గానె కొంతమంది కనులు; వారు
పొందు టెట్టు లింక పుస్తక ఫలితాలు?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమును వదలబోరు కొందరు ప్రయా
ణమును చేయుచున్న సమయమునను;
వ్యర్థపుచ్చ నిష్టపడరు వారు క్షణమ్ము!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

సమయ మేది నేడు చదువ నుద్గ్రంథాలు?
పరుగు లురుకు లాయె బ్రతుకు! లైన
మనసు గలుగనేని మార్గ ముండకపోదు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

వాస్తవముగ నిపుడు పుస్తక పఠనమ్ము
తగ్గె, కారణాలు తడువకుండ,
వీలు కొలది చదివి,మేలుపొందుట లెస్స!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

మంచి లక్షణముగ నెంచబడును గ్రంథ
పఠన, ముండు దాన ఫలితములును;
కాన,దాని నెవరు మానివేయగరాదు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ప్రోత్సహించ వలయు పుస్తక పఠనమ్ము
బాలలందు,భవ్య భావి కొరకు;
దృష్టి పెట్టవలయు దీనిపై పెద్దలు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అచ్చు కెక్కకున్న, అత డెన్ని పుస్తక
ములు రచించియున్న ఫలము సున్న;
పఠిత కందనట్టి వ్రాతకు విలు వేమి?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

రాసి బట్టి గాక, వాసి బట్టియె కీర్తి
దక్కు రచయితలకు; మిక్కుటముగ
వ్రాసి పేరుపడని వా రెందరో కదా!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

తరచు పుస్తక ప్రదర్శనమ్ములు, అమ్మ
కములు గూడ నేడు కానవచ్చు;
పుస్తకప్రియత్వమును చాటవా యివ్వి?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కొత్త పుస్తకాలు కోకొల్లలుగ వచ్చు
చుండె, ప్రజలు చదువుచుండి రవ్వి;
కానరాదు లోటు క్రయ-విక్రయమ్ముల!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కలవు పేరుపడ్డ గ్రంథాలయము లెన్నొ
గొప్పచేసి చెప్పుకొనరె? జ్ఞాన
పుష్కరిణులు కావె పుస్తకాలయములు?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకాలయములె పుణ్యస్థలమ్ములు
జ్ఞానతృష్ణ గలుగు మానవులకు;
పుస్తకముల వారు పూజించుచుందురు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పూజ గదులవోలె పుస్తకాల గదులు
కొంద రిళ్ల నుండు నందు నందు;
చదువు విలువ నెరుగు సంస్కార మట్టిది!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అట్ట రూపు జూడ నంతంత మాత్రమే,
జ్ఞాన పుష్పములు లోని పుటలు;
ఇట్టి పుస్తకములు నెడనెడ గనవచ్చు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ఇంట 'జ్ఞాన శుక్తి'వంటి పుస్తక మున్న,
దాని జూడ డెపుడు, తాకబోడు;
మూర్ఖ జనుడు సహజ పుస్తక విద్వేషి!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకాల నెపుడు ముట్టకుండిన వాడు
ప్రజల నేలవచ్చు ప్రబలి, కాని
విద్య లేని వాడు విజ్ఞాని యె ట్లౌను?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చంటిబిడ్డ కన్న జాగ్రత్తగా పుస్త
కమును జూచువారు గలరు; నలుగ
నీరు వారు, మాయనీరు పుస్తకమును!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కొత్త పుస్తకమ్ము కొనగానె కొందరు
మొదట అట్టవేయు ముచ్చ టుండు;
చదువు వంటి వెల్ల తదుపరి అంశాలె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ఎరవు పోయెనేని తిరిగి వచ్చుట సంశ
యమ్ము గాన, పుస్తకమ్ము నీయ
నిష్టపడరు కొంద రెవరికి ,నేనాడు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తక పఠనమ్మె ముఖ్య ప్రవృత్తిగా
బ్రతుకుచుండినట్టి వారు గలరు;
గడవకుండు నెట్లు కాలమ్ము వారికి?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చాల మేలు గూర్చు సద్గ్రంథ పఠనమ్ము,
చిత్త శాంతి కలుగజేయు గాన,
వృద్ధు లెందరికినొ యిది వ్యాపక మ్మౌను!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

దుర్వ్యయమ్ము మాని, దొడ్డ పుస్తకములు
కొందు రొక్క కొంతమంది; అధ్య
యనము వలన గాదె మనిషి మనీషియౌ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకాల వలన పొందు విజ్ఞాన వి
నోదములకు సాటి లేదు; సులభ
సాధ్య మార్గ మిదియ సామాన్యులకు గూడ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ఇంట గూరుచుండి,ఒంటరి తనము జ
యించవచ్చు నొక్క మంచి పుస్త
కమ్ము తనకు తోడుగా లభించిన చాలు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకాల పైన బుద్ధి పెట్టుట చిన్న
తనము నుండె నేర్పదగును, దాని
వలన సత్ఫలములు కలుగుట తథ్యము!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చాల మార్పు లొదవె సాంకేతికముగ, ఊ
హించరాని వింత లెన్నొ పొడమె;
ఐన పుస్తకముల నవి యడ్డజూలవు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అనుభవైకవేద్య మౌగాదె పుస్తక
పఠనమున లభించు ఫలము! వ్యక్తి
యోగ్యతలను బట్టి యుండు తత్ఫలములు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమున నుండు 'వస్తు'వొక్కటె యైన,
అర్థ ఫలమె పఠిత లందగలరు;
స్థాయి బట్టి తారతమ్యమ్ము లుండును!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

సులభశైలి నుండవలె పుస్తకమ్ముల
లోని భాష, అట్లు కాని యెడల
చదువబడవు హెచ్చు సంఖ్య పుస్తకములు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమును దైవముగ నెంచి, పూజించి,
తలను దాల్చు సంప్రదాయ ముండె;
ఆది నుండి పూజ లందె పుస్తక మిట్లె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమ్మును చదువుల తల్లి రూపుగా
నెంచి, మిగుల గౌరవించుటయును
గానవచ్చు తరచుగా సమాజమునందు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కాలు తగిలెనేని కడు భక్తితో మ్రొక్కి,
కళ్ల కద్దుకొనుట కాన నౌను;
ప్రజల కంత గౌరవము పుస్తకము పట్ల!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

వితరణముగ పేద విద్యార్థులకు కొంత
మంది పుస్తకముల నందజేసి,
వంద్యు లగుట కానవచ్చు నందందున!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చాల తెలుగు పుస్తకాలు 'సీపీ బ్రౌను'
గారి వలన నిలిచె; వారు మనకు
వందనీయు,లట్టి వారిని మరతుమా?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకముల చదివి పొందవచ్చును జ్ఞాన
ఫలము లెన్నియేని, వ్యక్తిగత స
మర్థతలను బట్టి మానవు డవి పొందు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చదువు లేనివారు సైతము పుస్తక
మును సగౌరవముగ గనుట గలదు;
పుస్తకము మహత్త్వమున కది తార్కాణ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పూజ గదులలోన పుస్తకమ్ముల నుంచి
భక్తి వ్యక్తపరచు వారు గలరు;
కలదు విలువ పుస్తకముల కా స్థాయిలో!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కలరు పుస్తకమును గౌరవించెడి వారు,
గౌరవించనట్టి వారు గలరు;
పుట్టు గ్రుడ్డి రత్నమును గుర్తు పట్టునా?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకమున నుండు 'వస్తు'సమస్తము
నెల్లరికిని నుపకరించుకున్న,
పాఠకులకు 'విషయ'పరిచయమౌ గదా!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

ఎన్ని భాష లెరిగియున్న, సులభతర
మౌను మాతృభాషలోనె పుస్త
కమును చదువుకొనుట, కాదందు రెవ్వరు?
ప్రస్తుతించ దగును పుస్తకమును!

చెప్పలేని ప్రేమ చిననాటి నుండి పు
స్తకము లన్న నాకు, చదువుచుందు
అదియు నిదియు ననక, అన్ని ప్రక్రియలును!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కలదు నాకు పుస్తకాలపై నెనలేని
ప్రేమ, దినము దినము పెరుగుచుండె;
కలదు నాకు చిన్న గ్రంథాలయము గూడ!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

పుస్తకాలె నాకు నేస్తాలు, దిన మెల్ల
గడపుచుందు పుస్తకాలతోనె;
కాన, 'పుస్తక శతకము' రచించితి నిట్లు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కాకి పిల్ల ముద్దు కాకికి అనునట్లు
నాదు రచన నచ్చు నాకు గాని,
పాఠకులకు నచ్చవలె, మెచ్చవలె వారు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

అందరికిని నచ్చ వన్ని పద్యమ్ములు,
కొన్నియైన మెప్పుగొన్న చాలు;
శతక రచన మింక సార్థక మైనట్లె!
ప్రస్తుతించ దగును పుస్తకమును!

కలము సాగుచుండె గాని, శతక పరి
మితిని పద్యసంఖ్య మించె గాన,
పాఠకులకు 'స్వస్తి' పలికి, నే విరమింతు!
ప్రస్తుతించ దగును పుస్తకమును!



-హెచ్.ఆర్. చంద్రం
సెల్: 9493248053

తప్పని మాట

పెళ్ళిముందు ప్రమాణాల్లో
నువ్వు నేను ఒక్కటే నన్నావ్
మన మాట మనసు కూడా
ఒక్కటిగానే ఉంటాయన్నావ్ !
నేనెప్పుడూ నీ దానినే నన్నావ్.
ఇప్పుడూ అదే అంటున్నాను కదా !
నువ్వెప్పుడూ నాదానివే
నీ శరీరం హృదయం ఎప్పుడూ నావే
నేను నువ్వే ఎప్పటికీ !.
నీ ఇష్టాలు కోరికలు
నా ఇష్టాల కనుగుణంగా మలిచాను కదా !
నా సరదాలు సుఖాలు నీవిగానే
భావిస్తావు కదా!.
నా మనసులోని మాటెప్పుడూ
నీ పెదాలు పలకాలంటున్నా గదా
నా వాళ్ళను నీ వాళ్ళుగా చూసుకొమ్మన్నా కదా
నా కష్టాలు, బాధ్యతలు నీవి గానే మార్చేసా కదా.
ఇప్పుడు నువ్వు నా నువ్వే కదా!
నువ్వు నువ్వు గా ఎక్కడున్నావని !
నేనే నువ్వు అయిపోయావ్ కదా!.
ఇప్పుడు చెప్పు.ః
ఇంక నేను మాటెప్పుడు తప్పానని!?.

-డాక్టర్ వాణీ దేవులపల్లి
9866962414



"వట్టి కోట" కాదు "గట్టి కోట"

తండ్రి లాలన తక్కువ దొరికినా
గురువు చెంతనే బతుకు నేర్చినవాడు
నక నకలాడే డొక్కల నడుమ
ఎండిన పేగుల ఏడ్పు చూసినవాడు
పండిన పంటలు పరుల పాలవుతవుంటే
వండిన వంటనే వరమనుకున్న వంటవాడు
మెతుకు కోసం వెతుకుట మాని
బడుగులనైక్యం చేసిన వాడు
చెమట నెత్తురుల మట్టి ముద్దలతో
మాటల బాంబులు విసిరినవాడు
పతితుని హృదయం పగిలిన అద్దం
చిదుమ పోతే ఛిద్రం
చేస్తుందన్న వాడు
కులాలు మతాలు కూడు పెట్టవని
మనుషుల మధ్యన అడ్డు గోడలన్నవాడు
శాంతిని కోరే క్రాంతి కోసమై
భ్రాంతిని వీడి బ్రతుకుమన్న వాడు
సాయుధ పోరులో సాగిన తీరును
ప్రజల మనిషిగా ప్రచురించిన వాడు
చీమకు కూడా హాని చేయక
ప్రజాసాహిత్యానికి పాదులు వేసిన వాడు
మహాకవి దాశరథి
అగ్నిధార నే అంకితం అందుకున్న ప్రజాకవి వట్టికోట.!
తెలంగాణ మాగాణిలో తెగువ ఉన్నంత కాలం
మిగిలి ఉంటుంది ఆయన కట్టిన గట్టికోట.!

- పెసరు లింగారెడ్డి
9010292500

శరత్ చంద్రిక

పడమటి దిక్కున
సూరీడు పగడపు ముద్దాయి
కనుమరుగు కావటం ఆలస్యం
తూర్పు దిక్కునుండి
శరత్ జ్యోత్స్నులుజగతి నంతటిని
రజిత మయం చేసాయి.

చంద్ర కిరణాల మధువుని గ్రోలి
తరూలతలు మత్తుగా శయనించాయి
చకోరాలకి ఈ కిరణాలే కదా అమృతము !

మనసులోని ఆనందం
మోహన రాగ గానమయింది
సముద్రుని ఆనందం చెప్పనలవి కాదు
ఉవ్వేత్తున ఎగిసి దరికి రమ్మని
ఆశశాంకుని ఆహ్వానిస్తున్నాడు
ఎడారిలో ఇసుక బయలులు
పాలసముద్రమై
చిత్త భ్రాంతిని కలిగిస్తున్నాయి
మొగలి పొదల మాటునుండి
శ్వేతనాగు బయలిడి
మదించి నర్తిస్తున్నది

కవుల హృదయాలు ఉప్పొంగి
కలాల నుండి వెన్నెల
కిరణాలను పోలిన
కవితా కిరణాలు జాలువారాయి.

శరదృతువు లోని నల్లనయ్య
రాసక్రీడల మనోహర దృశ్యం
కనులముందు కదలాడుతుండగా
ఓ పక్క ఆనందం
మరోపక్క ...
ఈ ఆనందం ,ఈ శోభ
తాత్కాలికమే అనే
మనసు మూగ వేదన.

తాత్కాలిక మైతేనేమీ

'వేయి పడగల మేధావి' పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి ప్రాంగణంలోని సాంస్కృతిక శాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవ కమిటీ సమావేశంలో వెల్చాల చంద్రశేఖర్ రచించిన వేయి పడగల మేధావి పుస్తకావిష్కరణ జరిగింది. పుస్తక తొలి ప్రతిని ఇటీవల సీఎం కేసీఆర్‌కు అందజేసిన విషయం తెలిసిందే. శతజయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు, ప్రముఖ పాత్రికేయులు రామచంద్రమూర్తి, ప్రభుత్వ సలహాదారు డా॥కే.వీ.రమణాచారి, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు, పుస్తక ప్రచురణకర్త, పీవీ కుమార్తె సురభివాణిదేవి, పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు, కమిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రావు, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1న డా॥ కూర్మాచలం శంకరస్వామి రచించిన "మబ్బుల మాటు" ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న ఆకాంక్ష కేటరర్స్ చైర్మన్ అశ్వాపురం వేణుమాధవ్. వేదికపై కందుకూరి శ్రీరాములు, మోతియా నాయక్, బైస దేవదాసు, డా॥ తిరునగరి, డా॥ కూర్మాచలం శంకరస్వామి.

నవంబర్ 1న డా॥ కూర్మాచలం శంకరస్వామి రచించిన "మబ్బుల మాటు" ఆవిష్కరణ సభలో శంకరస్వామి దంపతులను సత్కరిస్తున్న కుద్బుల్లాపూర్ శాసన సభ్యులు కె.పి. వివేకానంద మరియు అతిథులు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

పోటీ ఫలితాలు

నిర్వహణ: డా॥ప్రతికంఠం మాలతీలత

ఈ సమూహంలో చేరదలచినవారు 89856131 23కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ
బహుమతి విజేత

శీర్షిక: బ్రతుకుదెరువునిల్పుదాం...!

పల్లవి:
మొక్కవోని దీక్ష తోడ మొక్కలు నాటాలి
చుక్కల వలె నేలపై పచ్చని వెన్నెల రీతి //మొక్క//
చరణం:
చెట్లేరా జీవతతికి ప్రాణదాతలు
గాట్లేరాపర్యావణసుజలధారలు
జీవ కారుణ్యానికిమేలుచేయగా
భావిజీవనానికికల్పతరువులు //మొక్క//
అడువులన్నిసరికిఅగచాట్లపాలై
శిలాజాల ఇంధనాల కారిచ్చులై
కవర్లటవర్లతోడపక్షిజాతిపాడవ్వగ
జీవవైవిధ్యమితీరుజీవముడిగిపోగా //మొక్క//
భూగోళమువేడెక్కిమానవాళి బాధచూడు
భూగర్భానకనగనీటిచుక్కజాడలేదు
పర్యావరణముపాడైపచ్చికయళ్ళేవి
గ్రీన్ హౌస్ గాలులుహానికరముచేయగ //మొక్క//
అందఱముఒక్కట్టె కాలుష్యాల పారద్రోల
బిందుసేద్యముతోనీటిచుక్కలోడిసిపట్టి
అంతరించు జీవజాలముహాయిగచరింపచేసి
ప్రగతికోరిసకలప్రాణిబ్రతుకుదెరువునిల్పుదాం/మొక్క

-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

శీర్షిక: రైతు కష్టం

ద్వితీయ
బహుమతి విజేత

అన్నం పరబ్రహ్మ స్వరూపం
కోటి తిప్పాలు కోటికోసం
యంత్రానికి విద్యుత్తు
పెట్రోల్ మనిషి కి శక్తి
బ్రతకడానికి అవశ్యం అన్నం
ఆర్భాటాల పేరుతో
దర్పాన్ని ప్రదర్శించే
స్థితిమంతులు చేస్తున్నారు వృధా
అర్ధ ఆకలితో అల మటించే
అభాగ్యులు...పోషక లేమి
తో నవ జాత శిశువుల మరణాలు
ఉచిత బియ్యం అనుచితం అయ్యి
నల్లబజార్లో నల్ల శ్రీమంతులు కాబట్టిరి
ఒక్కడికి తిండి అరుగక తంటా.
మరొకరికి తిండి దొరకక మంట
ఒకడు అధికం అయ్యి ఒబేసిటీ తో ఉబ్బితబ్బిబ్బు
అయితే..ఆహార లేమి తో
రక్త హీనతతో..శల్యం కాబట్టే
పండించే రైతుకు గిట్టుబాటు లేక
కొనే వాడికి చుక్కల్లో ధరలు..రైతు హాత్మహత్యాలు...
దళారి దర్జా జీవితం..తీవ్ర మనస్తాపం...
మానసిక వేదన
లంకె కుదరని జీవితాల్లో ఆహారం
ఒక నిర్ణయాత్మక పాత్ర అయ్యి..జీవన్నాటకములో
దొంగలుగా,పడుపు వృత్తిలో మరికొందరు..
బాల్యం కుశించి భిక్షగాళ్లుగా..నెరస్తులుగా
భిన్న వికృతలకు లేమి ఆహారం
ప్రాణ వాయువులు ఉన్నంత వరకు ఆహారమే
అండ్జకే బాల్యంలో అన్నప్రాసన..
మరణం తర్వాత.పిండ ప్రదానం
అందుకే సంస్కృతి..చివరకు సాయి
అన్నారు నా భక్తులు ఆహార లేమితో బాధపడొద్దు..
అందుకే సాయి బోధనే..
ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టండి
జీవి ఉన్న ప్రాణికి అన్నము సమర్పించండి..
జై జై సాయి సద్గురు సాయి
అక్షరాల అన్నం పరబ్రహ్మ స్వరూపం

-వి.శేషారావు
9440408080

జ్ఞాపకాలు అక్టోబర్ 29

అక్టోబర్ 29, 2014న త్యాగరాయ గానసభలో కిరణ్ సాంస్కృతిక సమాఖ్య "మాట" అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీలో పురస్కారాలు అందుకున్న వారితో డా॥ కళా వేంకట దీక్షితులు, డా॥ ఓలేటి పార్వతీశం,సుద్దాల అశోక్‌తేజ, డా॥సినారె, బైస దేవదాసు, పి. కృష్ణమూర్తి, లంకా వెంకట సుబ్రహ్మణ్యం.

అక్టోబర్ 29, 2014న త్యాగరాయ గానసభలో పి. కృష్ణమూర్తి అనువాదకథలు "ప్రతిధ్వని" పుస్తకాన్ని ఆవిష్కరించిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సీ. నారాయణరెడ్డి. వేదికపై డా॥ కళా వేంకట దీక్షితులు, డా॥ఓలేటి పార్వతీశం, సుద్దాల అశోక్‌తేజ, బైస దేవదాసు, పి.కృష్ణమూర్తి, ఎల్వీ సుబ్రహ్మణ్యం.

జ్ఞాపకాలు అక్టోబర్ 30

అక్టోబర్ 30, 2014న కరీంనగర్‌లో ఆచార్య కదారు వీరారెడ్డి రాసిన "కాలం అడుగులు" పుస్తకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి. వేదికపై అనంతాచారి, మాడిశెటి గోపాల్, కె. అనంతరెడ్డి, ఎం.వి. నర్సింహారెడ్డి, దాస్యం సేనాధిపతి, కదారు వీరారెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం. వీర బ్రహ్మయ్య, బైస దేవదాసు, డా॥గంధ్ర లక్ష్మణరావు.

సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

నాటి సభలు, సమావేశాలు...

అక్టోబర్ 29 నుండి నవంబర్ 2 వరకు

జ్ఞాపకాలు అక్టోబర్ 31

అక్టోబర్ 31, 2015న తెలుగు సాహిత్య కళాపీఠం వార్షికోత్సవంలో బైస దేవదాసును సత్కరిస్తున్న సంస్థ అధ్యక్షులు చిక్కా రామదాసు, కార్యదర్శి పట్లాల అశోక్, డా॥ తిరునగరి తదితరులు.

అక్టోబర్ 31, 2019న కళా లలిత కళా వేదికలో 'భారత రత్న' సర్దార్ వల్లభ బాయి పటేల్‌గారి జయంతి సభలో నివాళులర్పిస్తున్న రేణుక, శంకర నారాయణ, కళా జనార్దనమూర్తి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఎం.వి. రాఘవాచార్యులు.

జ్ఞాపకాలు నవంబర్ 1

నవంబర్ 1, 2019న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'జక్కీ' కవితా సంకలనం ఆవిష్కరణలో ఆజంఖాన, కవయిత్రి సర్ఫీన్‌ఖాన్, ఆవిష్కర్త సర్ఫీన్‌ఖాన్ మాతృమూర్తి సైదాబి, స్వైబాబ, పసునూరి రవీందర్, షాజహానా, బైస దేవదాసు, తదితరులు.

నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న డా॥ కె.వి.రమణాచారి, ఎల్వీ సుధీర్ కుమార్, పద్మలతా జయరాం.

నేటి నిజాలు

ప్రకటన

గత కొంతకాలంగా ప్రసిద్ధకవి "పాట వెలదుల" సృష్టికర్త డా॥వడ్డెపల్లి కృష్ణ మరియు 'నేటినిజం' దినపత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పాట వెలదుల' పోటీకీ ఎందరెందరో తమ రచనలు పంపినందులకు, పోటీలో విజేతలైన వారందరికీ అభినందనలు . సహకరించిన వారందరికీ ధన్యవాదాలు.అనివార్య కారణాల వల్ల ఈ పోటీలను ఈ నెలతో నిలుపుదల చేస్తున్నాము.

-'నేటినిజం' దినపత్రిక సంపాదకులు

అక్టోబర్ నెల "పాట వెలదుల" విజేతలు

ప్రథమ

మారుచున్న కాల మహిమ జూడ
మతియె పోవుచుండె హితము గనక
వెతల తోనె ముగియు వేల కథలు
దారిజూపు మయ్య దానవారి!!!
మంచి మాటలాడ మమత లూరు
కటువు గాను బలుక కలత రేగు
తేనె వంటి దోయి తెలుగు భాష
తెలిసి గ్రోలుమయ్య తేటి వోలె..!!!
గురుని ప్రతిమ బెట్టి కుదురు గాను
ఏకలవ్య చదువు నాకళించె
పట్టు దలను బూని పాట బడిన
కాని పనులు గలవె గంధవతిని..!!!
చందమామె నింగి కందమిడును
అందమిడును పూలు గంధవతికి
మగువ కందమిడును నగవె సతము
మాసి కందమిడును మంచి మాట!!!
స్వార్థబుద్ధిలేక జవము లేక
అస్త్ర శస్త్ర బలము లసలు లేక
బాపు తెచ్చె స్వేచ్ఛ భరతమునకు
నేత యనగ ధరకు జాతిపితయె..!!!

-ఆకుండి శైలజ
8341573853

ద్వితీయ — జ్ఞానజ్యోతి గురువు

చదువు లెన్నొ చెప్పు చక్కగాను
మంచి చెదులు చెప్పె మనకు గురువు
అక్షరాలనిచ్చి నాయుధంగ
జీవితాన మనకు భావినిచ్చు

నల్లబల్లపైన తెల్లగాను
అక్షరాలు రాసి అమృతమైన
జ్ఞానమిచ్చు గురువు జ్ఞాన జ్యోతి
బదుకు తెరువు చూపు బ్రహ్మలాగ

గురువులెపుడు చెప్పు విరివి విద్య
మనసు పెట్టిచదువు మరిచిపోకు
గురువులేని విద్య గుడ్డి విద్య
గురువుబోధనిచ్చు గొప్పబతుకు

జ్ఞానమిచ్చుగురువు జ్ఞాన జ్యోతి
భవితజూపి మనకు బాటవేసె
బాధ్యతలను దెలుపు బాలలకును
గుడినికట్టుకొమ్ము గుండెలోన

పసిడి ప్రాయ మందు బాగు కొరకు
మంచి మాటజెప్పి మనసు మార్చు
దైవమందు గురువె దైవమన్న
కొలుచుకొమ్ము రోజు కోవెలందు

-శీలోజు శోభన్ బాబు
9676858160

తృతీయ — నేటి మా పల్లె తీరు

పల్లె నేడు లేదు పల్లె వోలె
పాత పద్ధతులను పారద్రోలి
కొత్త పోకడలట కోరివచ్చె
పల్లె తీరు చూసి బాధ కలిగె

పంటభూమితగ్గి పల్లెజనము
పాడిపంటలొదిలి పట్నమేగె
చెరువులందువెలసె విరిగి ఇండ్లు
పల్లె చిన్నబోయె పనులు లేక.
....ఇంకా పల్లె ప్రజల తీరువిలా ఉందంటే...

చద్దికూడుమాని జావమాని
ఫాస్టుపుడ్డు తినుట ఫాస్టునాయె
పాలు మజ్జిగొదిలి పెప్సిదాగె
బావినీరుబదులు బాటిలొచ్చె

సెల్లుఫోనులోన సొల్లు పెరిగి
రచ్చబండ కడకు రారువెవరు
రాత్రిపూట లేదు రామభజన
సీరియళ్లు వచ్చి చేటుదెచ్చె

పెద్దలన్న భయముభక్తి లేదు
వారిముందెతాగి వాగుచుంద్రు

ఆడవార్ని జూతు రలుసుగాను
లవ్వుపేర్నవార్ని లాగుటాయె

తగవులు గొడవలును తగనికక్ష
పెరిగిపోయెనేడు ప్రేమ తగ్గి
కలసిమెలసి లేవు కాపురాలు
మరిగిముక్కలాయె మనసులిరిగి.

అమ్మభాషనొదిలి ఆంగ్లమనిరి
అదియురాకనాగె వారి విద్య
పనికిచదువుకు పాడు అయిరి
గ్రామయువత వట్టి గాడిదాయె

ఫేషనంటి రయ్యె! ఫేషనంట!
పల్లె కాదు పోనిపట్నమవదు
రెంటికీ చెడియిది రేవడాయె
ఏమి చెప్పుదునిది నేటినిజము.

-దశిక జగన్మోహన్ బాబు
9440872142

జ్ఞాపకాలు నవంబర్ 1

సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

నవంబర్ 1, 2018న రంజని తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో ఏ.జి. ఆఫీసులో దసరా-దీపావళి ప్రత్యేక సంచిక" ఆవిష్కరణలో యం. వెంకటరమణ, యన్. మురళీకృష్ణ, ఎమ్మెస్సార్ మూర్తి, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి. రమణ, పరుచూరి వెంకటేశ్వరరావు, ఎల్వీ సుధీర్‌కుమార్, పద్మలతా జయరాం, పి. అనురాధ.

జ్ఞాపకాలు నవంబర్ 1

నవంబర్1, 2016న కళా సుబ్బారావు కళావేదిక హైదరాబాద్‌లో "కాహళిక" పద్య కండికల సంపుటి ఆవిష్కరణ సభలో పొత్తూరి సుబ్బారావు, బైస దేవదాసు, డా॥ఓలేటి పార్వతీశం, రచయిత డా॥ రజనీ గంగాధర్, ఆవిష్కర్త పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, డా॥కె.వి. దీక్షితులు, పాదేడి జాన్సన్.

సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

జ్ఞాపకాలు నవంబర్ 2

నవంబర్ 2, 2017న త్యాగరాయ గానసభలో "చార్లి చాప్లిన్ జయంతి" సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న 'నేటినిజం' దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, చక్రపాణి, యన్. మాధవి, రేణుక, శ్రీదేవి, ఆనంద్‌రెడ్డి, జూలూరి గౌరీశంకర్, కళా

నవంబర్ 2, 2015న త్యాగరాయ గానసభలో 'కుటుంబ సంబంధాలు' అంశంపై కిరణ్ సాంస్కృతిక సమాఖ్య నిర్వహించిన కవితల పోటీలో విజేతలతో శ్రీమతి పీణదాస్, కె. జనార్దనమూర్తి,, డా॥సి. నారాయణరెడ్డి, డా॥ద్వా.నా.శాస్త్రి, బైస దేవదాసు, శ్రీమతి భాను, ఎల్వీ

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com